
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 7

శనివారం 30-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాషన్

కూల్‌గా సొగసుగా!








ఎండలు రోజు రోజూ తమ ప్రతాపాన్ని పెంచుతూనే ఉన్నాయి. రానున్న రోజులను ఎలా తట్టుకోవాలా అని ఆలోచించే వారు తమ డ్రెస్సింగ్‌లో మార్పులు చేసుకుంటూనే ఉన్నారు. క్యాజువల్ వేర్‌గా రోజంతా సౌకర్యంగా ఉండేలా సరైన డ్రెస్ ఎంపికగా ఈ కో-ఆర్డ్ సెట్స్ బాగా సూటవుతాయి. ఈ సమ్మర్‌లో కూల్ అండ్ కంఫర్ట్‌తో పాటు ఎనీ టైమ్ ఎనీ వేర్ అనిపించే ఈ డ్రెస్సులు బాగా నప్పుతాయి.

కాటన్ ఫ్యాబ్రిక్
కో-ఆర్డ్ సెట్స్‌లో ఈ కాలం కాటన్ మెటీరియల్‌కే మొదటి ప్రాధాన్యత. వీటిలో ఖాదీ, ఇక్కత్, ప్రింటెడ్ కాటన్స్‌ని ఎంచుకోవచ్చు.


ఆహ్లాదకరమైన రంగులు
ముదురు, లేత రంగుల్లోనే కాదు డిజైన్స్‌లో ఆహ్లాదకరంగా అనిపించేవి ఎంచుకోవాలి. వేసవి వేడి నుంచి మన కంటికి హాయిగొలిపే డిజైన్స్, రంగులపై దృష్టి పెట్టడం మంచిది.

టాప్ డిజైన్స్‌లో మార్పులు
ఈ డ్రెస్ సెట్‌లో టాప్-బాటమ్ రెండూ ఒకే ప్రింట్, ఒకే కలర్‌తో ఉంటాయి. అయితే, టాప్‌గా షార్ట్ కుర్తీ, పెప్లమ్, జాకెట్ స్టైల్.. ఇలా డిజైన్స్‌లో మార్పులు చేయించుకోవచ్చు. లేదా అలాంటివి మార్కెట్‌లో రెడీమేడ్‌గా ఉన్నవి ఎంచుకోవచ్చు.

డిజైన్స్ కూడా సులువే!
టాప్ అండ్ బాటమ్ ఒకే మెటీరియల్‌తో డిజైన్ చేసుకోవచ్చు. కాబట్టి, బడ్జెట్‌కు తగినవిధంగా మెటీరియల్‌ను ఎంచుకొని డిజైన్ చేసుకోవచ్చు. ఈ వేసవిని ఎదుర్కోవడానికి కూల్‌గా.. కంఫర్ట్‌గా.. సొగసుగా రెడీ అయిపోవచ్చు.

వంటిల్లు

పొరుగు దేశం ఇఫ్తార్



పగలంతా రోజాతో అల్లా ధ్యానం. రాత్రికి ఇఫ్తార్‌తో ఆరోగ్యధ్యానం. నీరసించిన దేహానికి శక్తి కావాలి. ఆ శక్తి దేహానికి తక్షణం అందాలి. ఆహారం ఆరోగ్యకరంగా ఉండాలి. గార్నిషింగ్‌తో పదార్థం రుచి పెరగాలి. రుచి... ఆరోగ్యానికి మేళవింపు కావాలి. ఇఫ్తార్ కోసం పొరుగు దేశాలు ఏం వండుతున్నాయి? దహీ చికెన్‌ను బ్రెడ్‌లో పార్సిల్ చేశాయి. నాలుగు పప్పులు... రెండు ధాన్యాలు... కలిపి హలీమ్ వండుతున్నాయి. అచ్చం మనలాగే.

చికెన్ బ్రెడ్ పార్సిల్



కావలసినవి:
చికెన్ బోన్‌లెస్ – 200 గ్రా
మారినేషన్ కోసం... : మిరియాల పొడి – టీ స్పూన్; మిరప్పొడి – టీ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్; వెనిగర్ – టేబుల్ స్పూన్; వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; తందూరీ మసాలా పొడి– టేబుల్ స్పూన్; పెరుగు– అర కప్పు.
పోపు కోసం: నూనె– టేబుల్ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు.
పార్సిల్ కోసం! మిల్క్ బ్రెడ్ – 10 స్లయిస్‌లు; మైదా – టేబుల్ స్పూన్; కోడిగుడ్లు – 2; లెట్యూస్ – నాలుగు ఆకులు (క్యాబేజ్‌ని పోలి ఉంటుంది); నూనె – వేయించడానికి తగినంత.

తయారీ:
- చికెన్‌ను శుభ్రంగా కడిగిన తర్వాత ఒక పాత్రలో వేసి మారినేషన్ కోసం తీసుకున్న దినుసులన్నింటినీ వేసి సమంగా కలిసే వరకు కలిపి (మారినేషన్) అరగంట సేపు కదిలించకుండా పక్కన ఉంచాలి
- బాణలిలో నూనె వేడి చేసి మారినేట్ చేసిన చికెన్ వేసి కలిపి మూత పెట్టి పది నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికించాలి. మూత తీసి చికెన్ ముక్క ఉడికిందో లేదో చూసుకుని అవసరమైతే మరికొంత సేపు చిన్న మంట మీద ఉంచాలి. ఉప్పు కూడా సరి చూసుకుని అవసరాన్ని బట్టి మరికొంత వేసుకోవచ్చు. చికెన్ ఉడికిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి కలిపి రెండు నిమిషాల సేపు (తేమ పోయే వరకు) వేయించి స్టవ్ ఆపేయాలి
- ఒక కప్పులో మైదా పిండి తీసుకుని తగినంత నీటితో గరిట జారుడుగా కలుపుకోవాలి
- కోడిగుడ్లను పగుల గొట్టి ఒక పాత్రలో వేసి, అందులో మిరియాల పొడి వేసి చిలికి సిద్ధంగా ఉంచుకోవాలి
- బ్రెడ్ స్లయిస్‌ల అంచులు చాకుతో కట్ చేసి తీసేయాలి. బ్రెడ్‌ను అప్పడాల కర్రతో వత్తాలి. ఇలా చేయడం వల్ల బ్రెడ్ పొడి పొడిగా రాలిపోకుండా చికెన్ స్టఫ్ పెట్టి నూనెలో వేయించడానికి అనువుగా మారుతుంది. ఇలా చేసుకున్న బ్రెడ్ స్లయిస్‌లో ఒక స్పూన్ చికెన్ స్టఫ్ పెట్టి, కర్రీ బయటకు రాకుండా బ్రెడ్ అంచులకు మైదా పిండి ద్రవం రాసి అతికించాలి. నలుచదరంగా ఉండే బ్రెడ్ స్లయిస్ సాండ్‌విచ్‌లాగ త్రిభుజాకారపు పార్సిల్ తయారవుతుంది. ఇలా అన్నింటినీ చేసుకుని పక్కన పెట్టాలి
- బాణలిలో నూనె వేడి చేసి ఒక్కో బ్రెడ్ పార్సిల్‌ను కోడిగుడ్డు సొనలో ముంచి నూనెలో వేసి రెండు వైపులా దోరగా వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేయాలి. నూనె వదిలిన తరవాత ఈ బ్రెడ్ పార్సిళ్లను, టొమాటో కెచప్, లెట్యూస్‌తో కలిపి సర్వ్ చేయాలి.

చికెన్ హలీమ్

కావలసినవి: ఎర్ర కందిపప్పు – టేబుల్ స్పూన్; బాసుమతి బియ్యం– టేబుల్ స్పూన్; గోధుమలు– టేబుల్ స్పూన్; బార్లీ– టేబుల్ స్పూన్; కందిపప్పు– టేబుల్ స్పూన్; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి పేస్టులు– ఒక్కొక్కటి టేబుల్ స్పూన్; చికెన్ (బోన్‌లెస్)– పావు కేజీ; చికెన్ స్టాక్ – అర కప్పు; హలీమ్ మసాలా పొడి– టేబుల్ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – కప్పు; మిరప్పొడి– అర టీ స్పూన్; పసుపు– అర టీ స్పూన్; పెరుగు – అర కప్పు; ఉప్పు – అర టీ స్పూన్.
పోపు కోసం... నెయ్యి– అర కప్పు; జీలకర్ర– టీ స్పూన్; వెల్లుల్లి– 10 రేకలు; పుదీన ఆకులు – టేబుల్ స్పూన్.
గార్నిషింగ్ కోసం...: జీడిపప్పు – పావు కప్పు; నిమ్మకాయ– ఒకటి (పలుచగా తరగాలి); అల్లం తరుగు– టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – కప్పు.
తయారీ: ● బియ్యం, కందిపప్పులు, పచ్చి శనగపప్పు, బార్లీ, గోధుమలను ఒక పెద్ద పాత్రలో వేసి శుభ్రంగా కడిగి, మూడింతలు మంచి నీటిని పోసి పది నిమిషాలసేపు నానబెట్టాలి. ఆ




తర్వాత అందులో పచ్చిమిర్చి, వెల్లుల్లి, అల్లం పేస్టులు వేసి కలిపి, పప్పులు, ధాన్యాలు మెత్తబడే వరకు ఉడికించాలి. వేడి తగ్గిన తర్వాత వీటిని మెత్తగా మెదపాలి ● గింజలు ఉడికేలోపు బాణలిలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. అదే నూనెలో ఉల్లిపాయ ముక్కలను ఎర్రగా వేయించి తీసి పక్కన సిద్ధంగా ఉంచుకోవాలి ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేసి అందులో హలీమ్ మసాలా పొడి, మిరప్పొడి, పసుపు, ఉప్పు, పెరుగు, వేయించిన ఉల్లిపాయ ముక్కలు అర కప్పు, చికెన్ స్టాక్‌ను (చికెన్ స్టాక్ లేకపోతే మంచి నీటిని పోయాలి) వేసి ఉడికించాలి. చికెన్ ముక్కలు ఉడికిన తర్వాత అందులోని నీటిని పప్పులు, ధాన్యాలు ఉడికించిన మిశ్రమంలోకి వంపి చికెన్ ముక్కలను మాత్రమే పాత్రలో ఉంచి ఆ ముక్కలను మెదపాలి. మెదిపిన చికెన్‌ను కూడా ధాన్యాలు, పప్పులు ఉడికించిన మిశ్రమంలో వేసి కలిపి మంట తగ్గించి అన్నింటి రుచి కలవడం కోసం మళ్లీ ఉడికించాలి ● ఉల్లిపాయ ముక్కలు వేయించిన బాణలిలో మిగిలిన నేతిలో జీలకర్ర, అల్లం, వెల్లుల్లి, పుదీన వేసి అర నిమిషం పాటు వేయించి ఈ పోపును చిన్నమంట మీద ఉడుకుతున్న చికెన్, పప్పులు, ధాన్యాల మిశ్రమంలో వేసి కలిపితే హలీమ్ రెడీ ● గార్నిష్ చేయడానికి ఒక పాత్రలో కొత్తిమీర తరుగు, అల్లం తరుగు, జీడిపప్పులు, ఎర్రగా వేయించిన ఉల్లిపాయ ముక్కలు వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● ఒక కప్పులో వేడి వేడి హలీమ్ వేసి పై గార్నిష్ కోసం సిద్ధం చేసిన మిశ్రమాన్ని కొద్దిగా చల్లి, నిమ్మకాయ ముక్క పెట్టి సర్వ్ చేయాలి.

700 గొర్రెలూ.. ఎడారి.. అతను

సౌదీలో రెండేళ్ల పాటు 700 గొర్రెలను ఒంటరిగా మేపాడు. మరో మనిషితో మాట్లాడలేదు. మరో మాట వినలేదు. ఇసుకతో స్నానం ఇసుకే దాహం ఇసుక తప్ప మరేం కనిపించని ఒంటరితనం. బానిస బతుకు. కాని బతికి దేశం తిరిగి వచ్చాడు. 1995లో అతని జీవితం నవలగా వెలువడి మలయాళంలో సెన్సేషన్ సృష్టించింది. ప్రస్తుతం 138వ ప్రచురణకు వచ్చింది. అతని జీవితం ఆధారంగానే 'గోట్ లైఫ్' సినిమా తాజాగా విడుదలైంది. కేరళకు చెందిన నజీబ్ సంఘర్షణ ఇది.


నజీబ్



కేరళలోని అలెప్పి దగ్గరి చిన్న ఊరికి చెందిన నజీబ్ కోరుకుంది ఒక్కటే. సౌదీకి వెళ్లి ఏదో ఒక పని చేసి కుటుంబానికి నాలుగు డబ్బులు పంపాలన్నదే. ఆ రోజుల్లో కేరళ నుంచే కాదు దక్షిణాది రాష్ట్రాల నుంచి గల్ఫ్ దేశాలకు చాలామంది పని కోసం వలస వెళ్లేవారు. నజీబ్ కూడా సౌదీకి వెళ్లాలనుకున్నాడు. ఏజెంట్ అతనికి ఒక మాల్‌లో సేల్స్‌మ్యాన్‌గా పని ఉంటుందని పంపాడు. అలా నజీబ్ సౌదీలో అడుగు పెట్టాడు. అది 1993వ సంవత్సరం.

రెండు రోజుల తర్వాత

ఎయిర్‌పోర్ట్‌లో దిగాక నజీబ్ రెండు రోజుల పాటు ప్రయాణిస్తూనే ఉన్నాడు... అప్పుడు గాని అర్థం కాలేదు తాను మోసపోయానని. ఎడారి లోపల అతణ్ణి అరబ్ షేక్‌కు అప్పజెప్పారు. ఆ షేక్ అక్కడే ఒక షెడ్డు వేసుకుని ఉండేవాడు. నజీబ్‌కు 700 గొర్రెలను కాచే పని అప్పజెప్పాడు. వేరే బట్టలు ఇవ్వలేదు. స్నానానికి నీళ్లు ఇవ్వలేదు. బతకడానికి మాత్రం ముతక రొట్టెలు పడేసేవాడు. ఆ రొట్టెల్ని గొర్రెపాలలో తడిపి కొద్దిగా తినేవాడు నజీబ్. యజమాని, అతని తమ్ముడు ఈ ఇద్దరు మాత్రమే నజీబ్‌కు కనిపించేవారు. వారి అరబిక్ భాష తప్ప మరో భాష వినలేదు. మరో మనిషిని చూడలేదు. 'నేను ఏడ్చినప్పుడల్లా వారు కొట్టేవారు' అంటాడు నజీబ్.

భ్రాంతులు

నజీబ్‌కు ఎడారిలో ఉండి భ్రాంతులు మొదలయ్యాయి. అతడు గొర్రెల మధ్య ఉండి ఉండి తాను కూడా ఒక గొర్రెనేమో అనుకునేవాడు. రెండేళ్ల పాటు ఇలాగే జరిగింది. ఒకరోజు ఆ అన్నదమ్ములిద్దరూ పెళ్లి ఉందని వెళ్లారు. ఆ అదను కోసమే చూస్తున్న నజీబ్ ఎడారిలో పరిగెత్తడం మొదలుపెట్టాడు. దారి లేదు.. గమ్యమూ తెలియదు. పరిగెట్టడమే. ఒకటిన్నర రోజు తర్వాత మరో మలయాళీ కనిపించి దారి చెప్పాడు. అతడు కూడా తనలాంటి పరిస్థితిలో ఉన్నవాడే. చివరకు ఒక రోడ్డు కనిపించి రియాద్ చేరాడు. అక్కడి మలయాళీలు నజీబ్‌ను కాపాడారు. ఆ తర్వాత పోలీసులకు లొంగిపోతే తగిన పత్రాలు లేనందున 10 రోజులు జైల్లో పెట్టి ఇండియా పంపారు.

నవల సినిమాగా

నజీబ్ తిరిగి వచ్చాక కోలుకొని బెహ్రాయిన్ వెళ్లాడు ఈసారి పనికి. అక్కడ పని చేస్తున్న రచయిత బెన్యమిన్‌కు నజీబ్‌తో పరిచయమైంది. నజీబ్ జీవితాన్ని బెన్యమిన్ నవలగా 'ఆడు జీవితం' (గొర్రె బతుకు) పేరుతో రాసి 2008లో వెలువరించాడు. అది సంచలనంగా మారింది. ఇప్పటికి వందకు పైగా ఎడిషన్స్ వచ్చాయి. 8 భాషల్లో అనువాదమైంది. ఆ నవల ప్రాశస్త్యం సినిమా రంగాన్ని ఆకర్షించింది. మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా 'ఆడు జీవితం' పేరుతో నటించి మొన్న మార్చి 28న విడుదల చేశాడు. తెలుగులో గోట్‌లైఫ్ పేరుతో అనువాదమైంది. వాస్తవిక సినిమాగా ఇప్పటికే గోట్‌లైఫ్ ప్రశంసలు పొందుతోంది.

ఇంటిప్స్

కిచెన్‌లో బొద్దింకల సమస్య ఉంటే..




- కాసిని వెల్లుల్లి రెబ్బల్ని దంచి నీటిలో కలిపి సింక్ పైప్ దగ్గర పెట్టాలి.
- బొద్దింకలకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది.
- మూలల్లో బోరిక్ పౌడర్‌ను ఉంచితే బొద్దింకలు మాయమవుతాయి.
- బేకింగ్ సోడా, చక్కెర కలిపి బొద్దింకలు తిరిగే ప్రదేశంలో చల్లడం ద్వారా కూడా బొద్దింకలను తరిమికొట్టవచ్చు.

హెయిర్‌టిప్స్

కురులకు అవిసె ఫ్లేక్స్ సీడ్ జెల్



- కప్పు అవిసె గింజలను తీసుకుని నాలుగు కప్పుల నీళ్లపోసి బాగా మరగనివ్వాలి.
- ఉడికిన తరువాత నీటిని వడగట్టాలి. అలా వడగట్టిన నీటిలో నాలుగు చుక్కలు ఆలివ్ ఆయిల్, టీస్పూను కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి.
- ఈ మిశ్రమాన్ని గాజు జాడీలో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలి.
- పదిహేను రోజుల తరువాత జెల్‌గా మారుతుంది. అప్పుడు రెండు టీస్పూన్ల జెల్‌కు స్పూను విటమిన్ ఈ ఆయిల్ కలిపి తలకు పట్టించి మర్దన చేయాలి. అరగంట తరువాత సాధారణ షాంపుతో శుభ్రం చేయాలి.
- వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల కుదుళ్లకు పోషణ అంది చుండ్రు సమస్య వదిలి జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 7

శనివారం 30-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కోల్‌కతా లెక్క మార్చేసింది

సొంతగడ్డపై బెంగళూరుకు చెక్.. 7 వికెట్ల తేడాతో నైట్‌రైడర్స్ విజయం - 11లో



దేశంలో ఆధ్యాత్మిక టూరిజం

రిటైల్ బ్రాండ్స్ ప్రత్యేక దృష్టి.. జాబితాలో తిరుపతి, అయోధ్య నగరాలు - IVలో



నా భర్తను దీవించండి

ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు నైతిక మద్దతునివ్వాలని ప్రజలకు ఆయన సతీమణి సునీత విజ్ఞప్తి చేశారు.

వివరాలు 6లో ▸



దక్షిణాఫ్రికాలో ఘోర ప్రమాదం

దక్షిణాఫ్రికాలో బస్సు లోయలో పడి 45 మంది చనిపోయారు. ఈస్టర్ జరుపుకునేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

వివరాలు 6లో ▸



ఆర్జేడీకి 26.. కాంగ్రెస్‌కు 9

బిహార్‌లో 'మహాఘట్‌బంధన్‌'లో సీట్ల పంపిణీ కొలిక్కి వచ్చింది. ఆర్జేడీ 26 చోట్ల, కాంగ్రెస్ 9 చోట్ల పోటీ చేయనున్నాయి.

వివరాలు 6లో ▸



'విజిల్' ఊదేస్తున్నారు

'సీ–విజిల్' యాప్ ద్వారా ఓటర్లు 79 వేలకు పైగా ఫిర్యాదులు చేయగా.. 99 శాతానికి పైగా పరిష్కరించినట్టు ఈసీ తెలిపింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

సిగ్గు ఎగ్గూ అన్నీ ఒగ్గేసీ...

- డ్వాక్రా సంఘాలు, రుణాలపై రామోజీ దిక్కుమాలిన రాతలు
- రూ. 25,570.80 కోట్లు నాలుగు విడతల్లో ఇస్తే, జగన్ ద్రోహం చేసినట్టా..
- చంద్రబాబు ప్రభుత్వం కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా జగన్ ప్రభుత్వంలో ఉన్నతి
- అప్పట్లో గరిష్టంగా రూ.30 వేల రుణమే.. ఇప్పుడది రూ.5 లక్షల దాకా పెంపు

10 లో

బాబు దురహంకారం..

మరోసారి బహిర్గతం

పేదలు, దళితులను తరచూ హేళన చేస్తున్న చంద్రబాబు

సీఎంగా ఉండగానే ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ హేళన

తోకలు కత్తిరిస్తా అంటూ నాయీ బ్రాహ్మణులపై చిందులు

తాజాగా శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని కించపరుస్తూ వ్యాఖ్యలు

టిప్పర్ డ్రైవర్ ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థి అంటూ ఎగతాళి

దళిత అభ్యర్థిని హేళన చేయడంపై మండిపడుతున్న దళితులు, మేధావులు, డ్రైవర్లు

9 లో

టీడీపీ, జనసేనకు వరుస షాక్‌లు!

ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమిని వీడుతున్న ముఖ్య నేతలు

- తాడేపల్లిగూడెంలో ఈలి నాని టీడీపీకి గుడ్‌బై
- ఆయన దారిలోనే నూజివీడు మాజీ ఎమ్మెల్యే రామకోటయ్య
- ఇటీవలే టీడీపీని వీడిన ఎన్ఆర్ఐ గోపాల్ యాదవ్
- చేగొండి సూర్యప్రకాశ్, నౌడు వెంకటరమణలు జనసేనకు రాం రాం.. తాజాగా జనసేనకు రాజీనామా చేసిన ముమ్మిడివరం నేత పితాని

10 లో



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



చిన్నా, నేనున్నా.. కర్నూలు జిల్లా పెంచికలపాడు వద్ద చూపు లేని చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకున్న సీఎం వైఎస్ జగన్ 7 లో

మోసగాళ్లను నమ్మొద్దు

వారి తోకలు కత్తిరించేలా మీరే స్టార్ క్యాంపెయినర్లు కావాలి

ఎమ్మిగనూరు సభలో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు

మీ బిడ్డ మంచి చేసి ఉంటే ఆ మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి

ఆడబిడ్డల కష్టాలు కళ్లారా చూశా.. అందుకే విప్లవాత్మక పథకాలు

దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు 50% నామినేటెడ్ పదవులు

పిల్లల బంగారు భవిష్యత్ కోసం విద్యారంగంలో సంస్కరణలు

అన్ని వర్గాల వారికి మంచి చేసిన ప్రభుత్వానికి రాఖీ కట్టండి

మళ్లీ ఆ ముగ్గురు మోసాలు చేసేందుకు కూటమిగా వస్తున్నారు

వ్యవసాయం దండగన్న బాబు ఓవైపు.. భూమి పుత్రుడైన మీ బిడ్డ మరోవైపు

పేదల తల రాతలు మార్చే ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి

7 లో

"చంద్రబాబు ఈ రోజు శింగనమలకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ ఓ టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చిందని హేళన చేసి తూలనాడారు. ఆ పిల్లోడు చదువుపై కూడా తప్పులు చెప్పారు. అవునయ్యా.. పేదవాడికి టికెట్ ఇచ్చాం. తప్పేముందయ్యా చంద్రబాబూ? వీరాంజనేయులు టిప్పర్ డ్రైవరే. కాదని చెప్పలేదు. కానీ అతను చదివింది చంద్రబాబు కంటే పెద్ద చదువులు. ఎంఏ ఎకనామిక్స్ చదివి బీఈడీ కూడా చేశాడు. చంద్రబాబు హయాంలో ఉద్యోగాలు దొరక్క టిప్పర్ డ్రైవర్‌గా తన కాళ్లపై నిలబడ్డాడు. వీరాంజనేయులు చాలా ఏళ్లుగా మనకు తోడుగా ఉన్నాడు. అలాంటి పేద కార్యకర్తకు మీ జగన్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. మీ జగన్ 175 అసెంబ్లీ, 25 ఎంపీలలో 200 స్థానాల్లో ఏకంగా 50 శాతం అంటే 100 సీట్లు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారు. పేదవారికి అండగా ఉండే జగన్‌కు, పెత్తందారీ మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు మధ్య తేడాను గమనించాలని కోరుతున్నా. అదే అనంతపురం జిల్లాలో మడకశిర నియోజకవర్గం ఎస్సీలది. అక్కడ మన అభ్యర్థి పేరు లక్కప్ప. చంద్రబాబు అక్కడికి వెళ్లి ఉపాధి హామీ కూలీకి జగన్ టికెట్ ఇచ్చారు అని అంటారు. అవునయ్యా.. ఉపాధి కూలీ, పేదవాడైన లక్కప్పకు టికెట్ ఇచ్చాం. జగన్‌కు, చంద్రబాబుకు మధ్య ఇదీ తేడా. మాది పేదల పార్టీ.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

లక్షల గళాల గర్జన

8 లో

కోడుమూరు, హంద్రీ కైరవాడి, గోనెగండ్ల, ఎమ్మిగనూరు రోడ్ షోలు సూపర్ హిట్

డిజిటల్ టెక్నాలజీకి పెద్దపీట

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నాకు ఆసక్తి ఎక్కువ: ప్రధాని మోదీ



'చాయ్ పే చర్చ'లో ప్రధాని మోదీ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్

డిజిటల్ విప్లవానికి సామాన్య ప్రజలే నాయకత్వం వహించాలి

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో మోదీ 'చాయ్ పే చర్చ'

టెక్నాలజీలో భారత్ మార్గదర్శిగా మారిందని బిల్‌గేట్స్ ప్రశంస

6 లో

టెక్నాలజీలో నేను నిపుణుడిని కాకపోయినా దానిపై చిన్నపిల్లలకు ఉండే ఉత్సుకత నాకూ ఉంది. అదేసమయంలో నేను టెక్నాలజీకి బానిసను కాలేదు. ఏఐతో సృష్టించే డీప్‌ఫేక్‌ల విషయంలో అప్రమత్తత అవసరం. ఏఐని అన్నీ సాధించిపెట్టే మంత్రదండంగా చూడొద్దు.

- ప్రధాని నరేంద్ర మోదీ

ఫ్యాకల్టీయే లైంగికంగా వేధిస్తే ఇంకెవరికి చెప్పను నాన్నా..



తండ్రి సెల్‌కు మెసేజ్ పెట్టి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని

విశాఖ కొమ్మాదిలోని చైతన్య కాలేజీలో ఘటన..

4వ అంతస్తు నుంచి కిందకు దూకి బలవన్మరణం

ఫొటోలు తీసి ఫ్యాకల్టీ బెదిరించాడని తండ్రికి మెసేజ్.. కాలేజీలో లైంగిక వేధింపులు నిత్యకృత్యం

పోలీసులకు చెప్తే ఫొటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తున్నారు

5 లో

ఎట్టకేలకు టీడీపీ ఆఖరి జాబితా

4 ఎంపీ, 9 ఎమ్మెల్యే స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన

- పట్టుబట్టి భీమిలి సీటు సాధించుకున్న గంటా
- ఇష్టం లేకపోయినా చీపురుపల్లికి కళా వెంకట్రావు
- ఆలూరులో కోట్ల సుజాతకు షాక్.. వీరభద్రగౌడ్‌కు టికెట్
- ఫిరాయింపు నేత గుమ్మనూరుకు గుంతకల్లు ఖరారు
- కదిరిలో యశోద స్థానంలో ఆమె భర్త కందికుంట ప్రసాద్
- రెబల్ భయంతో భూపేష్‌రెడ్డికి కడప ఎంపీ సీటు
- ఒంగోలు ఎంపీ సీటు మాగుంట శ్రీనివాసరెడ్డికి..

2 లో



బీసీలకు బాబు పోటు

బలహీన వర్గాలకు 34 ఎమ్మెల్యే సీట్లతో సరి

సొంత సామాజిక వర్గానికి 32 సీట్లు.. మైనారిటీలకు మూడే

కాపులకు ఒక్క ఎంపీ టికెట్టూ ఇవ్వని చంద్రబాబు

9లో

రూ.1,823 కోట్లు చెల్లించండి

కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులు

ఇది పన్ను ఉగ్రవాదమన్న రాహుల్




రూ.1,823.08 కోట్లు చెల్లించాలంటూ ఆదాయపు పన్ను విభాగం నుంచి తాజాగా తమ పార్టీకి నోటీసులు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరామ్ రమేశ్, అజయ్ మాకెన్ చెప్పారు. ఉల్లంఘనలకు బీజేపీ నుంచీ రూ.4,617.58 కోట్లు వసూలు చేయాలని ఐటీ అధికారులను డిమాండ్ చేశారు. ఐటీ చట్టాలను అధికార బీజేపీ విచ్చలవిడిగా ఉల్లంఘిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ బీజేపీ పన్ను ఉగ్రవాదానికి పాల్పడుతోందని రాహుల్ మండిపడ్డారు. 6లో

విశాల హితం.. రామోజీ రాతల్లో ఖతం

మూడు రాజధానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కంకణం

- చంద్రబాబు అండ్ కో అడ్డుకోవడం చట్టసభల సాక్షిగా నిజం
- దీంతో మూడు రాజధానుల ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా
- అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధి
- ఇదే విషయాన్ని నంద్యాల సభలో పునరుద్ఘాటించిన సీఎం జగన్
- దీంతో తమ బాబుకు ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని రామోజీ బెంబేలు
- పచ్చ పైత్యం జోడించి అమరావతిని చంపేశారంటూ దుష్ప్రచారం

2 లో



- శాసన రాజధానిగా అమరావతి, పాలన రాజధానిగా విశాఖ, న్యాయ రాజధానిగా కర్నూలు
- అమరావతి రైతులతో కృత్రిమ పోరాటం చేయిస్తూ దీన్ని న్యాయస్థానంలో అడ్డుకున్నది మీ బాబే
- 99 శాతం హామీల అమలు అసలు సిసలు వాస్తవం
- బాబు ప్రజలను వంచించినా రామోజీకి మాత్రం బ్రహ్మాండం



పసుపు పార్టీ ఉక్కిరిబిక్కిరి

11లో

అనంతపురంలో టీడీపీ కార్యాలయం ఫర్నిచర్‌ను తగలబెడుతున్న ఆ పార్టీ నేత ప్రభాకర్ చౌదరి వర్గీయులు

పోలీసుల కన్నా హంతకులే నయం

జైల్లో టార్చర్ పెట్టి చంపడానికి ప్రయత్నిస్తారు

చంద్రబాబు అనుచిత వాఖ్యలు

- టీడీపీ అధినేత వ్యాఖ్యలపై మండిపడుతున్న పోలీసులు
- చంద్రబాబు 'ప్రజాగళం' అట్టర్ ఫ్లాప్
- కావలిలో సభకు జనాలు రాకపోవడంతో బస్సులోనే గంటకుపైగా వేచిచూసిన చంద్రబాబు

11 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

నా ప్రాణం నిలిపిన దేవుడు

చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితుల్లో గుండె సంబంధిత సమస్య వచ్చింది. లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించి సీఎం జగన్ నాకు పునర్జన్మ ప్రసాదించారు. మాది పేద కుటుంబం. నా భర్త, కొడుకు, కోడలు, మనవడితో కలిసి బాపట్ల జిల్లా అనంతవరంలో నివసిస్తున్నాం. నా భర్త, కొడుకు.. ఇద్దరూ హమాలీలుగా పని చేస్తుంటారు. వచ్చే కొద్దిపాటి సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. ఒకరోజు నాకు అకస్మాత్తుగా గుండె పట్టేసినట్లవడంతో గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నాం. వెంటనే ఆపరేషన్ చేయాలని, ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని డాక్టర్లు చెప్పారు. ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించుకోవచ్చని చెప్పడంతో ధైర్యం వచ్చింది. వెంటనే వైద్యశాలలో చేర్పించుకుని లక్షల్లో ఖర్చయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు. స్టంట్ వేసే సమయంలో నాకు బీపీ పెరగడంతో ఒక స్టంట్ వేసిన వైద్యులు ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత మరో స్టంట్ వేస్తామని చెప్పారు. ఇంటికి పెద్ద



కొడుకులా ఆదుకుని సీఎం జగన్ నా ప్రాణాలు నిలిపారు. ఆయన చేసిన సాయానికి ఎప్పటికీ రుణపడి ఉంటా. వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 వంతున, వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.80 వేలు వచ్చింది. మేము తోపుడు బండితో వ్యాపారం చేసుకుంటున్నందున జగనన్న తోడు కింద రూ.10 వేలు, నా మనవడికి అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15 వేలు వంతున లబ్ధి చేకూరింది. ఆర్థిక ఇబ్బందులు లేకుండా సంతోషంగా జీవిస్తున్నాం. – గుంటూరు కుమారి, అనంతవరం, బాపట్ల జిల్లా.

(మోటుపల్లి ప్రతాప్, విలేకరి, కొల్లూరు)

వృద్ధాప్యంలో ఆదుకున్నారు

నేను గతంలో క్షురక వృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడిని. నా భార్య దివ్యాంగురాలు. మాకు ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లిలో కాపురం ఉంటూ నా వృత్తి ద్వారా వచ్చిన ఆదాయంతో పిల్లలిద్దరినీ పెంచి, పోషించి ఎలాగోలా వివాహాలు చేశాను. ఎవరి బతుకులు వారు బతుకుతున్నారు. ఇప్పుడు వృద్ధాప్యం వల్ల కుల వృత్తి చేయలేకపోతున్నా. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవతో ఎవరిపైనా ఆధార పడకుండా జీవించగలుగుతున్నాం. నాకు వృద్ధాప్య పింఛన్, నా భార్యకు దివ్యాంగ పింఛన్ కలిపి రూ.6 వేలు అందుతోంది. నాకు గతంలో రూ.500 పింఛన్ అందేది. దాంతో జీవనం కష్టంగా ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక పింఛను పెరగడంతో ఇబ్బందులు



తొలిగాయి. ప్రతి నెలా వైద్యులు ఊళ్లోకి వచ్చి పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా ఇస్తున్నారు. ప్రతి నెలా రేషన్ ఇంటికే వస్తోంది. ఏ చీకూ చింతా లేకుండా ఇద్దరం కలిసి జీవనం సాగిస్తున్నాం. ఇదంతా జగనన్న చలవే. – గులిమి పైడయ్య, చిలకలపల్లి

(పి.కోటేశ్వరరావు, విలేకరి, సీతానగరం)

అమ్మాయి చదువు బెంగ తీరింది

మాది కాయ కష్టంతో జీవించే కుటుంబం. నా భర్త కూలి పనులు చేస్తుంటాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని 29వ వార్డులో నివాసం ఉంటున్నాం. నేను ఇంట్లో కుట్టు మెషీన్ పని చేసుకుంటూ కొంత సంపాదిస్తున్నా. మాకు ఇద్దరు ఆడ పిల్లలు. చిన్నమ్మాయి డిగ్రీ చదువుతోంది. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఏటా రూ.20 వేలు వస్తున్నాయి. ఈ డబ్బుతోనే మా అమ్మాయిని ఏ బెంగ లేకుండా చదివిస్తున్నా. మా అమ్మ మాతోనే ఉంటోంది. అమ్మకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 వస్తోంది. ఆసరా కింద రూ.75 వేలు అందుకుంది. అమ్మకు పింఛన్ కూడా అందుతోంది. నాకు జగనన్న చేదోడు కింద ఏటా రూ.పది వేలు



వంతున వస్తోంది. ఇలా మా కుటుంబం సంతోషంగా ఉండటానికి కారణమైన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. – పరమట దుర్గ, అమలాపురం

(పరసా సుబ్బారావు, విలేకరి, అమలాపురం టౌన్)

విశాల హితం.. రామోజీ రాతల్లో ఖితం

దేశంలో తీర ప్రాంతాల్లో వెలసిన రాజధానులు ఆ రాష్ట్ర ప్రగతికి పునాదులు వేశాయన్నది కళ్లెదుట కనిపించే నిజం. అందుకే రాష్ట్ర విశాల హితమే ధ్యేయంగా సీఎం జగన్ మూడు రాజధానులను ప్రకటించారు. రామోజీకి మాత్రం ఇది గిట్టలేదు. ఎందుకంటే చంద్రబాబు అండ్ బ్యాచ్ సాగించే రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బ తింటుందనే. ఆ సంకుచిత ధోరణితో ఒక్క అమరావతి మాత్రమే అభివృద్ధి చెందాలని రామోజీ, చంద్రబాబు బృందం తెగ ఆరాట పడిపోయింది. రాజధాని గురించి ముందుగా లీకులిచ్చింది కూడా ఈ భూ దందాల కోసమేనని ఎవరినడిగినా చెబుతారు. అమరావతి పాలనా రాజధాని కాదంటే ఆ పరిసరాల్లో ముందస్తుగా అడ్డగోలుగా ఎల్లో బ్యాచ్ కొన్న భూముల విలువ పడిపోతుందని రామోజీ భయం. అందుకే శాసన మండలిలో మూడు రాజధానుల బిల్లును అడ్డుకున్నా, జగన్ గట్టి సంకల్పం వల్ల శాసనసభలో బిల్లుకు ఆమోదం లభించింది. ఇది నచ్చని బాబు బ్యాచ్ అడ్డుపడి కోర్టు కెక్కింది. ఇదే విషయాన్ని నంద్యాల సభలో సీఎం జగన్ ప్రస్తావిస్తూ మూడు రాజధానుల ఏర్పాటు గురించి మాట్లాడితే దానికి రామోజీ వక్రభాష్యం చెబుతూ ఏడుపుగొట్టు.. వెకిలి.. వెటకారపు రాతలతో కథనాన్ని అచ్చేశారు.



మూడు రాజధానులు ఏర్పాటు చేశాం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి మూడు రాజధానులను ఏర్పాటు చేసిన మాట చట్టసభల సాక్షిగా నిజం. మూడు రాజధానులకు బల ప్రదర్శన ద్వారా తొలుత శాసన మండలిలో చంద్రబాబు అండ్ కో బృందం అడ్డుపడింది. మళ్లీ శాసన సభ ఆమోదించిన తర్వాత మండలి ఆమోదించక తప్పలేదు. ఆ తరువాత న్యాయస్థానానికి వెళ్లి మూడు రాజధానులు ఏర్పాటు కాకుండా ఈ బృందమే అడ్డుకుంది. ఈ పరిణామంతో మూడు రాజధానుల కార్యకలాపాలు వాయిదా పడ్డాయే తప్ప.. వాటి ఏర్పాటు అక్షరాలా నిజం. ఇదే విషయాన్ని నంద్యాలలో 'మేమంతా సిద్ధం' సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దీనికి ఈనాడు రామోజీ వెటకారంతో పైత్యం జోడించి సిగ్గులేని కథనం అచ్చువేశారు. అమరావతిని చంపేశారంటూ పచ్చి అబద్ధాలను వండి వార్చారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా అమరావతిని శాసన రాజధానిగా ప్రకటించారు. అమరావతిలో బాబు చేపట్టి పూర్తి చేయకుండా వదిలేసిన పనుల్లో అవసరమైన పనులనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. రామోజీ ఈ అవాస్తవాలను ప్రచారం చేయడానికి ప్రధాన కారణం తనకు ఇష్టుడైన చంద్రబాబు అండ్ కో బ్యాచ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిలిపోయిందనే అక్కసే తప్ప మరొకటి కాదు. తొలి నుంచి పరిపాలనను, అభివృద్ధిని వికేంద్రీకరించడం ద్వారా అన్ని ప్రాంతాలు, ఆ ప్రాంతాల్లోని ప్రజలు సమగ్రంగా అభివృద్ధి చెందాలనేది వైఎస్సార్‌సీపీ విధానం. అందులో భాగంగానే విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చట్టం చేయడం.. చంద్రబాబు అండ్ కో బృందం న్యాయస్థానానికి వెళ్లి ఈ చర్యను అడ్డుకోవడం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే.

రాష్ట్ర ప్రగతిపై ప్రశంసలిలా..

- మహిళా సాధికారత, మహిళా సంక్షేమానికి జగన్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని నోబెల్ గ్రహీత దుఫ్లో కొనియాడారు.
- ఐక్య రాజ్య సమితి ఛాంపియన్ అవార్డుకు రైతు భరోసా కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. గ్రామ స్థాయిలో ఆర్‌బీకెల ఏర్పాటు చేయాలనే వినూత్న ఆలోచనను ఎఫ్ఏఓ కంట్రీ డైరెక్టర్ టోమియో పిచిరి అభినందించారు.
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు అనుసరించాలని ప్రధాని నరేంద్ర మోదీ శ్లాఘించారు.
- ప్రతి 2000 జనాభాకు ఆరోగ్య సంరక్షణ అందిస్తున్న ఏపీ ప్రభుత్వ చర్యలను డబ్ల్యుహెచ్‌ఓ హెల్త్ కేర్ చీఫ్ డా.శ్యామ్ బిషెన్ ప్రశంసించారు.
- 31.88 లక్షల మంది మహిళలు, పిల్లలకు లబ్ధి చేకూరేలా ఏపీ ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణను నీతి ఆయోగ్ ప్రశంసించింది.
- విద్యా రంగంలో ఏపీ ప్రభుత్వం తెచ్చిన అమ్మ ఒడి పథకం వల్ల అక్షరాస్యత రేటు పెరుగుతోందని నోబెల్ గ్రహీత జాన్ బి.గూడెనఫ్ ప్రశంసించారు.
- విద్య, ఆరోగ్య, సామాజిక రంగ పెట్టుబడుల్లో ఏపీ పురోగతిని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది.
- కోవిడ్‌కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రపంచం మొత్తం నేర్చుకోవాలని యూకే మాజీ డిప్యూటీ హైకమిషనర్ ఆంగ్రూ ఫ్లెమింగ్ కొనియాడారు.

అడ్డుకోబోయింది మీ బాబే

అమరావతి రైతుల పేరుతో ఒక వైపు కృత్రిమ పోరాటం చేయిస్తూ, మరో పక్క న్యాయస్థానంలో అడ్డుకుంది మీ బాబే రామోజీ. జనం అమాయకులు కాదు. మీరు ఏది రాస్తే దాన్నే జనం నమ్ముతారనుకోవడం మీ అజ్ఞానం, అవివేకం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో వ్యవస్థల్లో గొప్ప విప్లవాత్మక మార్పులను తెచ్చారనేది వాస్తవం. మీరు అంగీకరించకపోయినా నీతి ఆయోగ్‌తో పాటు ప్రపంచ బ్యాంకు తదితర గొప్ప సంస్థలు జగన్ ప్రభుత్వానికి కితాబిచ్చాయి. మీ చంద్రబాబు కుప్పాన్ని రెవెన్యూ డివిజన్ చేయలేకపోతే, సీఎం జగన్ చేసి చూపించి, కుప్పంపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. రెండేళ్ల పాటు కోవిడ్ సంక్షోభం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఇబ్బంది పెట్టినా సరే ఏ మాత్రం వెనకడుగు వేయకుండా ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేశారు. ఈ విషయాన్నే ఆయన తన ప్రసంగంలో చెప్పారు. ఇందులో ఆత్మస్తుతి, పరనింద ఏముందీ రామోజీ? గ్రామ, వార్డు సచివాయాల వ్యవస్థను ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో చదువుకున్న 10–11 మందికి శాశ్వత ఉద్యోగాలు ఇచ్చారు. ఇది జగమెరిగిన సత్యం. ఎవరూ కాదనలేని నిజం. రైతుల కోసం ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారు. విలేజ్, వార్డు క్లినిక్స్‌ను ఏర్పాటు చేసి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. బాబు ఐదేళ్ల పాలనలో జిల్లాలను పునర్ వ్యవస్థీకరించాలనే ఆలోచనే చేయలేదు. జగన్ 13 జిల్లాలను 26 జిల్లాలకు పెంచారు. ఇది పరిపాలన వ్యవస్థలను మరింతగా ప్రజల దగ్గరకు తీసుకువెళ్లింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి ప్రభుత్వ రంగంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో చంద్రబాబు చేయలేకపోయిన, సాధించలేకపోయిన నాలుగు పోర్టుల నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్లను ఏర్పాటు చేసి లంచాల్లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను చేరవేస్తున్న విషయం కళ్లెదుట కనిపించే వాస్తవం. లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీతో పాటు మధ్యలో రూపాయి దుర్వినియోగం కాకుండా నేరుగా వారి ఖాతాలకు చేరుతోంది. ఇవన్నీ క్షేత్ర స్థాయిలో కనిపిస్తున్న నిజాలు రామోజీ. మీరు కాదన్నా.. వెటకారం చేసినా రాష్ట్ర ప్రజలందరికీ కనిపిస్తున్న వాస్తవాలివి.

టెన్త్ మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- 7.25 లక్షల మంది పరీక్షలకు హాజరు
- 50 లక్షల జవాబు పత్రాల వ్యాల్యూయేషన్‌కు ఏర్పాట్లు
- 25 వేల మంది సిబ్బందికి విధుల కేటాయింపు
- రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి



విశాఖలోని జూబ్లీ హైస్కూల్ మూల్యాంకనం కేంద్రంలో మాట్లాడుతున్న దేవానంద్ రెడ్డి

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సర్వం సిద్ధం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానంద్ రెడ్డి తెలిపారు. విశాఖలోని జూబ్లీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ ఏడాది రాష్ట్రంలో 6.23 లక్షల మంది విద్యార్థులు రెగ్యులర్‌గా, 1.02 లక్షల మంది ప్రైవేటుగా పదోతరగతి పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. మొత్తంగా 50 లక్షల జవాబు పత్రాలకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి మూల్యాంకనం ప్రారంభించి, 8వ తేదీనాటికి పూర్తి చేయాలని జిల్లాల యంత్రాంగానికి లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఇందుకోసం 25 వేల మంది సిబ్బందికి విధులు కేటాయించామన్నారు. గతంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, నంద్యాల జిల్లాల్లో మూల్యాంకనం జరిగేది కాదని, ఈసారి రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కూడా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మే మొదటి వారానికి అంతా పూర్తి చేసి, ఎన్నికల కమిషన్ అనుమతితో, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఫలితాలు ప్రకటించాలనే లక్ష్యంతో ఉన్నామని ఆయన తెలిపారు.

స్పాట్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు

మూల్యాంకనం కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించామని దేవానంద్‌రెడ్డి తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు, నంద్యాల జిల్లాల్లో గతంలో నిర్వహించిన చోట సరైన సౌకర్యాలు లేవని గుర్తించి, ఈసారి వాటిని అనువైన భవనాల్లోకి మార్పు చేశామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కేంద్రాల్లో వైద్య ఆరోగ్యశాఖ కో–ఆర్డినేషన్‌తో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

రీ వెరిఫికేషన్‌కు ఆన్‌లైన్ విధానం

మూల్యాంకనంలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వొద్దని డీఈవోలకు స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. అనుమానాలు నివృత్తి చేసుకోవాలనుకునే విద్యార్థుల కోసం ఈసారి ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చామన్నారు. రీ వ్యాల్యూయేషన్, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 ఫీజు చెల్లించే విద్యార్థులకు ప్రత్యేక వెబ్ లింక్ ద్వారా వారి సెల్‌ఫోన్‌కు మూల్యాంకనం చేసిన జవాబు పత్రాన్ని పంపిస్తామన్నారు.

అవ్వాతాతలకు భరోసా కల్పించిన ప్రభుత్వం మనది

సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు భరోసా కల్పిస్తూ వారికి అండగా నిలిచిన ప్రభుత్వం మనదంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ట్వీట్ చేశారు. 'అవ్వాతాతల సంక్షేమం కోసం వారికి ఇచ్చే పెన్షన్‌ను రూ.3,000కు పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. మనం చేసిన మంచి దారిపొడవునా వారు చూపిస్తున్న అభిమానంలో కనిపిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు.

50 శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకిచ్చాం..

వైఎస్సార్‌సీపీలో 50 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చామని గర్వంగా చెప్పగలుగుతున్నానని సీఎం వైఎస్ జగన్ అన్నారు. అయినా పేదలు రాజకీయంగా ఎదుగుతుంటే మీకంత కడుపు మంట ఎందుకని చంద్రబాబునాయుడును ప్రశ్నిస్తూ సీఎం జగన్ ట్వీట్ చేశారు.

భారత్, యూఎస్ మైత్రీ బంధం మరింత బలోపేతం

- కాకినాడలో ఆకట్టుకుంటున్న టైగర్ ట్రయంఫ్–24 విన్యాసాలు



మాట్లాడుతున్న ఇండో - అమెరికన్ అధికారులు రాజేష్ ధన్‌కర్, జోక్విన్ మార్టినెజ్

కాకినాడ రూరల్: 'టైగర్ ట్రయంఫ్–24' పేరిట నిర్వహిస్తున్న ఇండో–అమెరికన్ సంయుక్త సైనిక విన్యాసాలతో భారత్, యూఎస్ మధ్య పరస్పర సహకారం, మైత్రీ బంధం బలపడుతున్నాయని ఇరు ప్రాంతాల ప్రతినిధులు స్పష్టం చేశారు. కాకినాడ సాగర తీరంలో శుక్రవారం ఇరు దేశాల రక్షణ దళాల సంయుక్త విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖలోని తూర్పు నావికా దళం ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌కర్, జపాన్‌లోని యూఎస్ నావికా దళం సెవెంత్ ఫ్లీట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వైస్ కమాండర్ రియర్ అడ్మిరల్ జోక్విన్ మార్టినెజ్ టైగర్ ట్రయంఫ్ ముఖ్యోద్దేశాన్ని వివరించారు. భారత్, అమెరికా సంయుక్త ఉమ్మడి ఉభయచర, హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ (హెచ్ఏడీఆర్) విన్యాసాలను టైగర్ ట్రయంఫ్ పేరిట మూడో విడతగా ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు విశాఖలో, 27 నుంచి కాకినాడలోను ఈ సంయుక్త విన్యాసాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, ఈ విన్యాసాల్లో ఆకాశంలో జెట్ విమానాల చక్కర్లు.. అత్యవసర పరిస్థితుల్లో హెలికాప్టర్ల నుంచి రక్షణ దళాలు తీరాన దిగడం.. హెలికాప్టర్‌తో జీప్‌ను యుద్ధ నౌక నుంచి ఒడ్డుకు చేర్చడం వంటి విన్యాసాలు ప్రదర్శించారు. ఐఎన్ఎస్ ఐరావత్, ఐఎస్ఎస్ కేసరి యుద్ధ నౌకల నుంచి సైనికులు, ఉభయచర ట్యాంక్‌లు ఒడ్డుకు చేరుకుని యుద్ధ పాటవాన్ని ప్రదర్శించాయి. యూఎస్‌కు చెందిన మెరైన్ సీహెచ్–53ఈ సూపర్ స్టాలియన్, హెవీ లిఫ్ట్ హెలికాప్టర్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. మేజర్ జనరల్ కమాండర్ అఖిలేష్ కుమార్, సీనియర్ అధికారులు, కమాండింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సన్నద్ధతపై క్షేత్రస్థాయి పరిశీలన

- ప్రతి వారం కనీసం మూడు జిల్లాల్లో పర్యటించనున్న ఏపీ సీఈవో
- నోటిఫికేషన్ వచ్చేలోగా 15 జిల్లాల్లో పర్యటనకు ప్రణాళిక
- ఇందులో భాగంగా తొలుత ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించిన ముఖేష్‌కుమార్ మీనా
- కంట్రోల్ రూమ్‌లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలన



ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల లేఅవుట్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సాక్షి, అమరావతి/ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధత, ఏర్పాట్లపై ఇప్పటి వరకు జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా.. ఇక క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించనున్నారు. వారానికి కనీసం మూడు జిల్లాల చొప్పున.. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదలయ్యేలోగా 15 జిల్లాల్లో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించాలని ముఖేష్‌కుమార్ మీనా లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన జిల్లా స్థాయి ఎన్నికల కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆయన పరిశీలించనున్నారు. ఇందులో భాగంగా ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల కోడ్ అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేస్తున్న విధానం, వాటి పరిష్కారం తీరుపై ఆరా తీశారు. అలాగే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల కోసం ఎంపిక చేసిన ఏలూరు సీఆర్ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరంలోని ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేశారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను నన్నయ్య యూనివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తీసుకువచ్చి కౌంటింగ్ నిర్వహించనున్నట్లు ముఖేష్‌కుమార్‌కు అధికారులు తెలియజేశారు. ఈ పర్యటనల సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగు నీరు, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జేసీ బి.లావణ్య, తూర్పుగోదావరి కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు టీడీపీ ఆఖిరి జాబితా

- 4 ఎంపీ, 9 ఎమ్మెల్యే స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన
- అతికష్టం మీద 144 ఎమ్మెల్యే, 17 ఎంపీ సీట్లకు అభ్యర్థుల ఖరారు

సాక్షి, అమరావతి: టీడీపీ అభ్యర్థుల తుది జాబితాను ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎట్టకేలకు ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న 9 ఎమ్మెల్యే, నాలుగు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను శుక్రవారం ఖరారు చేశారు. దీంతో 144 ఎమ్మెల్యే, 17 ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో 94 సీట్లు ప్రకటించినా పి.గన్నవరం అభ్యర్థి రాజేష్‌ని అన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఆయనకు సీటు ఉపసంహరించారు. ఈ జాబితాలోనే అనపర్తి, అరకు సీట్లు ఖరారు చేసినా అవి రెండు బీజేపీకి వెళ్లడంతో వాటిని వదులుకున్నారు. రెండో జాబితాలో ఖరారు చేసిన కదిరి స్థానంలో తాజాగా మార్పులు చేశారు. మొదటి జాబితాలో 13 ఎంపీ స్థానాలకు ప్రకటించగా పొత్తులో మిగిలిన నాలుగు సీట్లకు ఇప్పుడు అభ్యర్థులను ఖరారు చేశారు. దీంతో టీడీపీ పోటీ చేసే చోట్ల మొత్తం అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.

చీపురుపల్లికి కళా వెంకట్రావు

చీపురుపల్లి సీటును చివరికి రాష్ట్ర టీడీపీ మాజీ అధ్యక్షుడు కళా వెంకట్రావుకు అంటగట్టారు. ఓడిపోయే ఆ స్థానంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును పోటీ చేయించడానికి ఎంత ప్రయత్నించినా ఆయన అంగీకరించలేదు. దీంతో కళా వెంకట్రావును అక్కడ పోటీ చేయించాలని నిర్ణయించారు. ఆయన ఇన్‌ఛార్జిగా ఉన్న ఎచ్చెర్ల సీటు పొత్తులో బీజేపీకి కేటాయించడంతో కళాకు చీపురుపల్లి సీటు ఇచ్చారు. దీనికి ఆయన చాలారోజులు ఒప్పుకోకపోయినా బుజ్జగించి ఖరారు చేశారు. విశాఖ జిల్లా భీమిలి సీటు కోసం మొదటి నుంచి గట్టిగా పట్టుబడిన గంటా చివరికి దాన్ని దక్కించుకున్నారు. ఒక దశలో ఆ సీటు జనసేనకు వెళ్లే పరిస్థితి ఏర్పడగా గంటా పెద్ద ఎత్తున లాబీయింగ్ చేయడంతోపాటు భారీగా డబ్బులిచ్చి విశాఖ జిల్లాలో నాలుగు స్థానాల ఆర్థిక బాధ్యతలు కూడా చూసుకునేందుకు ముందుకు రావడంతో ఆయనకే సీటు ఇచ్చినట్లు తెలుస్తోంది. అరకు జిల్లా పాడేరు (ఎస్టీ) స్థానాన్ని కిల్లు వెంకట రమేష్‌నాయుడుకి ఇచ్చారు. మొదట ఈ సీటును బీజేపీకి కేటాయించే ఉద్దేశంతో అభ్యర్థిని ప్రకటించలేదు. కానీ బీజేపీ అరకు సీటును తీసుకోవడంతో ఆ స్థానంలో ఖరారు చేసిన దొన్నుదొర అభ్యర్థిత్వాన్ని టీడీపీ ఉపసంహరించుకుంది. దాని బదులు ఇప్పుడు పాడేరు స్థానంలో అభ్యర్థిని ప్రకటించింది. అభ్యర్థి దొరకని దర్శి స్థానానికి బయట ప్రాంతం నుంచి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని దిగుమతి చేసుకుని సీటు కేటాయించారు.

అసంతృప్త నేత సుబ్రహ్మణ్యంకు రాజంపేట

రాయచోటి ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీ సీట్లలో ఏదీ దక్కక తీవ్ర అసంతృప్తితో ఉన్న సుగవాసి సుబ్రహ్మణ్యంకు రాజంపేట ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. దీంతో ఆ సీటుపై ఆశలు పెట్టుకున్న భత్యాల చెంగల్రాయుడు, జగన్మోహనరావుకు షాక్ తగిలింది. కర్నూలు జిల్లా ఆలూరు స్థానాన్ని వీరభద్రగౌడ్‌కి కేటాయించి కోట్ల సుజాతమ్మకు షాక్ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ఆలూరు సీటు ఇవ్వకపోవడంతో టీడీపీలోకి ఫిరాయించిన గుమ్మనూరు జయరామ్‌కి గుంతకల్లు టికెట్ ఇచ్చారు. అనంతపురం అర్బన్ సీటును దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కి కేటాయించి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర చౌదరికి ఝలక్ ఇచ్చారు. అనంతపురం జిల్లా కదిరి స్థానంలోనూ మార్పు చేశారు. ఈ స్థానాన్ని ఆశించిన కందికుంట ప్రసాద్‌పై నకిలీ డీడీల కేసు ఉండడంతో రెండో జాబితాలో ఆయన భార్య యశోదా దేవికి సీటు ఇచ్చారు. అయితే ప్రసాద్‌పై కేసును కోర్టు కొట్టివేయడంతో యశోదాదేవి బదులు ఇప్పుడు ప్రసాద్‌కి సీటు ఖరారు చేశారు.

కడపలో ఫలించని బాబు తంత్రం

పెండింగ్‌లో ఉన్న నాలుగు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. ఎచ్చెర్ల సీటు దక్కక అసంతృప్తితో ఉన్న కలిశెట్టి అప్పలనాయుడికి విజయనగరం ఎంపీ సీటును కేటాయించారు. ఒంగోలు సీటును ఫిరాయింపు నేత మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఖరారు చేశారు. అనంతపురం ఎంపీ స్థానాన్ని అంబికా లక్ష్మీ నారాయణకు ఇచ్చి జేసీ కుటుంబానికి షాక్ ఇచ్చారు. జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు పవన్‌రెడ్డి ఈ సీటు కోసం లాబీయింగ్ చేసినా ఫలితం దక్కలేదు. కడప ఎంపీ సీటును జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డికి కేటాయించారు. జమ్మలమడుగు సీటు బీజేపీకి వెళ్లడంతో భూపేష్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. బీజేపీ నేత, తన బాబాయి ఆదినారాయణరెడ్డిపై ఆయన తీవ్ర ఆగ్రహంగా ఉండడంతో తప్పని పరిస్థితుల్లో కడప ఎంపీ సీటు ఇచ్చారు. వైఎస్ వివేకా హత్యోదంతాన్ని అడ్డు పెట్టుకుని కడప ఎంపీ సీటుపై రాజకీయం చేయాలని ప్రయత్నించిన చంద్రబాబు చివరికి అభాసుపాలై అసంతృప్త నేతకు టికెట్ ఇవ్వాల్సి వచ్చింది.

ఖరారైన టీడీపీ ఎంపీ అభ్యర్థులు

పార్లమెంటు స్థానం	అభ్యర్థి
విజయనగరం	కలిశెట్టి అప్పలనాయుడు
ఒంగోలు	మాగుంట శ్రీనివాసులరెడ్డి
అనంతపురం	అంబికా లక్ష్మీనారాయణ
కడప	చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి

ఎమ్మెల్యే అభ్యర్థులు

ఎమ్మెల్యే స్థానం	అభ్యర్థి
చీపురుపల్లి	కళా వెంకట్రావు
భీమిలి	గంటా శ్రీనివాసరావు
పాడేరు (ఎస్టీ)	కిల్లు వెంకట రమేష్‌నాయుడు
దర్శి	డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
రాజంపేట	సుగవాసి సుబ్రహ్మణ్యం
ఆలూరు	వీరభద్రగౌడ్
గుంతకల్లు	గుమ్మనూరు జయరాం
అనంతపురం అర్బన్	దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్
కదిరి	కందికుంట వెంకట ప్రసాద్

క్యూట్ పీజీసెట్‌కు 4.62 లక్షల మంది హాజరు



సాక్షి, అమరావతి: దేశంలోని కేంద్రీయ విశ్వ విద్యాలయాలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (క్యూట్–పీజీ) విజయవంతంగా ముగిసినట్టు యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్ శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. మార్చి 11వ తేదీ నుంచి 28 వరకు 565 కేంద్రాల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్టు విధానంలో పరీక్షలు నిర్వహిం చామన్నారు. భారత్‌లోని 253 నగరాలతో పాటు దేశం వెలుపల మనమా, దుబాయ్, ఖట్మాండు, మస్కట్, రియాద్, ఒట్టావా, అబుదాబి, వియన్నా, ఖతార్‌లాంటి నగరాల్లోనూ పరీక్షలు చేపట్టామన్నారు. 2024–25 విద్యా సం వత్సరం పీజీ ప్రవేశాలకు క్యూట్‌లో 190 వర్సిటీలు పాల్గొన్నట్టు పేర్కొన్నారు. ఇందులో 4.62లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 7.68లక్షల టెస్టులు నిర్వహించామన్నారు. 950 మంది నిపుణులు, 200 మంది అనువాదకులు ప్రశ్న పత్రాలను తయారు చేయడంలో భాగస్వాములయ్యారని వివరించారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు



సాక్షి, అమరావతి: ఏపీలోని 164 ఆదర్శ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయా మండలా ల్లోని ఆదర్శ పాఠశాలల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థుల సౌకర్యార్థం దరఖాస్తు గడు వును వచ్చే నెల 6 వరకు పొడిగించామని తెలిపారు. ప్రవేశ పరీక్షను 5వ తరగతి స్థాయిలో తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో రాయొచ్చని.. విద్యాభ్యాసం అంతా ఆం గ్లంలోనే ఉంటుందన్నారు. WWW.cse.ap.gov.in/apms.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

4.42 కోట్ల పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రారంభం



ముద్రణను పరిశీలిస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

సాక్షి, అమరావతి: ఏపీలో వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రారంభమైంది. వేసవి సెలవుల అనం తరం పాఠశాలలు తెరిచిన రోజే (జూన్ 12) వీటిని విద్యార్థులకు పంపిణీ చేసే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ 4.42 కోట్ల పాఠ్యపుస్తకాల ముద్రణకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే ఒకటి నుంచి పదో తరగతి వరకు ద్విభాషా (బైలింగ్యువల్) విధానంలో పాఠ్యపుస్తకాలను అం దిస్తున్న బోర్డుగా ఏపీ పాఠశాల విద్యా శాఖ నిలుస్తోంది. 10వ తరగతి ఫిజికల్ సైన్స్ పుస్తకం భవిష్యత్తులోనూ రిఫరెన్స్ బుక్‌గా ఉండేలా తీర్చిదిద్దుతోంది. 2024–2025 విద్యా సంవత్సరంలో తొలిసారిగా ఫ్యూచర్ స్కిల్ సబ్జెక్టును పరిచయం చేస్తూ 8వ తరగతి విద్యార్థులకు బోధించనుంది. 3–9 తరగతులకు టోఫెల్ కోసం వర్క్‌బుక్‌లను సిద్ధం చేస్తోంది. ఈ పాఠ్యపుస్తకాల పీడీఎఫ్ కాపీలను వెబ్‌సైట్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచనుంది.

తొలిసారిగా బ్రెయిలీ లిపిలో ఫిర్యాదు.. కేసు నమోదు

విశాఖ సిటీ: రాష్ట్రంలో తొలిసారిగా ఒక దివ్యాంగుడు బ్రెయిలీ లిపిలో ఇచ్చిన ఫిర్యాదుపై విశాఖ నగర పోలీసులు కేసు నమోదు చేశారు. దివ్యాంగుల సమ స్యల పరిష్కారానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. దిశ దివ్యాంగ్ సురక్ష ద్వారా ప్రతి నెలా 2, 15 తేదీల్లో దివ్యాంగుల నుం చి ఫిర్యాదులు స్వీకరించేందుకు డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహిం చాలని నిర్ణయించారు. బ్రెయిలీ లిపిలో ఫిర్యాదులు స్వీకరించేందుకు అందులో పరిజ్ఞానం ఉన్నవారిని నియమించారు. ఈ నెల 15వ తేదీన తొలిసారి నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం జల్లూరు గ్రామా నికి చెందిన దివ్యాంగుడు డయల్ యువర్ సీపీకి ఫోన్ చేశాడు. అధిక లాభాలు ఇస్తానని చెప్పి బిర్లా జంక్షన్ ప్రాంతంలో ఉన్న క్రేసుల్లా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తన వద్ద రూ.2.9 లక్షలు, కాకినాడకు చెందిన తన స్నేహితుడు పిప్పర వెంకటేశ్వ రరావు నుంచి రూ.11 లక్షలు తీసుకుని మోసం చేసిందని చెప్పారు. అతడి ఫిర్యాదును బ్రెయిలీ లిపిలో నమోదు చేశారు. ఆ ఫిర్యాదును తీసుకున్న పోలీ సులు చీటింగ్, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విశాఖ చేరిన ఢిల్లీ, చెన్నై జట్లు





ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న రిషబ్ పంత్, ఎంఎస్ ధోని

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్‌లో భాగంగా ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో తలపడేం దుకు ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్లు శుక్రవారం విశాఖ చేరుకున్నాయి. ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న రెండు జట్లు శనివారం వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ చేయనున్నాయి. ఉదయం ఆరుగంటల నుంచి తొమ్మిది వరకు డీసీ జట్టు, సాయంత్రం ఆరునుంచి రాత్రి తొమ్మిది గం టల వరకు సీఎస్‌కే జట్టు నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తాయి. డీసీ జట్టు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోమ్ పిచ్‌గా ఎంచుకోవడంతో జరిగే మ్యాచ్ ఆదివారం రాత్రి ఏడున్నర గంటలకు ప్రారంభం కానుంది. మరో మ్యాచ్ ఏప్రిల్ 3వ తేదీన కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) జట్టుతో వైఎస్సార్ స్టేడియం లోనే తలపడనున్న విషయం విదితమే. సీఎస్‌కే ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించగా, డీసీ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలై... హోమ్‌గ్రౌండ్‌లో శుభారంభం చేసేందుకు సిద్ధమవుతోంది.

విశ్వరూపుడు, సర్వజ్ఞుడు, సర్వధారి, జ్యోతిర్మయుడు,
అద్వితీయుడు అయిన సహస్ర కిరణ సూర్యుడే వందలు,
వేల రీతుల్లో చలిస్తూ, సమస్త జీవులకు జీవనప్రదాతగా ఉదయిస్తున్నాడు.
– ప్రశ్నోపనిషత్తు

సాక్షి
శనివారం, 30 మార్చి 2024

నిందలూ... నిజాలూ

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు ఉదంతంపై అంతర్జాతీయంగా వచ్చిపడుతున్న వ్యాఖ్యానాలు, విమర్శలు ఇప్పట్లో ఆగేలా లేవు. తాజాగా ఐక్యరాజ్యసమితి ప్రకటనతో ఈ సంగతి రుజువవుతోంది. మొదట జర్మనీ, ఆ తర్వాత అమెరికా చేసిన వ్యాఖ్యానాలపై మన దేశం ప్రతిస్పందిస్తుండగానే ఐక్యరాజ్యసమితి అధికార ప్రతినిధి సైతం కేజ్రీవాల్ కేసులో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించటం సాధారణ విషయం కాదు. పైగా ఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్త గ్లోరియా బెర్బేనాను విదేశాంగ శాఖ కార్యాలయానికి పిలిపించి మన అసంతృప్తిని, అభ్యంతరాన్ని తెలియజేసి 24 గంటలు గడవకుండానే రెండోసారి కూడా కేజ్రీవాల్ కేసులో అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. దాంతోపాటు కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయటాన్ని కూడా ప్రస్తావించింది. ఇక అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటన సరేసరి. అన్నిటికీ అతీతమని భావించుకునేవారు సైతం అనుకోకుండా వచ్చిపడే పొగడ్తలకు లోలోన సంతోషపడకుండా వుండలేరు. అలాగే విమర్శలొచ్చినప్పుడూ, తప్పును ఎత్తిచూపినప్పుడూ పౌరుషం పొడుచుకురావటం కూడా సహజం. పాశ్చాత్య దేశాలు అవసరార్థమో, అనివార్య పరిస్థితుల్లోనో మన దేశాన్ని ప్రశంసలతో ముంచెత్తిన ఉదంతాలు కోకొల్లలు. అయితే వాటినుంచి వచ్చే విమర్శలు అలా కాదు. అవి అరుదే కావొచ్చుగానీ ఆలోచించదగినవి. ఇందిరాగాంధీ దేశంలో ఆత్యయిక పరిస్థితి ప్రకటించి దేశాన్నే జైలుగా మార్చినప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు చెలరేగాయి. అనంతరకాలంలో మేధావులనూ, పౌరహక్కుల సంస్థల నేతలనూ అరెస్టు చేసిన సందర్భాల్లో పాశ్చాత్య ప్రపంచం స్పందించకపోలేదుగానీ... ఇప్పుడు కేజ్రీవాల్ అరెస్టుపై వెలువడుతున్న స్పందన తీవ్రత అధికం.

ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల ద్వారా ఏర్పడే ప్రభుత్వాలకూ, అవి ప్రాతినిధ్యం వహించే రాజ్యాలకూ అంతర్జాతీయంగా ఆమోదనీయత, విశ్వసనీయత వుంటాయి. అయితే అసమ్మతి విషయంలో వాటి వైఖరి ఎలావుందన్నదాన్నిబట్టి ఆ ప్రభుత్వాల నైతిక స్థితి నిర్ణయమవుతుంది. దాన్ని పొందాలంటే సంయమనం పాటించటం, విమర్శలను హుందాగా స్వీకరించటం, పాలనలో పారదర్శకంగా వుండటం అవసరమవుతాయి. అగ్రరాజ్యాలు అన్నాయని కాదుగానీ, మన దేశంలో అంతా సవ్యంగానే వున్నదని భావించగలమా? కేజ్రీవాల్ అరెస్టు వ్యవహారమే తీసుకుంటే దాదాపు రెండేళ్లనుంచి మద్యం కుంభకోణం గురించీ, అందులో కేజ్రీవాల్‌తోపాటు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పేరు వినిపిస్తూనే వుంది. కానీ తనను తక్షణం విడుదల చేయాలన్న కేజ్రీవాల్ వాదనకు జవాబిచ్చేందుకు మూడు వారాల వ్యవధి కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) న్యాయస్థానాన్ని కోరటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయన వాదనను పూర్వపక్షం చేసే పకడ్బందీ ఆధారాలు ఆ సంస్థ వద్ద ఉంటే వాటిని న్యాయస్థానం ముందుంచి ఈ కారణాల రీత్యా కేజ్రీవాల్ వాదన చెల్లదని వెనువెంటనే చెప్పలేని స్థితిలో వుండటం ఈడీ తీరుతెన్నులపై అనుమానాలు రేకెత్తించదా? ఆమధ్య మనీశ్ సిసోడియా విషయంలోనూ ఇలాగే జరిగింది. ఆయనపై అప్రూవర్‌లు ఇచ్చిన ప్రకటనలు మినహా తమ వద్ద వేరే ఆధారాల్లేవని సుప్రీంకోర్టు ముందే ఆ సంస్థ అంగీకరించింది. ఇప్పుడు కేజ్రీవాల్ ఆ అంశంపైనే నిలదీస్తున్నారు. ఒక ముఖ్యమంత్రిపై ఎవరో ఆరోపణలు చేస్తే కేవలం వాటి ఆధారంగా అరెస్టు చేయటం సబబేనా అని న్యాయస్థానం ముందు వినిపించిన వాదనల్లో ఆయన ప్రశ్నించారు. దేనికైనా సమయం, సందర్భం చూసుకోవాలంటారు. ఒకపక్క సార్వత్రిక ఎన్నికలు ముంగిట్లో వున్నాయి. అన్ని పార్టీలూ తమ తమ సత్తా చాటేందుకు పొత్తులు ఖరారు చేసుకుని వ్యూహరచనలో మునిగాయి. ఇలాంటి సమయంలో విపక్ష కూటమి అధినేతను అరెస్టు చేయటం విమర్శలకు ఆస్కారమిస్తుందని తెలియనంత అమాయకత్వంలో ఈడీ వున్నదంటే నమ్మలేం. మరో మూడు నాలుగు నెలలు ఆగితే ఇందులో కొంపమునిగేది ఏముందన్న ప్రశ్నకు ఆ సంస్థ దగ్గర జవాబులేదు. నేరం నిరూపణయ్యేవరకూ నిందితుడు నిర్దోషనని న్యాయశాస్త్రం చెబుతుంది. అలాగే అసాధారణ పరిస్థితుల్లో తప్ప నిందితులను జైలుకు పంపరాదని ఇటీవల సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కింది కోర్టులకు హితవు పలికారు. పౌరులకు రాజ్యాంగం కల్పించే ఈ రక్షణలను విస్మరించటం, నీరు కార్చటం బాహాటంగా కనిపిస్తుంటే విమర్శలు రావా? మన దేశంలో ఇప్పటికీ ఇతర వ్యవస్థలతో పోలిస్తే న్యాయవ్యవస్థకు విశ్వసనీయత అధికం. దాన్ని మరింత పెంచేలా ప్రభుత్వ విభాగాల వ్యవహారశైలి వుండాలి. దానికి విఘాతం కలిగితే పాలకపక్షం సంగతలావుంచి దేశ పరువుప్రతిష్ఠలకే భంగం వాటిల్లుతుంది.

అమెరికా రెండోసారి కూడా అన్నదనో, జర్మనీ విమర్శించిందనో, ఐక్యరాజ్యసమితి సైతం మాట్లాడిందనో కాదు... చట్టం ముందు పౌరులంతా సమానమన్న రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరిస్తున్నామా లేదా అన్న అంశంలో ఆత్మవిమర్శ చేసుకోక తప్పదు. సహ ప్రజాస్వామిక దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం విషయంలో బాధ్యతతో మెలగాలనీ, దాన్ని విస్మరించటం సరికాదనీ మన విదేశాంగ శాఖ హితవు పలికింది. కానీ మానవహక్కుల ఉల్లంఘనల అంశంలో మనం కూడా వేరే దేశాల తీరుతెన్నులను విమర్శించిన సందర్భాలున్నాయని గుర్తించాలి. మనం అన్ని విషయాల్లోనూ సక్రమంగానే వున్నామన్న భావన ఇంటా బయటా కలగజేయటం ప్రభుత్వ బాధ్యత. దానికి భిన్నమైన పరిస్థితులుంటే అవి ఎందుకు తలెత్తాయో సమీక్షించుకోవటం అవసరం.

స్వేచ్ఛా మార్కెట్ పరిష్కారం కాదు!

విశ్లేషణ



దేవీందర్ శర్మ

గతేదాది కనీసం 65 దేశాలలో రైతులు నిరసనలు చేపట్టారు. ఖండాంతరాలలో జరిగిన ఈ నిరసనలు ప్రధానంగా పంటల ధరలు, అధిక ఉత్పత్తి వ్యయం, చౌకైన దిగుమతులు, ప్రోత్సాహకాల ఉపసంహరణ, స్థానిక సమస్యలకు వ్యతిరేకంగా సాగాయి. నిజానికి వ్యవసాయ సంక్షోభం కొనసాగడానికి స్వేచ్ఛా మార్కెట్లే కారణం. మార్కెట్లకు విజ్ఞత ఉంటే, రైతులు నష్టపోవడానికి కారణమే లేదు. ఆర్థిక వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉందో చెప్పడానికి రైతుల నిరసనలు నిదర్శనం. చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అనేది భారతీయ రైతులకే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాగుదారులకు కూడా అనుసరణీయ మార్గం. వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా పేదరికంలో ఉంచిన ఆర్థిక రూపకల్పనను సమూలంగా సరిదిద్దడానికి ఇదే సమయం.

భారతదేశంలో, ఐరోపాలోని కొన్ని ప్రాంతాల్లో రైతుల తిరగబడటాన్ని ప్రపంచం గమనిస్తోంది. 2023 జనవరి నుండి కనీసం 65 దేశాలలో రైతులు నిరసనలు చేపట్టారు. కనీవినీ ఎరుగని నిరసనల వెల్లువ వెనుక కారణాలు వేరువేరుగా ఉన్నప్పటికీ, వాటన్నింటినీ కలిపే సాధారణ సూత్రం ఒకటే: నియంత్రణ లేని మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వైఫల్యం.

రైతులు తమ అసంతృప్తిని వెళ్లగక్కేందుకు ఉపయోగించే పదాలు ఒక దేశం నుండి మరొక దేశానికి భిన్నంగా ఉండవచ్చు. కానీ అంతర్లీన సందేశం ఒకటే: వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో మార్కెట్లు విఫలమయ్యాయి. భారతదేశ రైతులు కనీస మద్దతు ధరను చట్టబద్ధమైన హక్కుగా కోరుకుంటుండగా, యూరోపియన్ రైతులు తమ ఉత్పత్తులకు సరైన విలువను డిమాండ్ చేస్తున్నారు. కెన్యాలో బంగాళదుంపల ధర పతనం, నేపాల్‌లో కూరగాయల ధరలు తక్కువగా ఉండటంతో పాటు జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియంతో సహా యూరప్‌లోని అనేక దేశాలలో ఉత్పత్తి వ్యయం పెరగడం, చౌక దిగుమతులు, ఉత్పత్తి ధరలు పడిపోవడాన్ని కూడా నిరసనలు హైలైట్ చేశాయి.

స్పెయిన్‌లోని రైతులు నాలుగు లక్షల లీటర్ల పాలను వీధుల్లో పారబోశారు. మలేషియా సాగుదారులు తక్కువ వరి ధరలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఫ్రాన్స్‌లో, అధ్యక్షుడు మాక్రాన్‌తో ఇటీవల జరిగిన సమావేశంలో చిన్న రైతుల ప్రముఖ సంస్థ అయిన 'కాన్ఫెడరేషన్ పేసన్'... రైతులకు సామాజిక రక్షణ కల్పించడంతో సహా హామీ ఇవ్వబడిన వ్యవసాయ ధర కంటే తక్కువ ధరకు కొనుగోళ్లను అనుమతించకూడదనే వాగ్దానాన్ని కోరింది. వాణిజ్య సరళీకరణను కూడా రైతులు వ్యతిరేకించారు.

జర్మనీ, ఫ్రాన్స్, రొమేనియా, ఇటలీ, పోలాండ్‌లలో రైతులు ఉక్రెయిన్ నుండి వచ్చే చౌక దిగుమతులకు వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించారు. పైగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను సమీక్షించాలని కోరుతున్నారు. వారు హైవేలను అడ్డుకున్నారు, దిగుమతి చేసుకున్న వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళుతున్న ట్రక్కులను నిలిపివేశారు, చాలా చోట్ల దిగుమతి చేసుకున్న ఆహార పదార్థాలను ధ్వంసం చేశారు. ఫ్రాన్స్‌లో, చౌకైన చేపల దిగుమతులకు వ్యతిరేకంగా వేలాది మంది రైతులు, మత్స్యకారులు ఓడరేవుల వద్ద నిరసన తెలిపారు. ఇది వ్యవసాయ జీవనోపాధిని నాశనం చేస్తుందని వారు చెప్పారు. భారతదేశం విషయానికి వస్తే, ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత్ వైదొలగాలని నిరసన తెలుపుతున్న రైతులు తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.

'డౌన్ టు ఎర్త్' మ్యాగజైన్ సంకలనం ప్రకారం, యూరప్‌లోని 24 దేశాలు రైతు నిరసనలను ఎదుర్కొంటుండగా, ఆఫ్రికాలో 12, ఆసియాలో 11, దక్షిణ, ఉత్తర, మధ్య అమెరికాల్లో ఎనిమిదేసి దేశాలు,



యూరప్‌లో రైతుల నిరసన ప్రదర్శన

ఓషియానియాలో రెండు దేశాలు గత సంవత్సరం రైతు ప్రదర్శనల వల్ల ప్రకంపించిపోయాయి. ఐరోపాలో, స్వతంత్ర పాన్-యూరోప్ మీడియా నెట్‌వర్క్ అయిన 'యూరాక్టివ్' 2024 జనవరి-ఫిబ్రవరిలో తాజా దశ నిరసనలపై చేసిన అధ్యయనం... రైతులకు న్యాయమైన, లాభదాయకమైన ధర కోసం బలమైన డిమాండ్ ఉంటోందని తెలిపింది. ప్రధానంగా ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ నుండి ఈ డిమాండ్ వెలువడింది. బెల్జియం రైతులు ఆహార గొలుసు విధానంలో కూడా రక్షణ కోరుకుంటున్నారు. నికర సున్నా ఉద్గారాలను సాధించే ప్రయత్నంలో యూరోపియన్ కమిషన్ విధించడానికి ప్రయత్నిస్తున్న కఠినమైన పర్యావరణ నిబంధనలపై కూడా వారి కోపం నిర్దేశితమైంది.

వ్యవసాయ రంగంపై వాణిజ్య ప్రభావం యూరోపియన్ యూనియన్ రైతులకు ఆందోళన కలిగిస్తోంది. జర్మన్ రైతుల ప్రదర్శనలు... వ్యవసాయ వాహనాలకు ఇంధనంపై పన్ను మినహాయింపులను ఉపసంహరించుకోవడం గురించి సాగాయి (దీనిని జర్మనీ దశలవారీగా రద్దు చేయడానికి అంగీకరించింది); 'నైట్రేట్ డైరెక్టివ్' లాంటి కఠినమైన పర్యావరణ నిబంధన లతోపాటు తక్కువ ధరలను భర్తీ చేయడానికి ప్రోత్సాహకాల డిమాండ్‌పై దృష్టి సారించాయి. సారాంశంలో, ఖండాంతరాలలో జరిగిన ఈ నిరసనలలో చాలా వరకు ప్రధానంగా పంటల ధరలు, అధిక ఉత్పత్తి వ్యయం, చౌకైన దిగుమతులు, ప్రోత్సాహకాల ఉపసంహరణ, స్థానిక సమస్యలకు వ్యతిరేకంగా ఉన్నాయి.

వ్యవసాయాన్ని మార్కెట్ల చేతుల్లోకి వదిలేయడం వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరగలేదు. ప్రపంచవ్యాప్తంగా రైతుల నిరసనలే ఇందుకు నిదర్శనం. ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు ఉద్దేశపూర్వకంగా ఆహార ధరలు తక్కువగా ఉండేలా చూసుకున్న ఆధిపత్య ఆర్థిక ఆలోచనకు భారతీయ వ్యవసాయం బలయ్యింది. ఇది కాలం చెల్లిన విధానం. మారుతున్న వాస్తవాలకు అనుగుణంగా ఆర్‌బీఐ తన స్థూల ఆర్థిక విధానాలను పునఃసమీక్షించే సమయం ఆసన్నమైంది. 2022-23 గృహ వ్యయ సర్వే ప్రకారం, ప్రతి కుటుంబం మీద గృహం, ఆరోగ్యం, విద్యపై నిరంతరం పెరుగుతున్న వ్యయంతో భారం పడినప్పటికీ, ఆహారంపై ఖర్చు గణనీయంగా తగ్గింది.

కఠినమైన స్థూల ఆర్థిక నియంత్రణ నుండి వ్యవసాయ ధరలకు అవసరమైన దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను నొక్కిచెప్పిన క్షణం, దానికి బలమైన వ్యతిరేకత వస్తుంది. 'ఇది అధిక ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది, తద్వారా మార్కెట్ వక్రీకరణలు జరుగుతాయని మేము హెచ్చరించాము' అంటూ గ్యారెంటీ ధర కావాలని రైతులు పునరుద్ఘాటించినప్పుడల్లా విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఒక కార్పొరేట్ వైఫల్యం ఫలితంగా కోవిడ్ మహమ్మారి సంవత్సరాల్లో ద్రవ్యోల్బణం 57 శాతం పెరిగి, 2023లో 53 శాతం చుట్టూ చేరినప్పుడు మాత్రం అదే ఆర్థిక ఆలోచన స్పష్టంగా నిశ్శబ్దంగా ఉంది.

వ్యవసాయ ధరలను స్థిరీకరించడానికి అనేక దశాబ్దాలుగా అనేక ప్రోత్సాహకాలు, దేశీయ మద్దతు యంత్రాంగాలు ప్రయత్నించినప్పటికీ, వాస్తవికత ఏమిటంటే వ్యవసాయ కష్టాలు ప్రపంచవ్యాప్తంగా మరింత తీవ్రమవుతున్నాయి. వ్యవసాయంలో మార్కెట్ సంస్కరణలు అరువు తెచ్చుకున్న అమెరికాలో కూడా స్వేచ్ఛా మార్కెట్ రూపకల్పన అనేది చిన్న రైతులను వ్యవసాయం నుండి ఎలా బయటకు నెట్టిందో, వారిని కష్టాల బాటలో ఎలా వదిలివేసిందో, పొలంలో విధ్వంసాన్ని ఎలా సృష్టించిందో 'నాసా' మాజీ శాస్త్రవేత్త వేదవ్రత పెయిన్ దర్శకత్వం వహించిన 'డెజా వు' డాక్యుమెంటరీ చూపిస్తుంది.

కాబట్టి స్వేచ్ఛా మార్కెట్ పరిష్కారం కాదు. నిజానికి వ్యవసాయ సంక్షోభం కొనసాగడానికి ఇదే కారణం. మార్కెట్‌లకు విజ్ఞత ఉంటే, సమర్థతకు ప్రతిఫలమివ్వగలిగితే, వ్యవసాయం నష్టపోయే ప్రతిపాదనగా ఉండటానికి కారణమే లేదు. ఆర్థిక వ్యవస్థ ఎంత లోప భూయిష్టంగా ఉందో చెప్పడానికి ప్రపంచవ్యాప్తంగా రైతుల నిరసనలు నిదర్శనం. వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా పేదరికంలో ఉంచిన ఆర్థిక రూపకల్పనను సమూలంగా సరిదిద్దడానికి ఇది సమయం. చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అనేది భారతీయ రైతులకు మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాగుదారులు అందరికీ వర్తించే మార్గం. మార్కెట్లు తదనుగుణంగా సర్దుబాటు అవుతాయి.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ-మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రభువు వల్లే విలువ



మన ఉనికికి విలువను కేవలం ప్రభువు మాత్రమే ఇవ్వగలడు. సిలువ నుంచి ఆయన ప్రతిరోజూ ఇది చెబుతాడు: ఆయన దృష్టిలో మనం ఎంత విలువైనవాళ్లమో చూపేందుకే ఆయన మనకోసం మరణించాడు. ఏ అవాంతరమూ, వైఫల్యమూ కూడా మృదువైన ఆయన ఆలింగనాన్ని అందకుండా చేయలేదు.

– పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మతగురువు

దారుణ వసూళ్లు



రామ మందిరాన్ని దర్శించడానికి వస్తున్న భారీ జనానికి తగిన ఆతిథ్యం ఇవ్వలేనంతటి చిన్న ప్రదేశం అయోధ్య. ఒక రాత్రికి రూ.1,500 విలువ కూడా చేయని అతి మామూలు హోటళ్లు కూడా 11,000 వసూలు చేస్తున్నాయి. ఆలయానికి దగ్గరగా ఉండటమే ఇక్కడి ఏకైక సౌకర్యం. అయినప్పటికీ ఇది స్కామే!

– మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

ఒప్పుకొందాం!



పాకిస్తాన్ పట్ల ఇండియా కఠిన వైఖరి గురించి పాకిస్తాన్‌లో కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. కశ్మీర్ విద్రోహం(1989- 2019), కార్గిల్ (1999), పార్లమెంట్ దాడి (2001), ముంబయి తీవ్రవాద దాడి (2008), ఇంకా ఇలాంటి ఎన్నోవాటి ఫలితం ఇది. దీన్ని ముందు అంగీకరిస్తే చర్చ నిజాయితీగా, సాఫీగా సాగుతుంది.

– హుసేన్ హక్కానీ, పాక్ మాజీ రాయబారి

వదిలేద్దురూ!



మోదీ అత్యంత ప్రజాదరణతో కొనసాగుతున్నారు. 2019లో బీజేపీ నెగ్గిన చాలా రాష్ట్రాల్లో అదే ఫలితం తిరిగిరానుంది. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో పార్టీ ఎటూ రాణిస్తుంది. అలాంటప్పుడు అధికారాన్ని దుర్వినియోగం చేయడం అవివేకం. గణతంత్రానికి జరిగే నష్టాన్ని తిరిగి పూడ్చడం చాలా కష్టం.

– ఆకార్ పటేల్, కాలమిస్ట్

అంతటా ఇలాగేనా?



ఉచిత సర్వీస్ కాబట్టి గూగుల్ మ్యాప్స్ మీద ఫిర్యాదు చేయకూడదు. కానీ బ్రిటిష్ రోడ్ల మీద అది రోజూ ఓడిపోతుంటుంది. మతివున్నవాడు ఎవరూ ఎంపిక చేసుకోని దారిని తరచూ చూపుతుంటుంది.

– పాల్ గ్రాహమ్, సైంటిస్ట్

ఇన్ బాక్స్

నేర్చుకోవాల్సిన గుణ పాఠాలు

'బాబును నమ్ముకున్న వాడు బాగుపడిన దాఖలా లేదు' అన్నది రాష్ట్ర రాజకీయాల్లో స్థిరపడిపోయిన ఒక నానుడి. అంతే కాదు వెన్నుపోటు అనగానే చంద్రబాబు గుర్తుకు వస్తారని ఆయన ప్రత్యర్థుల్లోనే కాదు ప్రజల్లో కూడా ఒక అభిప్రాయం బలపడి ఉంది. ఈ రెండో అభిప్రాయానికి కారణం 1982లో తెలుగు దేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవంగా గుర్తింపు తెచ్చుకున్న ఎన్టీఆర్‌ను చంద్రబాబు పదవీచ్యుతుణ్ణి చేయటం, ఆయన ప్రభుత్వాన్నీ, పార్టీనీ, ఆస్తులను కబ్జా చేయటం వంటి చరిత్ర అంతా ప్రజలకు తెలిసినదే. ఇక మొదట చెప్పుకున్న నానుడి గురించి చూద్దాం.

2014లో రాష్ట్ర విభజన అనంతరం... కొత్త రాష్ట్రానికి 'ఇటువంటి పాలనా అనుభవం ఉన్న వ్యక్తి కావాలి' అన్న అభిప్రాయం కొందరిలో కలిగింది. దీనికి తోడు ఒక వైపు నరేంద్రమోదీ, మరోవైపు పవన్ కల్యాణ్ కటౌట్‌లను బాబు వెంట తెచ్చుకున్నారు. వ్యవసాయ రుణాల మాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ వంటి అబద్ధాల హామీలు తోడయ్యాయి. కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 67 స్థానాలతో అధికారానికి అడుగు దూరంలో ఉండి పోయింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల కొనుగోళ్ళకు తెర తీశారు. ప్యాకేజీకో, పదవులకో ఆశపడి 23 మంది వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చంద్రబాబు పంచన చేరారు. నలుగురికి బుగ్గ కార్లు వచ్చాయి. మిగిలిన వారు సూట్ కేసులతో సరిపెట్టుకుని ఉంటారు. మొత్తం మీద 2019 ఏప్రిల్ వరకు వీళ్ల లైఫ్ మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిపోయింది. మరి ఇప్పుడు ఈ 23 మంది రాజకీయ పరిస్థితి ఎలా ఉంది? ఆసక్తి కొద్దీ వీరి లెక్కలు తీస్తే చంద్రబాబు వెన్నుపోటు నైజం కళ్ళకు కడుతుంది.

2014–19 మధ్య వైఎస్సార్‌సీపీని వీడిన 23 మంది ఎమ్మెల్యేల్లో 15 మంది రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. వీరిలో 10 మంది వరకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారే. 2019 ఎన్నికల్లో 23 మందిలో ఒక్కరు మాత్రమే గెలవగా 13 మంది ఓటమిపాలయ్యారు. తొమ్మిది మందికి చంద్రబాబు మొండి చేయి చూపించారు. మరి ఈ దఫా ఎన్నికల్లో వీరి టికెట్ల పరిస్థితి ఏంటి అన్న ప్రశ్న వస్తుంది. ఈ 23 మందిలో ఈ సారి టికెట్లు దక్కింది కేవలం ఏడుగురికే. మిగిలిన వారిలో ఉప్పులేటి కల్పన, చాంద్ బాషా, గిడ్డి ఈశ్వరి, వంతల రాజేశ్వరి వంటి కొంత మంది ఇప్పటికే రాజకీయంగా అడ్రస్ లేకుండా పోయారు. ఆదినారాయణ రెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నా గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఎస్వీ మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ గూటికి చేరినా... టికెట్ కోసం డిమాండ్ చేసే పరిస్థితి లేదు.

వీరే కాదు దాదాపు ఏడాది కిందట ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వైసీపీకి వెన్నుపోటు పొడిచి బాబు ఇచ్చిన ప్యాకేజీ అందుకున్న నలుగురు ఎమ్మెల్యేల్లో ఇద్దరు ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర రెడ్డి అదే వెన్నుపోటుకు బాధితులయ్యారు. ఇక చివరగా నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు ప్రలోభాలు, ప్రగల్భాలతో ఐదేళ్ళు కాలం గడిపి... ఇవాళ ఏ పార్టీ నుంచీ టికెట్ దక్కక ఏ రకంగా రాజకీయంగా భ్రష్టుపట్టిపోయారో చూస్తున్నాం. విలువల్లేని, వెన్నుపోటు రాజకీయాలు చేస్తే... కాలమే సమాధానం చెబుతుంది అనటానికి ఇవన్నీ నేర్చుకోవాల్సిన గుణ పాఠాలు.

– ఆర్ఎస్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కాలం చెల్లిన బాబు నమూనా

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

ఫ్రెంచ్ వనిత డా॥ డెలాల్ బెన్బాబాలి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సోషల్ జాగ్రఫీ - ఆంత్రోపాలజీ స్కాలర్. ఆమె - 'క్యాస్ట్ డామినెన్స్ అండ్ టెరిటరీ ఇన్ సౌత్ ఇండియా: అండర్‌స్టాండింగ్ కమ్మాస్ సోషియో-స్పేషియల్ మొబిలిటీ' అంశంపై పరిశోధన చేశారు. ఆమె తన పరిశోధనలో ప్రధానంగా దృష్టి పెట్టిన అంశం ఆసక్తికరమైనది. ఒక భూభాగంపై ఆధిపత్యం చలాయించే విషయంలో జనాధిక్యత ఉండే కులాలకూ, ఆధిపత్య కులాలకూ మధ్య ఉండే వ్యత్యాసాన్ని బహిర్గతం చేసే ప్రయత్నం చేశారామె. 'హైదరాబాద్ నగరంలో ఆంధ్ర కల్చర్ విస్తరించడంలో కొత్తగా వలస వచ్చినవారి పాత్ర,' 'సామాజిక ఊర్ధ్వ చలనానికి దోహదం చేస్తున్న వలసలు' వంటి మరో రెండు పరిశోధనా పత్రాలను కూడా గమనిస్తే వాటిల్లో 'కామన్'గా కనిపిస్తున్న అంశాలు మూడు ఉన్నాయి. అవి - భూమి, వలసలు, ఆధిపత్యం.

ఈ అంశాలను, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అన్వయించడం జరిగింది. ఆమె విదేశీ స్కాలర్ కనుక ఆమెకు ఇక్కడి రాజకీయాలు, కులాల విషయంలో ఇష్టాయిష్టాలకు ఆస్కారం లేదు. పైగా ఆమె పరిశోధనా వ్యాసాలు 2010కి ముందు కాలం నాటివి. కనుక ఆమె సూత్రీకరణలలోని నిజాయతీని అనుమానించడానికి ఆస్కారం కనిపించదు. అయితే, ఆమె తన మొత్తం పరిశోధనను - 'ఆధిపత్యం' వద్దకు తెచ్చి ఒక ముగింపు ఇవ్వడం, అందుకు ఆమె తీసుకున్న ఉదాహరణను ముందుగా మనం గుర్తించాలి.

ఆంధ్ర ప్రాంతం నుంచి వలసవచ్చిన చంద్రబాబు కులస్థులు హైదరాబాద్ నగరానికి పశ్చిమాన జూబ్లీ హిల్స్–కూకట్ పల్లికి మధ్య ఉన్న భూములను ఆవాసాలుగా చేసుకుని స్థిరపడ్డారు. దాంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఆ ప్రాంతంలో 'రియల్ ఎస్టేట్' వ్యాపారాన్ని ప్రోత్సహించి, దాన్ని 'సైబరాబాద్' అంటూ వారు ప్రయోజనం పొందే వ్యూహాన్ని అమలు చేశారు. అతని వ్యూహం మేరకు అది విజయవంతం అయినప్పటికీ, హైదరాబాద్ నగరమే కాకుండా తెలంగాణ జిల్లాల్లో కూడా స్థానికులు వీరి 'ఆధిపత్యాన్ని' ప్రశ్నించడంతో రాష్ట్ర విభజన జరిగింది. దాంతో ఏపీ సీఎంగా చంద్రబాబు మళ్ళీ అదే పాత 'సైబరాబాద్' వ్యూహాన్ని ఈసారి - 'రాజధాని అమరావతి' పేరుతో ఇక్కడ అమలుకు తెర



తీశారు.

బాబు దాని కోసం, భారత ప్రభుత్వం నియమించిన 'శివరామ కృష్ణన్ కమిటీ' నివేదికను సైతం పక్కనపెట్టి, అందుకు 'ఎన్డీయే'లో టీడీపీ భాగస్వామ్యాన్ని అడ్డంగా వాడుకున్నారు. అమరావతి భూమి పూజకు 2016లో వచ్చిన నరేంద్రమోదీ ఆ తర్వాత, బాబు ఏపీ తన సొంత జాగీరు అన్నట్టుగా, విదేశీ కంపెనీలతో నిర్మాణ ఒప్పందాలు, 'అమరావతి' భూముల్లో వాటాలు ఇచ్చినా, ఏనాడూ ఇక్కడ జరుగుతున్నది ఏమిటి? అని అడిగింది లేదు.

బాబు నిజంగా 'విజనరీ' అయితే, కొత్త రాష్ట్రం అభివృద్ధి కోసం మొదటి ఐదేళ్లలో పూర్తి చేయగలిగిన 'ప్లాన్' మాత్రమే అమలు చేయాలి. అదే జగన్ మోహన్ రెడ్డి విషయంలో చూడండి. అన్ని ఆర్థిక స్థాయుల్లోని వర్గాలకు 'సంక్షేమం' అందిస్తూనే, రెండున్నర ఏళ్ళ 'కరోనా' కాలాన్ని దాటి, తీరాంధ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టి 16 వేల కోట్ల రూపాయలతో 4 పోర్టులు, రూ. 3,793 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ లేండ్ సెంటర్లు నిర్మిస్తున్నారు. అలా శ్రీకాకుళం నుంచి చిత్తూరు సరిహద్దు వరకు సముద్ర తీరం వెంట సహజ ప్రకృతి వనరుల అభివృద్ధికి పెట్టుబడుల్ని వికేంద్రీకరించడం వల్ల; భవిష్యత్తులో 'భూమి' దాని సొంతదారు 'ఆధిపత్యం' వంటివి ఇక ముందు లేకపోగా, 'వలసలు' కూడా ఇకముందు తగ్గుతాయి.

డా॥ డెలాల్ బెన్బాబాలి తన పరిశోధనా వ్యాసాల్లో ప్రస్తావించిన - భూమి, వలసలు, ఆధిపత్యం అంశాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ తన తొలి టర్మ్‌లోనే 'అడ్రెస్' చేయడం ఇక్కడ ఆసక్తికరమైన అంశం. ఆమె పరిశోధనా వ్యాసాలు– కమ్మ కులం కేంద్రంగా ఉన్నప్పటికీ, రెడ్ల ప్రస్తావనను ఆమె వదిలిపెట్టలేదు. అయినా ఇక్కడ కులాలు ఏవి అనే ఆరా కంటే, 'ఎప్పుడు', 'ఎవరు' అనే దృష్టి మనకు ముఖ్యం. దేశం స్వతంత్రమై వందేళ్లకు చేరువ అవుతున్నప్పుడు, వనరుల పంపిణీ అన్ని ప్రాంతాలకూ, అన్ని సామాజిక వర్గాలకూ వారి వారి దామాషా మేరకు చేరే ప్రయత్నం మొదలయిందా లేదా అనేది ఇక్కడ కీలకం. తన మొదటి ఐదేళ్ల టర్మ్ లోనే 13 జిల్లాలను 26గా చేసి ప్రభుత్వాన్ని సూక్ష్మ స్థాయికి తీసుకువెళ్లడంలో జగన్ ప్రభుత్వం విజయవంతం అయింది. రాబోయే ఐదేళ్ల కాలంలో ఇప్పుడు జరుగుతున్న వనరుల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది. అనుమానం లేదు, అందువల్ల పేద వర్గాల జీవన ప్రమాణాలు మునుపటి కంటే చాలా బాగా మెరుగవుతాయి.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు
మొబైల్: 98481 28844

పరిశుద్ధుడు



యేసు క్రీస్తు ప్రభువు తన జీవిత కాలపు ముగింపు మూడున్నర సంవత్సరాలు నిత్యము ప్రజల మధ్యనే సంచరిస్తూ ప్రజల్లోనే ఉంటూ అంతటా జెండాను కాక అజెండాను మోసినట్టుగా ఆయన వైవిధ్య జీవన శైలిని మనం నిశితంగా పరిశీలించి చూస్తే గమనించగలుగుతాము. క్షేత్ర స్థాయిలో చేసిన తన సువార్త పాదయాత్రల పర్యటనలలో సామాన్యులను కలుస్తూ వారిని అలరిస్తూ సుంక రుల, పాపుల స్నేహితుడు అనిపించుకోడమే కాక ఎన్నో విమర్శలు సైతం ఎదుర్కొన్నాడు.

శాస్త్రులు, పరిసయ్యులు, సద్దూ కయ్యులు, యాజక పెద్దలు సృష్టించిన ఎన్నో ఆటంకాలు, అభ్యంతరాలు, ఆంక్షల నడుమ యేసు విజయ సూచకంగా జెరూషలేములో సాహసించి పర్యటించడం విశేషం. యావత్తూ మానవాళి పాప, శాపాలను భరిస్తూ శాపగ్రస్తుడిగా ఆ మ్రాను అనబడే చెక్క సిలువ మీద వ్రేలాడాడు. దేవుని సంకల్పానికి వీర విధేయుడైననూ, శరీరధారిగా ఉంటూ కూడా తన పరిశుద్ధ జీవితాన్ని విజయవంతంగా అంతటను ప్రదర్శించిన కారణం చేత దేవుడు ఆయనను మృతులలో నుండి లేపాడు. మృత్యుంజయునిగా లోకానికి కనబరిచాడు. ఆనాడే క్రీస్తు జైత్ర యాత్ర మొదలైంది. అది వివిధ రూపాలలో ఇప్పటికీ ఎప్పటికీ ఏనాడూ చెక్కుచెదరక కొసాగుతూనే ఉంటుంది. సూర్యుడు ఈ భూమిపై ఉన్నంత వరకు ఆయనదైన విజయాన్ని ఒక్క చర్చిలోనే కాక అంతటా చర్చించుకొనక తప్పని పరిస్థితిలో ఆయన విజయం ఉండుట బహు ఆశ్చర్యకరమే. చెయ్యెత్తి జై కొట్టే జైత్ర యాత్ర క్రీస్తు ప్రభువుది.

– జేతమ్

(రేపు ఈస్టర్ పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పంచమి సా.5.34 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** అనూరాధ రా.6.48 వరకు, **వర్జ్యం:** రా.12.31 నుండి 2.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.01 నుండి 7.35 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.56 నుండి 9.35 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** మ.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 6.08.

ఫ్యాకల్టీయే లైంగికంగా వేధిస్తే ఇంకెవరికి చెప్పను నాన్నా..

తండ్రి సెల్‌కు మెసేజ్ పెట్టి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని రూపశ్రీ


రూపశ్రీ కిందకు దూకిన హాస్టల్ భవనం ఇదే

మధురవాడ (భీమిలి): కాలేజీల్లో కామ పిశాచాల వేధింపులు తాళలేక కొంతమంది అమ్మాయిలు చదువులు మధ్యలోనే మానివేస్తుంటే.. మరికొందరు ఆత్మహత్యలే శరణ్యమని భావించి చిన్నతనంలోనే తనువులు చాలిస్తున్నారు. ఫ్యాకల్టీయే బరితెగించి లైంగికంగా వేధింపులు పాల్పడగా.. తట్టుకోలేకపోయిన ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన విశాఖలోని కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. ఇక్కడ డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్న రూపశ్రీ (16) లైంగిక వేధింపులకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్యాకల్టీ లైంగిక వేధింపులు తాళలేక పోతున్నానంటూ తండ్రికి మెసేజ్ పెట్టి గురువారం అర్ధరాత్రి 1.05 నిమిషాలకు ప్రాంతంలో హాస్టల్ భవనం 4వ ఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

విద్యా సంస్థ నిర్లక్ష్యమే కారణం

విద్యా సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తన కుమార్తె మృతి చెందిందని బాలిక తండ్రి గండికోట రమణ ఆవేదన వ్యక్తం చేశాడు. నర్సీపట్నం సమీపంలోని నాతవరం మండలం పద్మనాభపురానికి చెందిన రైతు కూలి గండికోట రమణ, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు పెళ్లయి అగనంపూడిలో ఉంటోంది. ఆఖరి కుమార్తె తల్లిదండ్రుల వద్దే ఉండి చదువుకుంటోంది. రెండో కుమార్తె రూపశ్రీ కొమ్మాది కాలేజీ హాస్టల్లో ఉండి చదువుతోంది. రూపశ్రీ కనిపించడం లేదని తండ్రికి కళాశాల సిబ్బంది ఫోన్ చేసిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి సీసీ కెమెరాలు పరిశీలించిన తర్వాత రూపశ్రీ అర్ధరాత్రి 12.48 గంటలకు 3వ ఫ్లోర్ నుంచి 4వ ఫ్లోర్‌కి వెళ్లి, 1.05కి 4 ఫ్లోర్ నుంచి కిందకి దూకిందని తెలిసింది. దూకే క్రమంలో చెట్టుకు తగిలి కిందకి పడి తీవ్రంగా గాయపడింది. రూపశ్రీని తరలించిన ఆస్పత్రికి అల్లుడు హరికృష్ణతో కలసి రమణ చేరుకునే లోపు రూపశ్రీ మృతి చెందింది.

తండ్రి సెల్‌కి పంపిన మెసేజ్ ఇలా..

హాయ్ అమ్మా, నాన్న, అక్కా, చెల్లి మరియు కుటుంబ సభ్యులకు.. మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నాను. నేను ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ఏమిటంటే ఈ కాలేజీలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి నాన్న. మరి ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనుకోవచ్చు కానీ ఆ ఫ్యాకల్టీలో ఒకరు అని అంటే ఇంకేం చెప్పగలం నాన్న. చాలా చెండాలంగా ప్రవర్తిస్తున్నాడు. ఫొటోలు కూడా తీసుకుని బెదిరిస్తున్నారు. స్టూడెంట్స్‌కి చెప్పాల్సిందిపోయి ఆ ఫ్యాకల్టీ ఇలా ప్రవర్తిస్తే ఇంకెవరికి చెప్పుకోవాలి నాన్న? నా ఫొటోలు కూడా తీసి బెదిరిస్తున్నారు నాన్న. ఇంకా నాకు ఒక్కదానికే కాదు ఇంకా కాలేజీలో చాలా మంది అమ్మాయిలు ఉన్నారు. ఎవరికి చెప్పుకోలేక. అలా అని కాలేజికి వెళ్లలేక మధ్యలో నలిగిపోతున్నాం నాన్న. పోలీసులకు ఫిర్యాదు చేస్తే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాం అని బెదిరించారు. నాకే వేరే దారి కనిపించలేదు. ఎవరో ఒకరు చస్తేనే కానీ ఈ విషయం బయట ప్రపంచానికి తెలియదు ఆ పని నేనే చేస్తున్నా. క్షమించండి నాన్నా.

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ కళాశాల

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజుకు చెందిన కళాశాల ఇది. ఇక్కడ యాజమాన్యం అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మృతురాలు తండ్రి, సగర సామాజిక వర్గ కుల పెద్దలు ఆరోపిస్తున్నారు. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పోక్సో, ర్యాగింగ్ కేసు నమోదు

మృతురాలు రూపశ్రీతో పాటు ఇంకా ఎంత మంది విద్యార్థులు వేధింపులకు గురయ్యారనే అంశంపై పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. నిందితులపై పోక్సో యాక్ట్, ఆత్మహత్యకు ప్రేరేపించడం, ర్యాగింగ్ తదితర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పీఎం పాలెం సీఐ రామకృష్ణ తెలిపారు. ఇక విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలపై తక్షణం నివేదిక అందజేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండి సీతారాం నగర పోలీసులను, సాంకేతిక విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం.. రక్షించిన పోలీసులు

- అర్ధరాత్రి ఫోన్‌కాల్‌కు స్పందించిన కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయూమ్ అస్మీ
- గంటల వ్యవధిలోనే క్షేమంగా కాపాడిన వీరవల్లి పోలీసులు
- ఏపీ పోలీసుల పనితీరుకు తెలంగాణ వాసి ప్రశంసలు


వృద్ధ దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చిరంజీవి

హనుమాన్‌జంక్షన్ రూరల్: కుటుంబ వివాదాల కారణంగా ఇంటి నుంచి ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధ దంపతులను కృష్ణాజిల్లా వీరవల్లి పోలీసులు కాపాడారు. పశ్చిమ గోదావరిజిల్లా నరసాపురానికి చెందిన వృద్ధ దంపతులు గురువారం అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయారన్న సమాచారం తెలుసుకున్న తెలంగాణలోని నిజామాబాద్‌లో నివసిస్తున్న కుమారుడు ఆందోళన చెందాడు. క్షణికావేశంలో వారు ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడతారోనని భయపడ్డాడు. ఆ అర్ధరాత్రి సమయంలోనే కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయూమ్ అస్మీకి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. వృద్ధ దంపతుల ఆచూకీని కనిపెట్టి, వారిని తీసుకొచ్చే బాధ్యతను స్పెషల్ బ్రాంచ్ సీఐ జేవీ రమణ, వీరవల్లి ఎస్ఐ ఎం.చిరంజీవిలకు ఎస్పీ అప్పగించారు. ఎస్ఐ చిరంజీవి రంగంలోకి దిగి గాలింపు చేపట్టారు. కృష్ణా నదిలోకి దూకబోతున్న వీరిని నిలువరించి, వారికి నచ్చజెప్పి వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. కుటుంబ, అనారోగ్య సమస్యల వల్ల ఎవ్వరికీ భారం కాకూడదన్న ఉద్దేశంతోనే ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనతో ఇంటి నుంచి బయటికి వెళ్లినట్టు ఎస్ఐకి వారు వివరించారు. వృద్ధ దంపతులను క్షేమంగా కాపాడి, ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, మాజీ సైనికుడు అయిన ఆ వృద్ధ దంపతుల కుమారుడు ఏపీ పోలీసుల పనితీరుకు ముగ్ధుడయ్యారు. వెంటనే స్పందించిన కృష్ణా జిల్లా ఎస్పీ, వీరవల్లి ఎస్ఐ చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


తిరుమల ఆలయం వెలుపల జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్


జస్టిస్ రాజేష్ రాయ్‌కు వినాయక చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

తిరుమల/కాణిపాకం: తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, తెలంగాణ ఎమ్మెల్యేలు వినోద్, కాచుకుల్ల రాజేష్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్ రావు, సినీ నటుడు రాజేంద్రప్రసాద్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. అలాగే, కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్‌రాయ్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనభాగ్యం కల్పించారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ మల్లికార్జునరావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందచేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబానికి ఆలయ ఈవో రామారావు స్వాగతం పలికారు. దుర్గమ్మ పంచ హారతుల సేవలో పాల్గొన్న అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయ ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మహిళపై టీడీపీ నేత దాడి సిగ్గుచేటు

ఏలూరులో బాధిత మహిళ అచ్యుతకుమారిని పరామర్శించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ఏలూరు టౌన్: స్థానిక కండ్రికగూడెం రాజరాజేశ్వరినగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ కార్యదర్శి అచ్యుతకుమారిపై టీడీపీ నేత రెడ్డి నాగరాజు అత్యంత పాశవికంగా దాడిచేయడం సిగ్గుచేటని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. ఆమె శుక్రవారం ఏలూరులో అచ్యుతకుమారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. బాధితురాలు తన శరీరంపై ఉన్న గాయాలను చూపించి కన్నీటి పర్యంతమయ్యారు. తాను చెప్పుకోలేనిచోట తీవ్ర స్థాయిలో పిడిగుద్దులు గుద్దారని, చంపేందుకు ప్రయత్నించారని ఆవేదన వ్యక్తంచేశారు. 'మీరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. మీకు న్యాయం జరిగే వరకూ మహిళా కమిషన్ అండగా ఉంటుంది' అని కమిషన్ చైర్‌పర్సన్ భరోసా కల్పించారు. బాధితురాలి ఇంటి నుంచే ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతికి ఫోన్ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం వెంకటలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ 61 ఏళ్ల మహిళ అనే ఆలోచన లేకుండా హేయమైన రీతిలో దాడి చేశారని, మర్మాంగాలపైనా మోకాళ్లతో గాయపరచడం వారి నీచ సంస్కృతికి అద్దం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు నియోజకవర్గ నుంచి టీడీపీ తరఫున పోటీ చేస్తున్న నాయకుడు సైతం బాధితురాలికి ఫోన్ చేసి రాజీపడాలని బెదిరింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. బాధితురాలు అచ్యుతకుమారి మాట్లాడుతూ తనను హతమార్చేందుకు టీడీపీ నేత రెడ్డి నాగరాజు ప్రయత్నించాడని, తన కుటుంబానికి రక్షణ కావాలని కోరారు. ఈ ఐదేళ్ల ఏలూరు నియోజకవర్గంలో ఎలాంటి గొడవలు, దాడులు, హత్యలు జరగలేదని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్


సూర్యప్రభ వాహనంపై స్వామికి జరిగిన తిరువీధిలో పాల్గొన్న జస్టిస్ వి.శ్రీనివాస్

సింహాచలం(విశాఖ జిల్లా): శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను, ప్రసాదాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు. అలాగే సుదర్శన నారసింహ మహా యజ్ఞం నిర్వహణలో భాగంగా స్వామికి సూర్యప్రభ వాహనంపై నిర్వహించిన తిరువీధిలోనూ జస్టిస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సరుకు రవాణాలో వాల్తేర్ డివిజన్ రికార్డు

తాటిచెట్లపాలెం (విశాఖ జిల్లా): సరుకు రవాణాలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ సరికొత్త రికార్డు సృష్టించింది. దీని ద్వారా గత రికార్డులను వాల్తేర్ డివిజన్ అధిగమించింది. గత ఏడాదిలో 69.6మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయగా, ఈ సంవత్సరం మార్చి 26వ తేదీకే (31కు ముందే) 75.64 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి రికార్డు సృష్టించిందని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్, అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ ఫలితాలు వాల్తేర్ డివిజన్ బృందానికి మైలురాయిగా నిలుస్తాయని, సమన్వయం, ప్రణాళిక బద్ధమైన పనితీరు, వినియోగదారుల సహాయంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు

గుణదల (విజయవాడ తూర్పు): గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విజయవాడలోని గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరిగిన శిలువ యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆంధ్ర లయోల ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ డి.బాలస్వామి భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ.. మానవుల రక్షణకోసం ఆయన మానవ రూపిగా అరుదెంచారన్నారు. శిలువపై ఆయన చిందించిన రక్తం ద్వారానే మానవులకు పాప క్షమాపణతో పాటు నిత్యజీవం లభించిందని, అందుకే గుడ్ ఫ్రైడేను శుభ శుక్రవారంగా చెబుతారని వివరించారు. పుణ్యక్షేత్ర గురువులు ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ కిరణ్, ఫాదర్ సురేష్ పాల్గొన్నారు.

ప్రధానాలయంలో..

గుడ్ ఫ్రైడే సందర్భంగా పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఉదయం నుంచీ సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ భక్తులకు శిలువ మరణం యొక్క ప్రాధాన్యతను తెలియచేస్తూ దైవ సందేశాన్ని అందించారు.

ఈసీ 'మెనూ కార్డు'

ఒకే ఐటం.. ప్రాంతానికో రేటు • అభ్యర్థులకు రేట్లు నిర్ధారించిన ఈసీ • ఒక్క సమోసా...రూ.7 నుంచి 15
కిలో మటన్ కేవలం రూ.500 • కిలో చికెన్ మాత్రం రూ.250



కొసమెరుపు: ఎన్నికల వేళ కార్యకర్తలకు పార్టీలు, అభ్యర్థులు మద్యం అందుబాటులో ఉంచడం బహిరంగ రహస్యమే. కానీ ఈసీ మెనూలో మద్యానికి మాత్రం చోటులేకపోవడం విశేషం.

చాయ్‌కి పంజాబ్‌లోని జలంధర్‌లో రూ.15. అదే మధ్యప్రదేశ్‌లోని మాండ్లాలో అయితే రూ.7. సమోసా కూడా పంజాబ్‌లో రూ.15 అయితే మధ్యప్రదేశ్‌లో రూ.7.5. ఏమిటీ ధరలంటారా? లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిర్ధారించిన ధరలివి. వీటిని జిల్లా ఎన్నికల విభాగాలు స్థానికంగా నిర్ధారిస్తుంటాయి. దాంతో అవి ఒక్కో ప్రాంతానికి ఒక్కోలా ఉంటాయి. అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై గరిష్ఠ పరిమితి ఉందన్నది తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి ఈసీ నిర్ధారించిన పరిమితి రూ.95 లక్షలు. అరుణాచల్, గోవా, సిక్కిం రాష్ట్రాల్లో మాత్రం రూ.75 లక్షలు. కేంద్రపాలిత ప్రాంతాల్లో రూ.75–95 లక్షల మధ్య ఉంది. నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఫలితాలు వెల్లడించే తేదీ దాకా అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయం ఈ పరిమితిని దాటకుండా ఈసీ డేగ కళ్లతో గమనిస్తూ ఉంటుంది. ఇందుకోసం బ్యానర్లు, ఫ్లెక్సీలు, సభా వేదికలు మొదలుకుని కార్యకర్తలు, అభిమానులకు ఆహారం దాకా ప్రతిదానికీ రేటును ఫిక్స్ చేస్తుంది. అయితే వాటికీ, వాస్తవ ధరలకూ చాలాసార్లు పొంతనే ఉండదు. దాంతో ఈసీ 'మెనూ కార్డు'పై మీడియాలో, సోషల్ మీడియాలో జోకులు పేలుతుండటం పరిపాటి. మరోవైపు, ఎన్నికల వ్యయంపై అభ్యర్థులకు పరిమితి ఉన్నా పార్టీలు చేసే ఖర్చుకు మాత్రం అలాంటిదేమీ లేకపోవడం విశేషం!

చాయ్ రూ.5 నుంచి 15 దాకా...

చాయ్ ధరను దేశవ్యాప్తంగా ప్రాంతాన్ని బట్టి రూ.5 నుంచి రూ.15 దాకా ఈసీ నిర్ధారించింది. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో కప్పు చాయ్ రూ.5, సమోసా రూ.10. ఇడ్లీ, సాంబార్ వడా, పోహా–జిలేబీ ప్లేటు రూ.20. దోసా, ఉప్మా మాత్రం ప్లేటు రూ.30. మణిపూర్‌లో జాతుల హింసకు కేంద్రాల్లో ఒకటైన తౌబల్ జిల్లాలో చాయ్, సమోసా, కచోరీ, ఖజూర్, గాజా ఒక్కోటీ రూ.10. రాష్ట్రంలోని తెంగ్నౌపాల్ జిల్లాలో బ్లాక్ టీ రూ.5, సాదా టీ రూ.10. మణిపూర్‌లో బాతు మాంసం రూ.300. పంది మాంసం రూ.400. ఇక్కడి ఈసీ మెనూలో చికెన్‌తో పాటు చేపలు కూడా ఉన్నాయి. జలంధర్‌లో ప్లేటు చోలే భటూరేకు ఈసీ నిర్ధారించిన ధర రూ.40. కిలో చికెన్‌కు రూ.250, మటన్‌కు రూ.500. మిఠాయిల్లో ఢోడా రూ.450, ఫీ పిన్నీ రూ.300. గ్లాసు లస్సీ రూ.20, నిమ్మరసం రూ.15.

చెన్నైలో తగ్గిన చికెన్ బిర్యానీ రేటు

చెన్నైలో 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే చాయ్ ధరను రూ.10 నుంచి రూ.15కు ఈసీ పెంచింది. కాఫీ కూడా రూ.15 నుంచి రూ.20కి పెరిగింది. కానీ చికెన్ బిర్యానీ ధరను మాత్రం రూ.180 నుంచి రూ.150కి తగ్గించడం విశేషం! ఢిల్లీ శివార్లలో నోయిడా పరిధిలోని గౌతంబుద్ధ నగర్‌లో వెజ్ భోజనం రూ.100. సమోసా, చాయ్ రూ.10. కచోరీ రూ.15, శాండ్‌విచ్ రూ.25, జిలేబీ కిలో రూ.90. ఉత్తర గోవాలో బటాటా (ఆలూ) వడ, సమోసా రూ.15. చాయ్ రూ.15, కాఫీ రూ.20. హరియాణాలోని జింద్‌లో దాల్ మఖానీ, మిక్స్‌డ్ వెజ్ కర్రీ రూ.130. మటర్ పనీర్ రూ.160. ఇక్కడ ఈసీ మెనూలో బటర్ నాన్, మిస్సీ రోటీ, ప్లెయిన్ రోటీలతో పాటు కాజూ కట్లీ, గులాబ్‌జామ్ వంటివి కూడా ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

వీటికీ రేట్లు ఫిక్స్...

• ఖరీదైన హెలీప్యాడ్లు, లగ్జరీ వాహనాలు, ఫామ్‌హౌజ్‌లతో పాటు పూలు, కూలర్లు, టవర్ ఏసీలు, సోఫాల వంటివాటికి కూడా ఈసీ రేట్లు నిర్ధారించింది.
• సభలు, సమావేశాలకు జనాన్ని తరలించేందుకు బస్సులు మొదలుకుని టాటా సఫారీ, స్కార్పియో, హోండా సిటీ, సియాజ్... ఇలా బ్రాండ్లవారీగా కూడా ఒక్కో వాహనానికి ఒక్కో రేటు నిర్ణయించింది.
• దండల్లో కూడా గులాబీ, బంతి... ఇలా పూలను బట్టి రేట్లు నిర్ణయమయ్యాయి. పార్టీల జెండాలు, టోపీలకూ అంతే.
• సభలు, సమావేశాలకు వేదికలు, నేతలకు బస తదితరాలతో పాటు ప్రకటనలు, హోర్డింగులు, కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రికి కూడా ఇంత అని ఈసీ ముందే రేట్లు ఫిక్స్ చేసి పెట్టింది.

ఎలక్షన్ బీట్

'విజిల్' ఊదేస్తున్నారు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక సమరం వేళ ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన 'సీ విజిల్' యాప్‌ను ప్రజలు సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి శుక్రవారం ఉదయం వరకు ప్రజల నుంచి 79,000కు పైగా ఫిర్యాదులు అందాయి. ఇందులో 99 శాతానికిపైగా ఫిర్యాదులు పరిష్కరించామని కేంద్ర ఎన్నికల తెలిపింది. వీటిలో 89 శాతం ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించినట్లు ఈసీ పేర్కొంది. 58,500 కంటే ఎక్కువ ఫిర్యాదులు (73శాతం) అక్రమ హోర్డింగ్‌లు, బ్యానర్‌లకు సంబంధించినవి కాగా.. 1400కు పైగా ఫిర్యాదులు నగదు, బహుమతులు, మద్యం పంపిణీకి సంబంధించినవి ఉన్నాయి.

పథకాలను ఓటర్లకు చేర్చండి: మోదీ

చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం తమిళనాడుకు చెందిన బీజేపీ కార్యకర్తలతో నమో యాప్ ద్వారా భేటీ అయ్యారు. 'ఎనతు బూత్ వలిమయ్యాన బూత్ (నా బూత్ అత్యంత శక్తిమంతమైనది)' కార్యక్రమంలో పాల్గొని లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బూత్ స్థాయి సన్నద్ధతపై వారితో చర్చించారు. ''రాష్ట్రంలో ఘనవిజయమే మన లక్ష్యం కావాలి. బీజేపీ, ఎన్డీఏ అభ్యర్థుల ఘనవిజయానికి వ్యూహాలు రూపొందించండి'' అంటూ కార్యకర్తలను ప్రోత్సహించారు. ''తమిళనాట ప్రచారానికి 15 రోజులే మిగిలింది. కనుక ఓటర్లతో నిత్యం అనుసంధానమై ఉండండి. మన పథకాలను, ప్రభుత్వం సాధించిన ఘనతలను వారికి వివరించండి'' అంటూ దిశానిర్దేశం చేశారు. బీజేపీలో తన తొలినాళ్ల అనుభవాలను మోదీ వారితో పంచుకున్నారు.

ఆర్జేడీకి 26.. కాంగ్రెస్‌కు 9

బిహార్‌లో మహాఘట్‌బంధన్ సీట్ల సర్దుబాటు

పట్నా: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గాను బిహార్‌లో ఆర్జేడీ సారథ్యంలోని మహాఘట్‌బంధన్‌లో సీట్ల పంపిణీ కొలిక్కి వచ్చింది. రాష్ట్రంలోని మొత్తం 40 స్థానాలకు గాను దాదాపు మూడింట రెండొంతుల సీట్లలో లాలూ ప్రసాద్‌కు చెందిన ఆర్జేడీ పోటీ చేయనుంది. మిగతా వాటిని కాంగ్రెస్, మూడు వామపక్ష పార్టీలు పంచుకున్నాయి. 2019 ఎన్నికల్లో ఆర్జేడీ ఒక్క సీటూ దక్కించుకోలేకపోయినప్పటికీ ఈసారి 26 చోట్ల పోటీ చేయనుంది. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారీ 9 చోట్ల పోటీ చేయనుంది. ఆ తర్వాత సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మూడు, సీపీఐ, సీపీఎంలు చెరో చోట బరిలోకి దిగనున్నాయి. బిహార్‌లో ఆర్జేడీ ఇప్పటికే నాలుగు చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఒక సీటును కాంగ్రెస్ ఆశిస్తోంది. కాంగ్రెస్ పోటీ చేయాలని ఆశిస్తున్న పుర్నియా స్థానానికి లాలూ ప్రసాద్ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించేశారు. సీపీఐ, సీపీఐ(ఎంఎల్) కూడా బెగుసరాయ్, ఖరారియా సీట్లకు అభ్యర్థులను ప్రకటించుకున్నాయి.

మండిలో కంగన రోడ్ షో

సిమ్లా: బాలీవుడ్ నటి, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కంగనా రనౌత్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తాను తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్న హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో శుక్రవారం రోడ్ షో చేశారు. కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేత్ ఇటీవల తనపై చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా తీవ్రంగా దుయ్యబట్టారు. ''మీ అక్కాచెల్లెళ్లకు, కూతుళ్లకు వెల కట్టేవాళ్లు ఎప్పటికీ మీవాళ్లు కాలేరు. ఇక్కడ తపస్సు చేసిన మాండవ రుషి నుంచి ఈ పట్టణానికి మండి అని పేరొచ్చింది. అలాంటి పేరును కూడా కించపరుస్తున్నారు' అని రోడ్‌షోకు పోటెత్తిన జనాన్ని ఉద్దేశించి అన్నారు. 'మండిలో ఇప్పుడు ఏ రేటు పలుకుతోంది' అని కంగనాపై సుప్రియ ఇన్‌స్టాగ్రాంలో పెట్టిన పోస్టు దుమారం రేపడం తెలిసిందే.

రూ.1,823 కోట్లు చెల్లించండి

• కాంగ్రెస్ పార్టీకి ఐటీ నోటీసులు
• బీజేపీ నుంచి రూ.4,617 కోట్లు వసూలు చేయాలన్న కాంగ్రెస్
• ఐటీ విభాగం బీజేపీ జేబు సంస్థగా మారిందంటూ నిప్పులు

న్యూఢిల్లీ: రూ.1,823.08 కోట్లు చెల్లించాలంటూ ఆదాయపు పన్ను విభాగం నుంచి తాజాగా తమ పార్టీకి నోటీసులు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరాం రమేశ్, అజయ్ మాకెన్ చెప్పారు. ఐటీ చట్టాలను అధికార బీజేపీ విచ్చలవిడిగా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఈ ఉల్లంఘనలకు గాను బీజేపీ నుంచి రూ.4,617.58 కోట్లు వసూలు చేయాలని ఐటీ అధికారులను డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ పన్ను ఉగ్రవాదానికి పాల్పడుతోందని, లోక్‌సభ ఎన్నికల ముందు ప్రతిపక్షాలను ఆర్థికంగా దెబ్బతీసే కుట్రలు సాగిస్తోందని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలు తమకు విరాళాలు ఇచ్చినవారి పేర్లు, చిరునామాలను ఫామ్ 24ఏలో పొందుపర్చి, ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుందని అజయ్ మాకెన్ చెప్పారు. బీజేపీ మాత్రం ఇలాంటి వివరాలను ఏనాడూ సక్రమంగా సమర్పించలేదని విమర్శించారు. ఐటీ విభాగం బీజేపీ జేబు సంస్థగా మారిందని ఆక్షేపించారు. కేవలం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని నోటీసులు ఇస్తోందని అన్నారు. ఇది ముమ్మాటికీ చట్టవిరుద్ధం, అప్రజాస్వామికం అని తేల్చిచెప్పారు. పాత ఐటీ రిటర్నులను మళ్లీ తెరవడం ఏమిటని ప్రశ్నించారు.

ఇది రాహుల్ గ్యారంటీ

ఐటీ డిపార్టుమెంట్ ఇచ్చిన తాజా నోటీసులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ పన్ను ఉగ్రవాదానికి పాల్పడుతున్న బీజేపీకి బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్య వలువలు ఊడదీస్తున్నవారికి ప్రభుత్వం మారిన తర్వాత తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తాము తీసుకొనే చర్యలు ఎలా ఉంటాయంటే.. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి పనులు చేయకుండా భయపడేలా ఉంటాయని, ఇది రాహుల్ గ్యారంటీ అని తేల్చిచెప్పారు.

సీపీఐ, సీపీఎంలకు ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలకు ఆదాయపు పన్ను నోటీసుల పరంపరం కొనసాగుతోంది. రూ.11 కోట్లు చెల్లించాలంటూ సీపీఐకి ఐటీ డిపార్టుమెంట్ నోటీసు జారీ చేసినట్లు అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. గత కొన్నేళ్లలో దాఖలు చేసిన ఐటీ రిటర్నుల్లో పాత పాన్ కార్డును ఉపయోగించినందుకు ఫెనాల్టీలు, వడ్డీ కింద రూ.11 కోట్లు చెల్లించాలంటూ ఈ నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. ఈ నోటీసులను న్యాయస్థానంలో సవాలు చేయడానికి సీపీఐ నేతలు న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్లు తెలిసింది. అలాగే సీపీఎంకు కూడా ఐటీ నోటీసులు అందాయి. 2016–17లో ఇచ్చిన పన్ను మినహాయింపును ఉపసంహరించుకుంటూ ఐటీ విభాగం తాజాగా సీపీఎంకు నోటీసులు ఇచ్చింది. అప్పట్లో ఐటీ రిటర్నుల్లో బ్యాంకు ఖాతాను నిర్ధారించనందుకు రూ.15.59 కోట్లు చెల్లించాలని ఆదేశించింది.

స్లో పాయిజన్‌తో ప్రాణం తీశారు

గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ మరణంపై కుటుంబీకుల ఆరోపణలు

లక్నో: ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌స్టర్, రాజకీయనేత ముఖ్తార్ అన్సారీది సహజ మరణం కాదని, స్లో పాయిజన్‌తో ఆయనను అంతంచేశారని ఆయన కుమారుడు, సోదరులు తీవ్ర ఆరోపణలు చేశారు. మౌ సదర్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన 63 ఏళ్ల ముఖ్తార్ బందా జిల్లా జైలులో ఉండగా వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లగా రాణి దుర్గావతి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేస్తుండగా గుండెపోటుతో చనిపోయారని వైద్యకళాశాల ప్రిన్సిపల్ సునీల్ కౌశల్ చెప్పారు. ''తనకు స్లో పాయిజన్ ఇస్తున్నట్లు అనిపిస్తోందని మా నాన్న మాతో గతంలోనే చెప్పారు. ఇప్పుడు యావత్‌దేశానికీ ఇప్పుడీ విషయం తెల్సింది' అని ఆయన కుమారుడు ఉమర్ అన్సారీ ఆరోపించారు. ''ఇదే విషయాన్ని ముఖ్తార్ గతంలోనే బారాబంకీ కోర్టులో ఫిర్యాదుచేశారు' అని ముఖ్తార్ సోదరుడు సిబ్గతుల్లా అన్సారీ అన్నారు. అంతకుముందు మంగళవారం కడుపునొప్పి కారణంగా అన్సారీని జైలు నుంచి ఆస్పత్రికి తరలించి దాదాపు 14 గంటలపాటు ఆస్పత్రిలోనే ఉంచి తర్వాత జైలుకు తరలించారు. 'జైలు ఆహారంలో ఆయనకు స్లో పాయిజన్ కలిపి ఇచ్చారు. ఇలా జరగడం ఇది రెండోసారి. గతంలో 40 రోజుల క్రితం కూడా ఇదే తరహా ప్రయత్నం జరిగింది. అందుకే ఇప్పుడు ఆయన ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి చనిపోయారు' అని ముఖ్తార్ మరో సోదరుడైన ఘజియాపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఆరోపించారు. జైల్లో విషప్రయోగం జరిగిందన్న ఆరోపణలను బందా జిల్లా జైలు సీరియస్‌గా తీసుకుంది. దీనిపై విచారణకు ఆదేశించింది. అయితే అన్సారీ గుండెపోటుతోనే చనిపోయినట్టు పోస్టుమార్టం అనంతరం వైద్యులు ప్రకటించారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఘాజీపూర్ జిల్లా మొహమ్మదాబాద్ యూసుఫ్‌పూర్‌కు తరలించారు. శనివారం ఉదయం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తనకు అనుమతివ్వాలంటూ కస్గంజ్ జైలులో ఉన్న ముఖ్తార్ మరో కుమారుడు, మవూ ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీ శుక్రవారం సుప్రీంకోర్టు తలుపుతట్టారు.

డిజిటల్ టెక్నాలజీకి పెద్దపీట

• మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో 'చాయ్ పే చర్చ'
• కృత్రిమ మేధ దుర్వినియోగమయ్యే ప్రమాదం పొంచి ఉంది
• డిజిటల్ విప్లవానికి ప్రజలే సారథులు కావాలన్న మోదీ

న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై తనకెంతో ఆసక్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. టెక్నాలజీలో తాను నిపుణుడిని కాకపోయినా దానిపై చిన్నపిల్లలకు ఉండే ఉత్సుకత తనకు కూడా ఉందని తెలిపారు. అదేసమయంలో టెక్నాలజీకి తాను బానిస కాలేదని వివరించారు. ప్రధాని మోదీ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో శుక్రవారం 'చాయ్ పే చర్చ' నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు విద్య, వైద్యం, వ్యవసాయం, వాతావరణ మార్పులు, మహిళా సాధికారత, కృత్రిమ మేధ వంటి కీలక అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఆయా రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని బిల్‌గేట్స్‌కు తెలియజేశారు. ఇండియాలో వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో నూతన సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. బిల్‌గేట్స్‌తో మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

కృత్రిమ మేధ.. మంత్రదండం కాదు

''నేడు డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల అవసరం చాలా ఉంది. డిజిటల్ టెక్నాలజీపై ప్రజలకు అవగాహన పెంచాలి. కృత్రిమ మేధ(ఏఐ) వంటి శక్తివంతమైన సాంకేతికత దుర్వినియోగమయ్యే ప్రమాదం పొంచి ఉంది. నైపుణ్యం లేని వ్యక్తుల చేతుల్లో ఇలాంటి టెక్నాలజీ పడితే దుష్పరిణామాలు తప్పవు. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి. నియమ నిబంధనలు అమలు చేయాలి. ఏఐతో సృష్టించే కంటెంట్‌లో వాటర్‌మార్క్‌ను జోడించాలి. ఏఐతో సృష్టించే డీప్‌ఫేక్‌ల విషయంలో అప్రమత్తత అవసరం. ఏఐని అన్నీ సాధించిపెట్టే మంత్రదండంగా చూడొద్దు. అంటే కృత్రి మేధ విలువను తగ్గించడం నా ఉద్దేశం కాదు. గత ఏడాది జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ఏఐని నేను ఉపయోగించుకున్నా. పలు కార్యక్రమాల్లో నా ప్రసంగాలను వేర్వేరు భాషల్లో ప్రసారం చేయడానికి ఈ టెక్నాలజీ తోడ్పడింది.

భూగోళాన్ని కాపాడుకోవాలి

వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా పెను సవాళ్లు విసురుతున్నాయి. భూగోళాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. విద్యుత్ లేదా ఉక్కు వినియోగాన్ని అభివృద్ధికి కొలమానంగా చూపుతున్నారు. ఈ ధోరణి కచ్చితంగా మారాలి. విద్యుత్, ఉక్కు విచ్చలవిడి ఉత్పత్తి వల్ల పర్యావరణానికి చేటు తప్పదన్న సంగతి మర్చిపోవద్దు. ఇకపై గ్రీన్ జీడీపీ, గ్రీన్ ఎంప్లాయ్‌మెంట్ వంటి పరిభాషను ఉపయోగించాలి. వస్తువుల పునఃశుద్ధి, పునర్వినియోగం ఇండియాలో చాలా సహజం. ఇప్పుడు నేను ధరించిన జాకెట్ రీసైకిల్ చేసిన ఉత్పత్తే. టెక్నాలజీ అంటే కేవలం సేవలను విస్తరించడానికే కాదు, సామాన్య ప్రజల జీవితాలను మరింత సులభతరం చేయాలని నేను నమ్ముతున్నా.

తృణధాన్యాల సాగుకు ప్రాధాన్యం

గత ఏడాది ఇండియాలో జీ20 సదస్సు నిర్వహించిన తర్వాత వాతావరణ మార్పులపై యుద్ధంలో వేగం పెరిగింది. వాతావరణ మార్పులను ఎదుర్కోవాలంటే మన జీవనశైలిని పర్యావరణ హితంగా మార్చుకోవాలి. ప్రకృతి, పర్యావరణహితమైన నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. విద్యుత్‌ను వృథా చేస్తే, నీటిని విచ్చలవిడిగా ఉపయోగిస్తే అనుకున్న లక్ష్యం సాధించలేం. తక్కువ నీరు అవసరమయ్యే తృణధాన్యాల సాగును పెంచడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. తృణధాన్యాల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పెద్ద ముప్పుగా మారింది. త్వరలో కొలువుదీరే మా నూతన ప్రభుత్వ హయాంలో మహిళలకు.. ముఖ్యంగా బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తాం.

సాంకేతిక ప్రజాస్వామీకరణ

పునరుద్పాతక ఇంధన రంగంలో మేము శరవేగంగా దూసుకెళ్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ తయారీలో మరింత అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నాం. 'సాంకేతిక ప్రజాస్వామీకరణ' మా విధానం. డిజిటల్ విప్లవంలో గుత్తాధిపత్యానికి అడ్డుకట్ట వేశాం. ఈ రంగంలో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నాం. డిజిటల్ విప్లవానికి సామాన్య ప్రజలే నాయకత్వం వహించాలన్నది మా ఆకాంక్ష. ఆ దిశగా 'డ్రోన్ దీదీ' పథకాన్ని ప్రవేశపెట్టాం.



శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో బిల్ గేట్స్‌తో ప్రధాని మోదీ

నమో యాప్‌లో సెల్ఫీ

టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఇండియా చూపుతున్న చొరవను, వేగాన్ని బిల్‌గేట్స్ ప్రశంసించారు. ఈ విషయంలో ఇతర దేశాలకు మార్గదర్శిగా మారిందని కొనియాడారు. కృత్రిమ మేధను తాను ఉపయోగించుకుంటున్న తీరును గేట్స్‌కు మోదీ తెలియజేశారు. తన సెల్‌ఫోన్‌ను గేట్స్‌కు ఇచ్చి, అందులోని 'నమో' యాప్ ద్వారా సెల్ఫీ తీయాలని కోరారు. అందులోని టెక్నాలజీతో పాత ఫొటోలూ కనిపిస్తాయని అన్నారు. గతంలో తామిద్దరం దిగిన ఫొటోలను గేట్స్‌కు చూపించారు.

నా భర్తను దీవించండి

'కేజ్రీవాల్‌కు దీవెనలు' కార్యక్రమం ప్రారంభించిన భార్య సునీత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అక్రమాల కేసులో అరెస్టయి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు నైతిక మద్దతు ప్రకటించాలని ఆయన భార్య సునీత విజ్ఞప్తిచేశారు. నిరంకుశ ప్రభుత్వంపై పోరాడుతున్న ఆయన విజయం సాధించేలా ఆయన కోసం ప్రార్థనలు చేయాలని, ఆయనను దీవించాలని ఆమె కోరారు. మీ ఆశీర్వాదాలు, ప్రార్థనలు, సలహాలు, సూచలను 8297324624, 9700297002 వాట్సాప్ నంబర్లకు పంపించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ' కేజ్రీవాల్‌కి ఆశీర్వాదాలు' పేరిట ఒక కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ డిజిటల్‌మీడియా వేదికగా పౌరులనుద్దేశిస్తూ శుక్రవారం ప్రసంగించారు.

కేజ్రీవాల్ అరెస్టుపై ఐరాస స్పందన

ఐరాస: భారత్‌లో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా జరగుతుందని ఆశిస్తున్నట్టు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అధికార ప్రతినిధి స్టెఫానే దుజరిక్ అన్నారు. మీడియా భేటీ సందర్భంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాల స్తంభనపై ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు స్పందించారు. భారత్‌లోనే గాక ఎన్నికలు జరిగే ప్రతి దేశంలోనూ ప్రజల రాజకీయ, పౌర హక్కులకు భద్రత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేసే పరిస్థితి ఉండాలని అభిప్రాయపడ్డారు. కేజ్రీవాల్ అరెస్టు తదితరాలపై తొలుత జర్మనీ, తర్వాత అమెరికా కూడా ఇలాగే స్పందించి భారత్ ఆగ్రహాన్ని చవిచూడటం తెలిసిందే. వాటిపై అమెరికా రాయబార కార్యాలయంలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ గ్లోరియా బార్బెనాకు విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. ఆమెను విదేశాంగ శాఖ కార్యాలయానికి పిలిపించి తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చింది. ఆ తర్వాత కూడా కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా మరోసారి స్పందించింది. న్యాయ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగలన్నదే తమ వైఖరి అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వ్యాఖ్యలు చేశారు. తమ స్పందనలో తప్పేమీ లేదంటూ సమర్థించుకున్నారు. దీనిపై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది.

లోయలో పడ్డ తవేరా..10 మంది మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది మృత్యువాతపడ్డారు. జమ్మూ–శ్రీనగర్ హైవేపై రంబన్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి దాటాక ఘటన చోటుచేసుకుంది. తవేరా ట్యాక్సీ అదుపుతప్పి 300 అడుగుల లోయలో పడిపోయింది. డ్రైవర్‌తో పాటు అందరూ చనిపోయారు. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బస్సు లోయలో పడి 45 మంది మృతి

దక్షిణాఫ్రికాలో ఘోర ప్రమాదం..



కేప్ టౌన్: ఈస్టర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న వారిని బస్సు ప్రమాదం కబళించింది. దక్షిణాఫ్రికాలోని లింపోపో ప్రావిన్స్‌లో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోగా ఒక్క చిన్నారి గాయాలతో సజీవంగా బయటపడింది. బోట్స్‌వానాకు చెందిన వీరంతా దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ఈస్టర్ ఉత్సవాలకు వెళ్తున్నారు. అదుపు తప్పిన బస్సు కొండప్రాంతంలోని ఎంమట్లకలా వద్ద వంతెన బారియర్లను ఢీకొట్టింది. ఆ పక్కనే ఉన్న 164 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ముక్కలైన బస్సులో భారీగా మంటలు చెలరేగి కొందరు సజీవ దహనం కాగా, మరికొందరు దూరంగా పడిపోయారు. ఘటనలో డ్రైవర్ సహా మొత్తం 45 మంది ప్రాణాలు కోల్పోగా ఎనిమిదేళ్ల చిన్నారి మాత్రమే సజీవంగా బయటపడింది. మంటల్లో కొందరి మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలిపోయాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయిన స్థితిలో నుజ్జయిన బస్సులో ఇరుక్కుపోయాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎనిమిదేళ్ల చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పొరుగు దేశం బోట్స్‌వానాకు చెందిన బాధితులంతా దక్షిణాఫ్రికాలోని మోరియా పట్టణంలో ఘనంగా జరిగే 'జియోన్ క్రిస్టియన్ చర్చి' ఈస్టర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనపై దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా బోట్స్‌వానా అధ్యక్షుడు మసిసితో ఫోన్‌లో మాట్లాడారు. ఆయనకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలుగా సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈస్టర్ పండుగ రద్దీ సమయంలో రోడ్డు ప్రయాణాలు చేసే వారు జాగ్రత్తగా ఉండాలని దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను సైతం చేపట్టినప్పటికీ దుర్ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

వివాహేతర సంబంధం పెట్టుకుంటే రాళ్లతో కొట్టి చంపుతాం

అఫ్గాన్ మహిళలకు తాలిబాన్ల హెచ్చరిక

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో మధ్యయుగాల నాటి ఛాందసవాద పాలనకు తెరలేపిన తాలిబాన్లు ప్రజల పట్ల మరింత దారుణంగా వ్యవహరించనున్నారు. ముఖ్యంగా మహిళలపై కఠిన ఆంక్షల కొరడాను మరోసారి ఝులిపించారు. వివాహేతర సంబంధం, వ్యభిచారానికి ఒడిగట్టే మహిళలను బహిరంగంగా రాళ్లతో కొట్టి చంపుతామని తాలిబాన్లు హెచ్చరించారు. ఈ మేరకు తాలిబాన్ల సుప్రీం లీడర్ ముల్లా హిబాతుల్లా అకుంద్‌జాదా అఫ్గాన్లనుద్దేశిస్తూ ప్రభుత్వ టీవీ చానెల్‌లో శనివారం ఒక ఆడియో సందేశం ఇచ్చారు. ''అంతర్జాతీయ సమాజం చెబుతున్నట్లు మహిళలకు హక్కులు ఉండాలంటారా? అవి మన ఇస్లామిక్ షరియా చట్టాలు, మన మతాధికారుల నియమాలకు వ్యతిరేకం. మేం చాయ్ తాగుతూ చూస్తూ ఊరుకుంటామని అనుకుంటున్నారేమో! ఈ నేలపై షరియా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసి తీరతాం. వివాహేతర సంబంధాలు, వ్యభిచారం ఘటనల్లో మహిళలను అందరూ చూస్తుండగా కొయ్యకు కట్టేసి రాళ్లతో కొట్టి చంపుతాం'' అని అకుంద్‌జాదా హెచ్చరించారు.

అమానుష ఫొటోకు అవార్డా!

నెటిజన్ల తీవ్ర ఆగ్రహం



వాషింగ్టన్: ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాలపై హమాస్ మిలిటెంట్ల మెరుపుదాడి ఘటనలో ఒక యువతిని అపహరించి అర్ధనగ్నంగా ఊరేగించిన ఫొటోకు అంతర్జాతీయ అవార్డ్ ఇవ్వడం వివాదాస్పదమైంది. ఫొటోలో యువతిని బ్లర్ చేయకుండానే ఇంటర్నెట్‌లో పెట్టడంతో అవార్డుల సంస్థపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గత అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతంలో జరుగుతున్న సంగీత విభావరిపై హమాస్ మిలిటెంట్లు దాడి చేయడం, దాదాపు 360 మందిని చంపేయడం తెలిసిందే. జర్మనీకి చెందిన 22 ఏళ్ల పర్యాటకురాలు షానీ లౌక్‌తో పాటు పలువురిని కిడ్నాప్ చేశారు. ఆమెను అపహరించి అర్ధనగ్నంగా గాజా వీధుల్లో ఊరేగిస్తుండగా 'ది అసోసియేటెడ్ ప్రెస్' వార్తాసంస్థ పలు ఫొటోలు తీసింది. నాటి దారుణానికి సజీవ సాక్ష్యంగా నిలిచిందంటూ ఈ ఫొటోకు ' టీమ్ పిక్చర్ స్టోరీ ఆఫ్ ది ఇయర్' కేటగిరీ కింద ప్రథమ బహుమతి ప్రకటించారు. అమెరికాలోని కొలంబియాలో ఉన్న మిస్సోరీ స్కూల్ ఆఫ్ జర్నలిజం విభాగమైన డొనాల్డ్ రేనాల్డ్స్ జర్నలిజం ఇన్‌స్టిట్యూట్ ఈ అవార్డును ప్రకటించింది. ఊరేగింపు ఘటన జరిగిన కొద్ది రోజులకు గాజాలో షానీ లౌక్ పుర్రె భాగం ఇజ్రాయెల్ బలగాలకు దొరికింది. దీంతో హమాస్ మూకలు ఈమెను చిత్రవధ చేసి చంపేశాయని ఇజ్రాయెల్ అక్టోబర్ 30న ప్రకటించింది. ఆమె మృతదేహం ఇంకా గాజాలోనే ఉంది. నాటి నరమేధానికి బలైన అభాగ్యురాలిని ఇలా అవార్డు పేరిట అవమానిస్తారా? అంటూ ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు మండిపడుతున్నారు. అయితే ఈ ఫొటోలను అసోసియేటెడ్ ప్రెస్ తీయలేదని, హమాస్ మిలిటెంట్లలో ఒకరు తీసిన ఫొటోలను అసోసియేటెడ్ ప్రెస్ సంపాదించిందని కొందరు వ్యాఖ్యానించారు.

ఒకే వేదికపైకి బైడెన్, క్లింటన్, ఒబామా!

న్యూయార్క్: డెమోక్రాటిక్ పార్టీ తరఫున మరోసారి అధ్యక్ష రేసులో ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిధుల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. గురువారం రాత్రి న్యూయార్క్‌లోని రేడియో సిటీ మ్యూజిక్ హాల్‌లో జరిగిన ఈ కార్యమానికి మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్ హాజరయ్యారు. బైడెన్‌కు ఏకంగా 26 మిలియన్ డాలర్ల (సుమారు రూ.216 కోట్లు) పైచిలుకు నిధులు సమకూరాయి. అమెరికా అధ్యక్ష ప్రచారంలో ఒక్క కార్యక్రమంలో ఇంత భారీ విరాళాలు రావడం ఇదే తొలిసారి!



న్యూయార్క్‌లోని రేడియో సిటీ మ్యూజిక్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు బైడెన్, బరాక్ ఒబామా, బిల్ క్లింటన్




కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన సభకు భారీగా హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మోసగాళ్లను నమ్మొద్దు



సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్

'పొత్తులు, జిత్తులు, మోసాలు, అబద్ధాలు, కుట్రలతో వారు మళ్లీ మీ ముందుకు వస్తున్నారు. మాట నిలబెట్టుకున్న మనకూ, మాట తప్పిన చంద్రబాబుకూ మధ్య ఎన్నికలు జరగబోతున్నాయి. మనందరి ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జగన్ చేసిన మంచిని, చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి చెప్పాలి. మోసం చేసిన వారి తోకలు కత్తిరించే స్టార్ క్యాంపెయినర్లు మీరే. ఈ ఐదేళ్ల పాలనలో మేలు చేసి చూపించి ప్రజల ఇళ్ల వద్దకు వెళుతున్నాం. మీకు మంచి జరిగి ఉంటేనే మీ బిడ్డకు అండగా నిలిచేందుకు స్టార్ క్యాంపెయినర్లుగా రావాలి' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా మూడో రోజు శుక్రవారం ఆయన ఎమ్మిగనూరు బహిరంగ సభలో మాట్లాడారు. జన సముద్రంగా మారిన ఎమ్మిగనూరు సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని చెప్పారు. మే 13న జరిగే కురుక్షేత్ర యుద్ధంలో పేదల పక్షాన నిలిచి పెత్తందారులను ఓడించేందుకు మీరంతా సిద్ధమా.. అని ప్రశ్నించారు. సిద్ధం అంటూ చేతులు పైకెత్తిన ఈ మహా సైన్యం.. పైకి లేచిన ప్రతి చేయి, ఉప్పొంగిన ప్రతి గుండె మా ఇంట గత ఐదేళ్లుగా మంచి జరిగింది అని చెబుతోందన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..,

– సాక్షి ప్రతినిధి, కర్నూలు

ఎమ్మిగనూరు రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్



సభకు భారీగా హాజరైన ప్రజానీకానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పిల్లల భవిష్యత్ కోసమే సంస్కరణలు

- మా ప్రభుత్వ బడులు బాగుపడుతున్నాయని, మా పిల్లల చదువులు మెరుగు పడుతున్నాయని ప్రతీ గుండె చెబుతోంది. రాష్ట్రంలో ఈ 58 నెలల్లో కనీవినీ ఎరుగని విధంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. 10–16 ఏళ్ల తర్వాత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మన బడుల్లో, విద్యా రంగంలో మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం మనది. నిలబెట్టే చదువు, తలెత్తుకునే ఉద్యోగాలు, ప్రపంచంలో ఎక్కడైనా బతికేలా అవకాశాలు మన విద్యా విధానంలో తీసుకొచ్చాం.
- బడులకు పంపే తల్లులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడిని తీసుకొచ్చాం. నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, తరగతి గదులు, కార్పొరేట్ కంటే గొప్పగా 6వ తరగతి నుంచి ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా డిజిటల్ బోధన, 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు, విద్యా కానుక కిట్లు, గోరుముద్ద, 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్లు, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకు మంచి మార్పులు తీసుకొచ్చాం.
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ పేదల పెద్ద చదువులకు అండగా నిలిచాం. బోధనలో మార్పులు, ఇంటర్న్‌షిప్‌తో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాం. పిల్లలకు ఓట్లు ఉండవని, వారి చదువుల గురించి గతంలో ఏ పాలకుడు పట్టించుకోలేదు. వారి బతుకులు మారాలన్న తపన, తాపత్రయంతో మనం అడుగులు ముందుకు వేశాం. ఈ ఎన్నికలు కేవలం ఓ ఎమ్మెల్యేనో, ఎంపీనో ఎన్నుకునేందుకు తూతూ మంత్రంగా ఓటు వేసేవి కాదు. పిల్లల భవిష్యత్, వారి తల్లిదండ్రుల భవిష్యత్ మారుతుందని జ్ఞాపకం ఉంచుకోవాలి.

ఆడబిడ్డలు ఎదిగేలా అడుగులు వేశాం

- మన బంగారు తల్లులు ఆడబిడ్డలు, అవ్వల కోసం గత ప్రభుత్వం ఏం చేసిందని అడిగితే చెప్పేందుకు ఒక్కటైనా ఉందా? మన రాష్ట్రంలో నూటికి 30 మంది ఆడపిల్లలు పదో తరగతి కూడా పూర్తి చేయలేదు. బాల్య వివాహాలను ఆపే పరిస్థితి కూడా లేదు. తన బిడ్డను, వారి భవిష్యత్‌ను నిర్ణయించే శక్తి తల్లుల చేతుల్లో లేదంటే.. అలాంటి పాలకులు ఉన్నా, లేకున్నా ఒకటే.
- పాదయాత్రలో నా కళ్లతో చూసిన మరో విషయం చెబుతా. పూలు, వరి, తృణధాన్యాల దాకా ప్రతి గింజ ఎవరి నోట్లోకి వెళుతుందో భగవంతుడు రాస్తాడు. ప్రతీ గింజ పండించడంలో అక్క చెల్లెమ్మల పాత్ర ఎంత ఉందో నా కళ్లతో చూశా. పని వాళ్లుగా, రోజు కూలీలుగా చిన్న చిన్న పనులు చేసుకుని జీవిస్తున్న లక్షల మంది వారి బతుకులను ఎంత కష్టంగా లాగుతున్నారో చూశా. వారి బతుకులు మారాలని ఈ 58 నెలల్లో అడుగులు ముందుకు వేశాం.
- రోజు కూలీ, దోశలు.. ఇడ్లీలు అమ్మే ఓ అక్క, కుట్టుమిషన్ నడిపే ఓ చెల్లి ఇలా వీరంతా బాగుపడాలి. వీరందరి జీవితాల్లో వెలుగులు రావాలని పథకాలు తీసుకొచ్చాం. ఈ ఆలోచనల నుంచే అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, తోడు, చేదోడు, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా పుట్టాయి. కుదేలైన పొదుపు సంఘాలు ఆసరా, సున్నా వడ్డీ పథకాలతో ఇవాళ తలెత్తుకుని నిలబడ్డాయి. 45–60 ఏళ్ల వయస్సులో నా అక్కచెల్లెమ్మల జీవితాలను బాగు చేసేందుకు చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం అనే పథకాలు పుట్టాయి.

చేతల్లో సామాజిక న్యాయం

- స్వాతంత్య్రం వచ్చిన ఈ 77 ఏళ్లలో సామాజిక న్యాయం అంశంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అంటూ అణగారిన వర్గాలకు భరోసా ఇచ్చింది మీ బిడ్డ ప్రభుత్వం. ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు ఇందులో 75 శాతం పైచిలుకు నా.. నా.. అని పిలిచే నా సామాజిక వర్గాలకే వచ్చాయి. మీ బిడ్డ ప్రభుత్వం వచ్చే వరకూ రాష్ట్రంలో 4 లక్షల ఉద్యోగాలు ఉంటే, ఇప్పుడు ఏకంగా మరో 2.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. ఇందులో 80 శాతం ఉద్యోగాలు ఈ వర్గాల వారే. నామినేషన్‌పై ఇచ్చే ఉద్యోగాలు, కాంట్రాక్టులు ఏకంగా 50 శాతం చట్టం చేసి ఈ వర్గాలకే వచ్చేట్లు చేసింది కూడా మీ ప్రభుత్వమే. రాజ్యసభ నుంచి ఎమ్మెల్సీ, మంత్రి పదవుల వరకూ ఈ వర్గాలకే ప్రాధాన్యత ఇస్తూ పదవులు ఇవ్వడం సప్తవర్ణాల మిశ్రమం, సామాజిక ఇంద్ర ధనస్సు అని చెప్పేందుకు సంతోష పడుతున్నా.

భవిష్యత్‌ను మార్చే ఎన్నికలివి

- దేశంలో తొలిసారి ఆలయ బోర్డులు, మార్కెట్ కమిటీలు, రాజకీయ నియామకాల్లో ఏకంగా 50 శాతం పదవులకు చట్టం చేసి మహిళలకు ఇచ్చిన ప్రభుత్వానికి రక్షాబంధన్ కట్టాలి. బ్యాంకులకు వెళ్లి.. మహిళల అకౌంట్లలో చంద్రబాబు ఐదేళ్ల వివరాలు, మన ప్రభుత్వంలోని ఐదేళ్ల వివరాలు చూడండి. చంద్రబాబు పాలనలో మీ ఖాతాలకు ఒక్క రూపాయి అయినా వచ్చిందా? మీ బిడ్డ ప్రభుత్వ హయాంలో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశాం. ప్రతిపక్షం మాయలు, మోసాల్ని నమ్ముకుంటే.. మీ ప్రభుత్వం మీకు చేసిన మంచిని నమ్ముకుంది. ఈ ఎన్నికలు 2.5 కోట్ల మంది అక్క చెల్లెమ్మలు.. వారి భవిష్యత్, వారి పిల్లల భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలని గుర్తు పెట్టుకోవాలి.
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గట్టిగా నమ్మిన ప్రభుత్వం ఇది. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 చొప్పున ఈ 58 నెలల్లో ఏకంగా రూ.67,500 ప్రతీ రైతు చేతిలో పెట్టాం. చంద్రబాబు ఐదేళ్లలో రూ.87,612 కోట్లు రుణమాఫీ చేస్తానని మోసం చేశారు. చంద్రబాబు హయాంలో రాత్రి పూట 12 గంటలకు ఎప్పుడో కరెంట్ వచ్చేది. ఈ రోజు పగటి పూటే నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా ఆర్బీకేలు చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ప్రతి ఎకరాకు ఈ క్రాప్ చేసి రైతులకు ఉచిత పంటల బీమా ఇస్తున్నాం. వరదలు, తుపాన్‌లు వచ్చి రైతులకు నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేది మీ బిడ్డ ప్రభుత్వంలోనే. అసైన్డ్, ఇనాంతో పాటు 22ఏకు సంబంధించిన 35 లక్షల ఎకరాల భూములపై శాశ్వత భూ హక్కులు కల్పించిన ప్రభుత్వం ఇది. రైతు పేరు పలకడమే నేరంగా భావించి, వారిని మోసం చేయడం, వ్యవసాయం దండుగ అనే పార్టీలకు మద్దతిస్తారా? మీకు అండగా నిలిచే మీ భూమిపుత్రుడికి అండగా నిలుస్తారా?



సభలో సీఎం జగన్ పిలుపు మేరకు సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్‌ను ఆన్‌చేసి మేమంతా సిద్ధం అంటూ నినదిస్తున్న ప్రజలు

మంచి చేసిన ప్రభుత్వానికి రాఖీ కట్టండి

- నా చేతికి మాత్రమే కాదు.. మంచి చేసిన మీ ప్రభుత్వానికి రాఖీ కట్టాలని కోరుతున్నా. 31 లక్షల ఇళ్లపట్టాలు ఇచ్చిన, 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్న ప్రభుత్వానికి రాఖీ కట్టాలి. దిశ యాప్ ద్వారా 35 వేల మంది అక్క చెల్లెమ్మలు ఆపదలో ఉంటే వారికి భద్రత కల్పించిన ప్రభుత్వానికి రక్షా బంధన్ కట్టాలి. మహిళా పోలీసును ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి రక్షాబంధన్ కట్టాలి. అవ్వా, తాతలకు.. అభాగ్యులైన అక్కచెల్లెమ్మలకు, దివ్యాంగులకు ఒకటో తేదీన, సెలవైనా సూర్యోదయానికి ముందే వారి చేతిలో పింఛన్ పెట్టేందుకు వలంటీర్‌ను ఇంటికే పంపిన ప్రభుత్వానికి రాఖీ కట్టాలి.
- పింఛన్ తీసుకునే 66 లక్షల మందిలో అవ్వలు, వితంతు అక్క చెల్లెమ్మలు 45 లక్షల మంది ఉన్నారు. వీరందరూ మీ ప్రభుత్వానికి రక్షాబంధన్ కట్టాలని కోరుతున్నా. ఈ 58 నెలల్లో లంచాలు, వివక్ష లేకుండా నేరుగా రూ.2.70 లక్షల కోట్లు ప్రజలకు ఇచ్చాం. అందులో రూ.1.90 లక్షల కోట్లు కేవలం నా అక్క చెల్లెమ్మలకు ఇచ్చి మహిళ సాధికారతను ఉద్యమంగా నడిపిన ప్రభుత్వం ఇది. వారి భవిష్యత్ కోసం రక్షాబంధన్ కట్టాలని కోరుతున్నా.

బాబు తోక కత్తిరించండి

- ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం వద్దని అడ్డుకున్న వారికి బుద్ధి చెప్పండి. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే కులాల మధ్య సమతుల్యత దెబ్బతింటుందని కోర్టుల్లో కేసులు వేసిన వారు, బీసీల తోకలు కత్తిరిస్తాం.. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అనే చంద్రబాబు తోకను మరోసారి కత్తిరించాలని కోరుతున్నా. నాన్న ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను పణంగా పెట్టడమే కాకుండా, గత 30 ఏళ్లుగా చెలగాటం ఆడుతున్న బాబును ఏ ఒక్కరైనా సమర్థిస్తారా? ఈ వర్గాలన్నీ నేను అక్కున చేర్చుకున్న వర్గాలు.
- బాబుకు నా.. నా.. అని పిలుచుకునే వర్గాలు హైదరాబాద్ మెట్రోలో హైటెక్‌సిటీలో ఉన్నాయి. ఇక్కడ లేవు. ఓ ఈనాడు, ఆంధ్ర జ్యోతి, టీవీ–5 వీరికి తోడు ఓ దత్తపుత్రుడు. వీరు మన రాష్ట్రంలో ఉండరు. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చేది వెన్నుపోటు, మోసాలు మాత్రమే. ఐదేళ్ల కిందట ఓ దత్తపుత్రుడు, ఢిల్లీ నుంచి మోడీని తెచ్చుకుని ఇదే చంద్రబాబు 2014లో మేనిఫెస్టో అని చెప్పి రంగు రంగుల కాగితాలు తీసుకొచ్చారు. 650 హామీలు ఇచ్చారు. ఇవి ప్రజలు మర్చిపోతారు అని ముఖ్యమైన హామీలు అంటూ ఓ కరపత్రం (చేత్తో పట్టుకుని చూపిస్తూ) సంతకం చేసి ప్రతీ ఇంటికి పంపారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5లో ప్రకటనలు ఇచ్చారు.

చంద్రబాబు మోసాలు ఇవిగో..

- రైతులకు రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానన్నారు. రూ. 87,612 కోట్లు మాఫీ చేశాడా?
- డ్వాక్రా రుణాలు పూర్తిగా రద్దు చేస్తామన్నారు. రూ.4,205 కోట్లు. ఒక్క రూపాయి అయినా మాఫీ చేశారా?
- ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నారు. ఎవరికైనా రూపాయి డిపాజిట్ చేశారా?
- ఇంటింటికీ ఓ ఉద్యోగం.. లేదా నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఐదేళ్లలో రూ.1.20 లక్షలు ఇచ్చారా?
- అర్హులైన వారికి 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు సాయం ఇస్తామన్నారు. ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చారా?
- రూ.10వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చేనేత, మహిళ రుణాలు మాఫీ, ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్, రాష్ట్రాన్ని సింగపూర్‌కు మించి అభివృద్ధి, ప్రతీ నగరాన్ని హైటెక్‌సిటీగా నిర్మించడం ఇలా ఎన్నో హామీలు ఇచ్చారు. మీ నగరంలో, జిల్లాలో హైటెక్‌సిటీ ఎక్కడైనా కన్పించిందా?
- ఇదే చంద్రబాబు, దత్తపుత్రుడు మోడీ ఫొటో పెట్టుకుని ఇంటింటికీ పంపిన ఈ కరపత్రంలో కనీసం ఒక్కటైనా చేశారా? పోనీ ప్రత్యేక హోదా అయినా తెచ్చారా?

మన టార్గెట్ 175కు 175

ఒక్క హామీ నెరవేర్చకపోగా, ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి, మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. మళ్లీ దత్తపుత్రుడు, చంద్రబాబు, మోడీ ఇదే ముగ్గురూ కలిసి సూపర్‌సిక్స్, సూపర్‌సెవన్ అంటున్నారు. ప్రతి ఇంటికీ కిలో బంగారం, బెంజ్ కారు కొనిస్తారట. ఇలాంటి మోసాల నుంచి రాష్ట్రంలోని పేదల భవిష్యత్‌ను కాపాడుకోవాలా? వద్దా? ఈ యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమేనా? సిద్ధం అంటే జేబులో నుంచి సెల్‌ఫోన్‌లు బయటకు తీసి పేదవాడి భవిష్యత్ కోసం మేమంతా సిద్ధం అని లైట్ వేసి పిలుపునివ్వండి. (ప్రజలందరూ సెల్‌లో టార్చ్ ఆన్ చేసి మద్దతు పలికారు). మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు అండగా నిలిచేందుకు స్టార్ క్యాంపెయినర్లుగా రావాలి. ఈ ఎన్నికల్లో మన టార్గెట్ 175కు 175. 25కు 25 ఎంపీలు గెలవాలి. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, కర్నూలు, కోడుమూరు, మంత్రాలయం, పత్తికొండ ఎమ్మెల్యేలుగా బుట్టారేణుక, సాయిప్రసాద్‌రెడ్డి, విరూపాక్షి, ఇంతియాజ్, డాక్టర్ సతీశ్, బాలనాగిరెడ్డి, శ్రీదేవిని నిండు మనస్సుతో ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి, వేయించి గెలిపించాలి.

సంక్షేమంతో ఎమ్మిగనూరుకు రూ.650 కోట్లు..



పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న చర్యలు అమోఘం. ముఖ్యమంత్రి జగన్ చొరవతో ఒక ఎమ్మిగనూరు నియోజకవర్గంలోనే వివిధ సంక్షేమ పథకాల రూపంలో పేదలకు రూ.650 కోట్ల మేర లబ్ధి చేకూరింది. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న నాగలదిన్నె బ్రిడ్జిని పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌దే. గాజులదిన్నె ప్రాజెక్టును ఆధునీకరించడం, గాజులదిన్నెకు హంద్రీనీవా నుంచి 3 టీఎంసీల నీటిని తరలించే అవకాశాన్ని కల్పించింది కూడా ముఖ్యమంత్రి జగనే. సామాజిక న్యాయం లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేశాక ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చేనేతల సంక్షేమానికి టెక్స్‌టైల్ హబ్‌ను విస్తరించడంతోపాటు సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు మరిన్ని ఎత్తిపోతల పథకాలను చేపట్టాలని కోరుతున్నా. పేద వర్గాలకు అందుతున్న పథకాలు కొనసాగాలన్నా, మరింత మెరుగుపర్చాలన్నా వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రతి పేదవాడి గుండెల్లో ఆనందం నింపాలనే లక్ష్యంతో ఐదేళ్ల పాటు సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలి. బీసీ మహిళనైన నాకు ఎమ్మిగనూరు అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నా.

– బుట్టా రేణుక, ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి

చిన్నా.. నేనున్నా

చూపులేని చిన్నారికి సీఎం భరోసా • తక్షణమే స్పందించిన సీఎంవో

కర్నూలు జిల్లా పెంచికలపాడులో సీఎం వైఎస్ జగన్ రాత్రి బస చేసిన శిబిరం నుంచి శుక్రవారం ఉదయం బస్సు యాత్ర ప్రారంభమైన సమయంలో గ్రామానికి చెందిన రేష్మ అనే మహిళ తన నాలుగేళ్ల కుమార్తె పింజరి జుహతో కలసి ఆయన వద్దకు వచ్చింది. పుట్టుకతోనే తన కుమార్తెకు రెండు కళ్లు కనిపించవని సీఎం జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. మూడు ఆసుపత్రుల చుట్టూ తిరిగినా పాపకు కంటి చూపు రాదని డాక్టర్లు చెప్పారని విలపించింది. కనీసం పెన్షనైనా మంజూరు చేస్తే పాపకు అవసరమైన మందులకు ఉపయోగపడుతుందని అభ్యర్థించారు. దీనిపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి జగన్ తన పీఏ ద్వారా సమాచారాన్ని సీఎంవోకు చేరవేశారు. సీఎంవో కార్యాలయం అధికారులు పాపకు సంబంధించి వివరాలను సేకరించారు.



కోడుమూరు రోడ్‌షోలో పూలవర్షం కురిపిస్తూ సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు



ఎమ్మిగనూరు రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్




స్టార్ క్యాంపెయినర్‌లతో
సీఎం జగన్

'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా మూడో రోజైన శుక్రవారం కర్నూలు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ప్రజల అభిమానానికి ముగ్ధులయ్యారు. 'మూడో రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్రలో నా స్టార్ క్యాంపెయినర్‌లతో..' అంటూ పలు ఫొటోలను ఆయన ట్వీట్ చేశారు. ఈ ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకున్నాయి.

-సాక్షి, అమరావతి




లక్షల గళాల గర్జన

కోడుమూరు, హంద్రీ కైరవాడి, గోనెగండ్ల, ఎమ్మిగనూరులో సీఎం జగన్ రోడ్ షోలు సూపర్ హిట్


వేముగోడులో తనకు అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్


ఆదోనిలో సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం పలుకుతున్న ప్రజలు

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి

పెత్తందార్లపై పోరుకు తామంతా సిద్ధమంటూ ఎమ్మిగనూరు వేదికగా లక్షలాది గొంతుకలు సింహగర్జన చేశాయి. పొత్తులు.. జిత్తులు.. మోసాలు.. కుట్రలను ఎదుర్కొని పేదల భవిష్యత్తుకు అండగా నిలిచేందుకు నేను సిద్ధం.. మీరంతా సిద్ధమా? అంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇవ్వడంతో లక్షల మంది పిడికిళ్లు బిగించి మేమంతా సిద్ధమంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. చంద్రబాబు లాంటి మోసగాళ్ల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి నేను సిద్ధం... మీరంతా సిద్ధమైతే సెల్‌ఫోన్‌లో టార్చ్ లైట్ ఆన్ చేయాలని సీఎం జగన్ కోరడంతో ఒక్కసారిగా లక్షల మంది సెల్‌ఫోన్లలో టార్చ్ లైట్ వెలిగించడంతో సభా ప్రాంగణం ఆకాశంలో చుక్కలను తలపించింది. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో కనిపించిన దృశ్యాలివీ.. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ సునామీ సృష్టించడం ఖాయమని ఎమ్మిగనూరు సభ మరోసారి చాటిచెప్పిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో బలంగా నాటుకుపోయిన విశ్వాసానికి ఇది ప్రతీకగా నిలిచిందని అభివర్ణిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం జగన్ చేపట్టిన బస్సు యాత్ర మూడో రోజుకు చేరుకుంది.

కర్నూలు జిల్లాలో బస్సుయాత్ర జైత్రయాత్రను తలపించింది. గురువారం పెంచికలపాడు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో సీఎం జగన్ రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం కర్నూలు సిటీ, పాణ్యం, కోడుమూరు సహా పలు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. ఎన్నికల్లో విజయానికి చేపట్టాల్సిన చర్యలపై వారికి సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ఉదయం 10.30 గంటలకు బస్సు యాత్రను ప్రారంభించి రామచంద్రాపురం మీదుగా కోడుమూరుకు చేరుకున్న సీఎం జగన్‌కు భారీ గజమాలతో అభిమానులు ఘనస్వాగతం పలికారు. కోడుమూరులో సీఎం జగన్ రోడ్ షోకు జనం బ్రహ్మరథం పట్టారు. రోడ్ షో సాగుతున్నంత దూరం బస్సు ముందు చిన్నారులు కోలాట మాడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా వేలాది మంది బారులుతీరి సీఎం జగన్‌పై బంతి పూలవర్షం కురిపించారు. చేనేత కార్మికులు చీరను, మగ్గాన్ని బహూకరించి సీఎం జగన్‌కు మద్దతు పలికారు. బుడగ జంగం సామాజికవర్గ ప్రజలు సీఎం జగన్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. కురుబ సామాజికవర్గానికి చెందినవారు సీఎం జగన్‌కు మేకను బహూకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కోడుమూరు నుంచి హంద్రీ కైరవాడి చేరుకునే సమయానికి ఎండ తీవ్రత పెరిగింది. ఎండను లెక్క చేయకుండా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, చిన్నారులు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరి సీఎం జగన్‌పై పూలవర్షం కురిపిస్తూ వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు మేమంతా సిద్ధమంటూ... నినదించారు. గోనెగండ్లలోనూ సీఎం జగన్ బస్సు యాత్రకు జనం నీరాజనాలు పలికారు. అనంతరం సీఎం జగన్ భోజన విరామం తీసుకున్నారు.

ఎమ్మిగనూరులో జన సునామీ..

భోజన విరామం అనంతరం రాళ్లదొడ్డి నుంచి బయలుదేరిన సీఎం జగన్ బస్సు యాత్రకు ఎర్రకోటలో జనం బ్రహ్మరథం పట్టారు. సీఎం జగన్ బస్సుపై బంతిపూలవర్షం కురిపించారు. షెడ్యూలు ప్రకారం బస్సు యాత్ర ఎమ్మిగనూరుకు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకోవాల్సి ఉండగా, ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలకడంతో రెండు గంటలు ఆలస్యంగా 5.30 గంటలకు చేరుకుంది.

జననేత కోసం నిరీక్షణ..

ఎమ్మిగనూరు సభ రాత్రి 7.20 గంటలకు ముగిసింది. అనంతరం బస్సుయాత్ర హనుమాపురం చేరుకుంది. సీఎం జగన్‌ను చూసేందుకు అవ్వాతాతలు, మహిళలు, చిన్నారులు భారీ ఎత్తున రోడ్డుకు ఇరువైపులా నిలబడ్డారు. సీఎం జగన్ రాగానే బంతిపూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. హనుమాపురం నుంచి ఆస్పరి చేరుకునే సరికి రాత్రి 8.30 గంటలైంది. బస్సు యాత్ర అక్కడికి చేరుకోగానే హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. జన నీరాజనాల మధ్య చిన్నహుల్తి, పత్తికొండ బైపాస్ మీదుగా రాతన వద్ద ఏర్పాటు చేసిన బస శిబిరానికి రాత్రి 9.47 గంటలకు సీఎం జగన్ చేరుకున్నారు. కర్నూలు జిల్లాలో కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజక వర్గాల్లో సాగిన బస్సు యాత్ర గ్రాండ్ సక్సెస్ అయ్యింది. బస్సు యాత్ర శనివారం నాలుగో రోజు ఉదయం కర్నూలు జిల్లా పత్తికొండ బైపాస్ నుంచి ప్రారంభమై మధ్యాహ్నం అనంతపురం జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

సీఎం జగన్ ఎమ్మిగనూరుకు చేరుకునేసరికి కర్నూలు జిల్లా నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో జనవాహిని తరలిరావడంతో జనసంద్రాన్ని తలపించింది. ఉదయం 11 గంటల నుంచి ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి మొదలైన జనప్రవాహం సాయంత్రం 4.30 గంటలకు సునామీని తలపించింది. 30 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. పక్కనే పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పార్కు, ఇరువైపులా రోడ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. ఎమ్మిగనూరు చరిత్రలో సీఎం జగన్ సభ సువర్ణాక్షరాలతో లిఖించేలా నిలిచిపోతుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.


వేముగోడు వద్ద సీఎం వైఎస్ జగన్‌కు పూలవర్షంతో స్వాగతం పలుకుతున్న జనం

ఉప్పొంగిన భావోద్వేగం

ఐదేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేయడంతోపాటు విద్య, వైద్యం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సంస్కరణలు తెచ్చి పేదరికాన్ని రూపుమాపడం, రాష్ట్రం రూపురేఖలు మార్చేందుకు చేపట్టిన చర్యలను వివరిస్తూ సీఎం జగన్ ప్రసంగించారు. 2014 ఎన్నికల్లో ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్, తన ఫొటోతోపాటు సంతకం చేసిన లేఖను ఇంటింటికీ పంపిన చంద్రబాబు రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఆడబిడ్డ పుడితే రూ.25 వేలు డిపాజిట్ చేస్తానని, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తానని, చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ చేస్తానని, అర్హులందరికీ మూడు సెంట్ల భూమి ఇచ్చి పక్కా ఇళ్లు కట్టిస్తాననే ముఖ్యమైన హామీలతోపాటు 650 హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా వంచించటాన్ని ప్రస్తావించినప్పుడు లక్షల మంది ప్రజలు ఔనంటూ.. చేతులు ఎత్తి ఏకీభవించారు. ఇప్పుడు మళ్లీ అదే పొత్తులు, జిత్తులు, కుట్రలు, కుతంత్రాలతో సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు వస్తున్నారని, వాటిని ఎదుర్కొని పేదల భవిష్యత్తును మరింతగా గొప్ప మార్చేందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధమా? అంటూ సీఎం జగన్ ఇచ్చిన పిలుపుతో మేమంతా సిద్ధమే.. అంటూ లక్షల గొంతుకలు ప్రతిస్పందించాయి. శింగనమలలో ఎస్సీ (మాదిగ) సామాజికవర్గానికి చెందిన టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులకు వైఎస్సార్‌సీపీ టికెట్ ఇస్తే చంద్రబాబు ఎద్దేవా చేసి తన పెత్తందారీ పోకడలను రుజువు చేసుకున్నారని సీఎం జగన్ మండిపడ్డారు. పేదవాడు పైకి ఎదిగితే ఎందుకంత మంట? అని నిలదీశారు. మడకశిరలో ఈర లక్కప్ప అనే ఉపాధి కూలీకి టికెట్ ఇచ్చామని, దాన్ని కూడా ఎద్దేవా చేస్తావా బాబూ? అని ప్రశ్నించారు. ''నా...'' అంటూ అక్కున చేర్చుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 200 శాసన సభ, లోక్‌సభ స్థానాల్లో వంద సీట్లు ఇచ్చామని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ కాబట్టే సగం సీట్లు ఇచ్చామన్నారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని అవహేళన చేయడంతోపాటు తోకలు కత్తిరిస్తానంటూ బీసీల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసి, మైనార్టీలను అణగదొక్కిన చంద్రబాబు తోకను కత్తిరించేలా తీర్పు ఇవ్వాలని సీఎం జగన్ పిలుపునిచ్చినప్పుడు మేమంతా సిద్ధమే అంటూ లక్షల గొంతుకలు నినదించాయి.


కోడుమూరులో సీఎం జగన్‌కు గజమాలతో అభిమానుల సత్కారం

పల్లెల్లో అపూర్వ ఆదరణ

మూడో రోజు 108 కి.మీ. యాత్ర

కర్నూలు (సెంట్రల్): మేమంతా సిద్ధం బస్సు యాత్రకు కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో అపూర్వ ఆదరణ లభించింది. సీఎం జగన్ రాక కోసం ఉదయం నుంచి రాత్రి వరకు పల్లెలు ఎదురు చూశాయి. మూడో రోజు బస్సు యాత్ర కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో దాదాపు 108 కిలోమీటర్ల మేర సాగింది. శుక్రవారం ఉదయం 10.35 గంటలకు కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం పెంచికలపాడులో రాత్రి బస చేసిన శిబిరం నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర పత్తికొండ మండలం రాతన వరకు కొనసాగింది. మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో బస్సు యాత్ర పూర్తిగా రాత్రి వేళ సాగినా ప్రజలు వైఎస్ జగన్ రాక కోసం నిరీక్షించారు. తమ అభిమాన నేతను చూసేందుకు పెద్దల నుంచి పిల్లల వరకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

- ఉదయం 9.30 గంటలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, డాక్టర్ జె.సుధాకర్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మణిగాంధీ, ఎస్వీ మోహన్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌ను పెంచికలపాడు శిబిరంలో కలిశారు.
- 10.35 గంటలకు పెంచికలపాడులోని రాత్రి బస శిబిరం నుంచి సీఎం వైఎస్ జగన్ బయటకు వచ్చి బస్సు ఎక్కారు. అక్కడ భారీగా వేచి ఉన్న ప్రజలకు అభివాదం చేశారు.
- 11.35 గంటలకు సీఎం జగన్ కోడుమూరు పట్టణానికి చేరుకున్నారు. అక్కడ వేలాది మంది ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం ముందుకు సాగారు.
- 11.38 గంటలకు సీఎంకు కోడుమూరులో చేనేతలు మగ్గం, నేసిన చీరను బహూకరించారు. గొర్రెల పెంపకందారులు గొర్రె పిల్లలను అందించి తమ అభిమానం చాటుకున్నారు.
- 11.45 గంటలకు కోడుమూరులో బుడగ జంగాలు తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరగా, వచ్చే ప్రభుత్వంలో ప్రాధాన్యతగా తీసుకుంటామని సీఎం జగన్ హామీ ఇచ్చారు.

మూడో రోజు యాత్ర సైడ్‌లైట్స్

- 12.20 గంటలకు కోడుమూరు మండలం వర్కూరుకు బస్సు యాత్ర చేరుకుంది.
- మధ్యాహ్నం 1.15 గంటలకు సీఎం బస్సుయాత్ర ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగొండ్ల మండలం వేముగోడుకు చేరుకోగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకా ఘన స్వాగతం పలికారు.
- 1.59 గంటలకు సీఎం జగన్ బస్సు యాత్ర గోనెగండ్ల చేరుకోగా, ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు.
- 2.30 గంటలకు సీఎం జగన్ భోజన విరామం కోసం గోనెగండ్ల మండలం రాళ్లదొడ్డిలో ఏర్పాటు చేసిన శిబిరానికి చేరుకున్నారు.
- సాయంత్రం 4 గంటలకు గోనెగండ్ల మండల మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి వైఎస్ఆర్‌సీపీలో చేరగా, ఆయనకు సీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- భోజన విరామం అనంతరం సాయంత్రం 4.30గంటలకు బస్సు యాత్ర ప్రారంభమైంది.
- సాయంత్రం 5.45 గంటలకు ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం జగన్ చేరుకున్నారు.
- రాత్రి 7.14 గంటలకు బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడబూరు మండలంలోని హనుమాపురం గ్రామానికి సీఎం జగన్ చేరుకోగా ప్రజలు ఘన స్వాగతం పలికారు.
- 7.25 గంటలకు ఎమ్మిగనూరు మండలం అరెకల్‌కు, అక్కడి నుంచి 8.15 గంటలకు ఆదోని క్రాస్ చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.
- 8.20 గంటలకు ఆదోని నియోజకవర్గం విరుపాపురం చేరుకున్నారు.
- 9 గంటలకు ఆలూరు నియోజవకర్గం బిణిగేరి మీదుగా ఆస్పరి చేరుకున్నారు.
- 9.30 గంటలకు చిన్నహుల్తి మీదుగా పత్తికొండ బైపాస్ చేరుకోగా నేతలు అపూర్వ స్వాగతం పలికారు.
- రాత్రి 9.47 గంటల సమయంలో పత్తికొండ మండలం రాతన సమీపంలో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్ చేరుకున్నారు.

నేడు తుగ్గలిలో ప్రజలతో
సీఎం జగన్ ముఖాముఖి
4వ రోజు కర్నూలు, అనంతపురం జిల్లాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నాలుగో రోజైన శనివారం కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కొనసాగనుంది. బస్సు యాత్ర నాలుగో రోజు షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం శుక్రవారం రాత్రి వెల్లడించారు. పత్తికొండలో రాత్రి బస చేసిన ప్రదేశం నుంచి సీఎం జగన్ శనివారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. రాతన మీదుగా తుగ్గలి చేరుకుని ఉదయం 10 గంటలకు గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జొన్నగిరి, గుత్తి మీదుగా ప్రయాణించి.. గుత్తి శివారులో ముఖ్యమంత్రి భోజన విరామం తీసుకుంటారు. అక్కడి నుంచి 3 గంటలకు బయలుదేరి పామిడి, కల్లూరు, అనంతపురం బైపాస్, రాప్తాడు బైపాస్, ఆకుతోటపల్లి మీదుగా సంజీవపురం శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్ చేరుకుంటారు.


అభిమానులు ఇచ్చిన గొంగళి కప్పుకొని గొర్రెపిల్లను ఎత్తుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





బస్సు యాత్రలో భాగంగా కర్నూలు జిల్లా కొత్తూరు, వేముగోడు, హంద్రీ కైరవాడి గ్రామాల్లో అవ్వతాతలను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

క్లుప్తంగా...

నేను సామాన్య కార్యకర్తను

- జగనన్న నన్ను గుర్తించి, టికెట్ ఇచ్చారు
- మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఎస్ఎల్ ఈర లక్కప్ప



మడకశిర: పేదలు, సామాన్యులను గుర్తించి, వారిని ఉన్నత స్థానాల్లో కూర్చోపెట్టడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదల పట్ల ప్రేమాభిమానాలకు నిదర్శనమని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్ఎల్ ఈర లక్కప్ప చెప్పారు. తాను పార్టీలో అతి పేద, సామాన్య కార్యకర్తనని చెప్పారు. సమస్యలను అధికారులకు చెప్పుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు నిస్వార్థంగా అర్జీలు రాసిస్తూ వారి అభిమానాన్ని పొందానని తెలిపారు. ఇలా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న తనను సీఎం జగనన్న గుర్తించి, పార్టీ టికెట్ ఇచ్చారని చెప్పారు. తన దగ్గర రూపాయి కూడా లేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన పక్కా ఇంట్లోనే ఉంటున్నానని చెప్పారు. నాయకులు, అధికారులు ఇంటికొస్తే వేయడానికి కుర్చీలు కూడా లేవన్నారు. అలాంటి తనకు జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇవ్వడం చాలా గొప్ప విషయమని చెప్పారు. మడకశిర నియోజకవర్గంలో టీడీపీ వారు రూ.100 కోట్లు ఖర్చు పెట్టినా, తనను జగనన్న అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- ఎన్నికల కమిషన్‌కు దళిత జేఏసీ చైర్మన్ వరప్రసాదరావు విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు(ఎస్సీ)ని వేలిముద్రగాడంటూ అవహేళనగా మాట్లాడిన టీడీపీ అధినేత చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసేలా పోలీసులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంఏ ఎకనామిక్స్ చదివిన వీరాంజనేయులుకు వైఎస్సార్‌సీపీ టికెట్ ఇచ్చిన సీఎం జగన్‌ను అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నారని తెలిపారు. వీరాంజనేయులుపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు.


టీడీపీకి ఓట్లేయకుంటే ఇబ్బందులు తప్పవ్..

- ప్రకాశం జిల్లా కంద్రిగ గ్రామ దళితులకు టీడీపీ నేతల బెదిరింపులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీకి ఓట్లేయకపోతే మా పొలాలకు ఎలా వస్తారో చూస్తాం.. అంటూ టీడీపీ నేతలు దళితులను బెదిరింపులకు గురిచేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం మోచెర్లవారి కంద్రిగలో అత్యధిక శాతం టీడీపీకి అనుకూల సామాజికవర్గానికి చెందిన వారుంటారు. గ్రామ శివారు ఎస్సీ కాలనీవాసులు ఆ సామాజికవర్గానికి చెందిన వారి పొలాల్లో పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. కొందరు కూలీలు పొగాకు కోశాక మిగిలిన ఎండుటాకులను (గుల్లాకు) ఏరుకుని ఇంటికి తెచ్చుకుని విక్రయిస్తుంటారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు కొందరు సమావేశమయ్యారు. ఎస్సీ కులస్తులను పిలిపించారు. సుమారు రూ.7 లక్షలు ఖర్చు చేసి బొడ్డురాయి ఏర్పాటు చేస్తామని, గ్రామస్తులంతా టీడీపీకి ఓటు వేయాలని డిమాండ్ చేశారు. అయితే కొందరు దాన్ని వ్యతిరేకించారు. దీనిపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీకి ఓట్లేయకుంటే మీకు ఇబ్బందులు తప్పవు అంటూ హెచ్చరించారు. శుక్రవారం ఏకంగా దండోరా వేయించారు. ఒంగోలు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి అనుచరుడైన బెల్లం సత్యం పేరు చెప్పి దళితులను భయపెట్టారు. 'ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లో సత్యం వచ్చి కూర్చుంటే మీరు ఇక ఓటెలా వేస్తారో చూద్దాం..' అంటూ రామ్మూర్తి అనే వ్యక్తి బెదిరించాడు.

నేటి నుంచి పవన్ తొలివిడత ఎన్నికల ప్రచారం

- 14 రోజుల్లో 5 రోజులు పిఠాపురంలోనే




సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పిఠాపురం నుంచి శనివారం ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టనున్నారు. తొలివిడతలో మొత్తం 14 రోజులు పాటు పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పవన్ ప్రచార యాత్ర జరుగుతుండగా, అందులో రెండుసార్లు ఐదు రోజుల పాటు తాను పోటీ చేసే పిఠాపురంలోనే పాల్గొననున్నారు. పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రచార షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. '30వ తేదీ నుంచి వచ్చే నెల రెండు వరకు పిఠాపురంలో ప్రచారం నిర్వహించి.. బహిరంగ సభలో పాల్గొంటారు. 3న తెనాలి, 4న నెల్లిమర్ల, 5న అనకాపల్లి, 6న యలమంచిలి, 7న పెందుర్తి, 8న కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తారు. 9న ఉగాది వేడుకలు పిఠాపురంలో నిర్వహిస్తారు. 10న రాజోలు, 11న పి.గన్నవరం, 12న రాజానగరం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో పాల్గొంటారు' అని నాదెండ్ల వివరించారు.

బీసీలకు బాబు పోటు

బలహీన వర్గాలకు 34 ఎమ్మెల్యే సీట్లతో సరి

- సొంత సామాజిక వర్గానికి 32 సీట్లు
- మైనారిటీలకు ద్రోహం.. కేవలం మూడే
- కంటి తుడుపుగా బీసీలకు 6ఎంపీ సీట్లు
- కాపులకు ఒక్క ఎంపీ టికెట్ ఇవ్వని వైనం





సాక్షి, అమరావతి: బలహీన వర్గాలపై మొసలి కన్నీళ్లు కురిపించే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి బీసీలకు వెన్నుపోటు పొడిచారు. పొత్తులో టీడీపీ పోటీ చేసే 144 అసెంబ్లీ స్థానాలకుగానూ కేవలం 34 సీట్లను మాత్రమే బీసీలకు కేటాయించారు. తన సొంత సామాజిక వర్గానికి మాత్రం ఏకంగా 32 సీట్లు ఇచ్చారు. బీసీలతో సమానంగా కమ్మ సామాజిక వర్గం నేతలు దాదాపు అన్ని జిల్లాల్లో సీట్లు దక్కించుకోవడం గమనార్హం. ఇక మైనారిటీలకు నామమాత్రంగా మూడు సీట్లతో సరిపెట్టారు. న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను కూడా పొత్తులో వదిలేయడంతో టీడీపీలోని ముస్లిం నేతలు ఆందోళన చెందుతున్నారు. కాపు సామాజిక వర్గానికి అన్యాయం చేసిన చంద్రబాబు కేవలం 9 సీట్లు మాత్రమే వారికి కేటాయించారు. ఆ సామాజిక వర్గం ఓట్ల కోసం పవన్ కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకున్నా సీట్లు మాత్రం ఇవ్వలేదు.

ఎంపీ సీట్లలోనూ అదే తీరు..

ఎంపీ సీట్లలోనూ చంద్రబాబు సొంత సామాజిక వర్గానికే పెద్దపీట వేశారు. బీసీలకు తప్పనిసరి పరిస్థితుల్లో ఆరు ఎంపీ సీట్లు ఇవ్వగా తన సొంత సామాజిక వర్గానికీ ఆరు సీట్లు ఇచ్చారు. పొత్తులతో దక్కిన 17 ఎంపీ స్థానాల్లో కాపులకు చంద్రబాబు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం గమనార్హం. దీన్ని బట్టి చంద్రబాబు అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టమవుతోంది. తన ప్రసంగాల్లో పేదల గురించి, సామాజిక న్యాయం గురించి డప్పు కొట్టే చంద్రబాబు రాజకీయంగా మాత్రం వారిని అణగదొక్కుతూనే ఉన్నట్లు మరోసారి తేలిపోయింది.

టిప్పర్ డ్రైవర్ ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదా?

- దళితులకు మీరిచ్చే గౌరవం ఇదా?
- కష్టపడి ఎంఏ, బీఈడీ చదివాను
- కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్‌గా పనిచేశాను
- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ధ్వజం



సర్టిఫికెట్లు చూపుతున్న వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం: నిరుపేద కుటుంబానికి చెందిన వారు, టిప్పర్ డ్రైవర్‌గా పని చేసే వారు ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదా అని అనంతపురం జిల్లా శింగనమల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు టీడీపీ అధినేత చంద్రబాబును ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. బుక్కరాయసముద్రంలో గురువారం చంద్రబాబు ప్రజాగళం పేరుతో నిర్వహించిన సభలో వైఎస్ జగన్ టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారంటూ తనపై వ్యంగ్యంగా మాట్లాడారని, దళితుడనని కూడా చూడకుండా అవహేళనగా మాట్లాడడం తగదన్నారు. ఇదేనా మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల సీఎం అనుభవం, ఇదేనా దళితులకు మీరిచ్చే గౌరవం అని మండిపడ్డారు. తాను కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్‌గా పని చేశానని, తానేమీ పబ్‌లో డ్యాన్స్‌లు చేస్తూ డబ్బులు సంపాదించుకోలేదని అన్నారు. పేద కుటుంబంలో పుట్టిన తాను కష్టపడి చదివి ఎంఏ , బీఈడీ చదివానంటూ సర్టిఫికెట్లు చూపించారు.

చులకనగా మాట్లాడటమే చంద్రబాబు పని

చంద్రబాబు జీవితమంతా ఎస్సీ, ఎస్టీ, బీసీలను చులకనగా మాట్లాడడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తాను, ఉపాధి హామీ కూలీ అయిన మడకశిర అభ్యర్థి ఈర లక్కప్ప.. తామంతా ఈ రోజు వైఎస్సార్‌సీపీలో ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు. పేదవాళ్లు సాటి మనుషులేనని, దళితులు కూడా సాటి మనుషులేనన్న జ్ఞానం చంద్రబాబుకు లేకపోయిందన్నారు. తమ పార్టీ పేదల పక్షం కాబట్టే సీఎం జగనన్న పేదలకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారన్నారు. మీ పార్టీ పెత్తందార్లది కాబట్టే కోటీశ్వరులకు టికెట్లు ఇచ్చారని బాబుపై మండిపడ్డారు. జగనన్నను మరోసారి సీఎం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

బాబు దురహంకారం..

మరోసారి బహిర్గతం

పేదలు, దళితులంటే చంద్రబాబుకు చాలా అలుసు

- తరచూ వారిని హేళన చేస్తున్న బాబు
- ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ హేళన
- తోకలు కత్తిరిస్తా అంటూ నాయీ బ్రాహ్మణులపై చిందులు
- తాజాగా శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని కించపరుస్తూ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: నిలువెల్లా అగ్ర కుల దురహంకారాన్ని నింపుకొన్న టీడీపీ అధినేత చంద్రబాబు తరచూ దానిని బహిర్గతం చేసుకొంటూ ఉంటారు. పేదలు, దళితులను హేళన చేస్తూ, అవమానపరుస్తుంటారు. బడుగు, బలహీన వర్గాలంటే ఆయన దృష్టిలో కేవలం ఓట్లు వేసి, తనలాంటి అగ్రకుల దురహంకారుల అడుగులకు మడుగులొత్తే వాళ్లే. తరచూ ఆయన మాటల్లో, చేతల్లోనే దీనిని బయటపెట్టుకుంటుంటారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నత హోదాలో ఉన్నప్పుడే ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అంటూ దళితుల పట్ల అత్యంత హేయంగా మాట్లాడిన చరిత్ర చంద్రబాబుది. న్యాయం కోసం వచ్చిన నాయీ బ్రాహ్మణులను 'తోకలు కత్తిరిస్తా' అంటూ కుల ఉన్మాదాన్ని చూపించారు. ఇలా పేదలు, దళితులను ఎప్పుడూ మనుషులుగా చూడని చంద్రబాబు వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తుంటారు. మరోసారి ఆ భావజాలాన్ని బహిరంగంగా బయటపెట్టుకున్నారు. తన అగ్ర కుల దురహంకారాన్ని నిస్సిగ్గుగా ప్రదర్శించి శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులును అవమానించారు. టిప్పర్ డ్రైవర్ ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అంటూ పేదలు ఎన్నికల్లో పోటీకే పనికిరారనే రీతిలో వ్యాఖ్యలు చేశారు. ఒక బహిరంగ సభలో ఓ దళిత ఎమ్మెల్యే అభ్యర్థిని కించపరిచేలా చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యలు యథాలాపంగా చేసినవి కావని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని దళిత సంఘాల నేతలు, పేదలు, మేధావులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. దళితులు, పేదలంటే జీర్ణించుకోలేని తనంతోనే ఆయన ఇలా మాట్లాడారని అంటున్నారు.

ఎన్ని జన్మలెత్తినా బాబుకిది ఒంటపట్టదు

కష్టపడి రాజకీయాల్లో పైకి వచ్చిన వ్యక్తులకు మాత్రమే సామాన్యులు, దళితుల గురించి ఆలోచించే శక్తి ఉంటుందని, వెన్నుపోటు రాజకీయాలతో సీఎం కుర్చీ ఎక్కిన చంద్రబాబుకు ఎన్ని జన్మలెత్తినా ఆ జ్ఞానం ఒంటపట్టదని దళిత మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్ల రాజకీయంలో చంద్రబాబు నిరుద్యోగాన్ని పెంచిపోషించినందునే ఎందరో దళిత బిడ్డలు టిప్పర్ డ్రైవర్లుగా, కూలీలుగా మిగిలిపోయారంటున్నారు. పార్టీలకతీతంగా దళితులు, మేధావులు ఏకతాటిపైకి వచ్చి బాబు కుల దురహంకారాన్ని ఎండగడుతున్నారు. బాబే గొప్పగా పాలించి ఉంటే.. ఉన్నత చదువులు చదివిన వీరాంజనేయులు టిప్పర్ డ్రైవర్‌గా ఎందుకు పని చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని నిలదీస్తున్నారు.

దళితులకు బాబు వెన్నుపోటు

చంద్రబాబు రాష్ట్ర నాయకుడిగా కాకుండా కుల నాయకుడిగా వ్యవహరిస్తున్నారంటూ దళిత సంఘాలు తూర్పారబడుతున్నాయి. దళితులను వేలిముద్ర గాళ్లు, డ్రైవర్లు అంటూ ఎగతాళిగా మాట్లాడి నీచ సంస్కృతికి తెగబడ్డారంటూ బాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో దళితులను, దళిత నాయకులను ఓట్ల కోసం వాడుకుని వదిలేసిన ఘనత చరిత్ర చంద్రబాబుదని, అందుకే దళితులెవ్వరూ ఆయన్ని నమ్మకపోవడంతో పనిగట్టుకుని వారినే కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎందరో దళితులు రాష్ట్రానికి, దేశానికి మహోన్నత సేవలందిస్తే.. చంద్రబాబు చులకన భావంతో మాట్లాడటం సిగ్గుచేటని మేధావులు వాపోతున్నారు. ఇప్పటికే దళితులు, పేదలు చంద్రబాబు నయవంచక హామీలకు బలైపోయారని, మళ్లీమళ్లీ ఆ వర్గాలనే కించపరుస్తూ మాట్లాడుతున్నారని మండిపడుతున్నారు.

డ్రైవర్లంటే అంత చులకనా?

చంద్రబాబు వ్యాఖ్యలతో రాష్ట్రంలోని డ్రైవర్లలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. టిప్పర్ డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు దేనికీ పనికిరారనట్టుగా చంద్రబాబు వ్యాఖ్యానించడాన్ని రాష్ట్రవ్యాప్తంగా డ్రైవింగ్ వృత్తితో జీవిస్తున్న వారు తీవ్రంగా తప్పుబడుతున్నారు. లక్షలాది మంది డ్రైవర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు. ప్రజా రవాణాలో డ్రైవర్ వ్యవస్థ అత్యంత కీలకమైదని, తమను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే భవిష్యత్తు పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని డ్రైవర్ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

డ్రైవర్లంటే చులకనా?



మేం ఉపాధి కోసం డ్రైవింగ్ రంగాన్ని ఎంచుకొని కుటుంబాలను పోషిస్తున్నాం. అంత మాత్రాన చులకనగా మాట్లాడతారా? ఇందుకు చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. సామాన్యులను సైతం అందలం ఎక్కిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌ది. దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని అమలు చేసి డ్రైవర్లను ఆదుకున్నారు. ఈ ఎన్నికల్లో మేమంతా వైఎస్ జగన్ వెంటే ఉంటాం.

– సాకే లోకనాథ్ , టిప్పర్ డ్రైవర్, శింగనమల, అనంతపురం జిల్లా

అవమానించడం బాధాకరం



లారీ డ్రైవర్లు, టిప్పర్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లను అవమానించేలా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శింగనమలలో వ్యాఖ్యలు చేయడం బాధాకరం. వయసు మళ్లిన ఆయనకు ఎవరి గురించి ఏం మాట్లాడాలో తెలియక ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరం ఆయనకు, ఆయన పార్టీకి సరైన శాస్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కేతా శ్రీనివాసులురెడ్డి, లారీ డ్రైవర్, ముత్తుకూరు గ్రామం, అనంతసాగరం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఇందుకు చంద్రబాబే సిగ్గు పడాలి



ఎస్సీ వర్గీయుడైన వీరాంజనేయులు ఎంఏ, బీఈడీ చేశారు. చంద్రబాబు హయాంలో ఉద్యోగం రాక, టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. అందుకు చంద్రబాబే సిగ్గుపడాలి. ఉన్నత చదువులు చదివి, కష్టించి పని చేసుకుంటున్న వీరాంజనేయులును చట్ట సభలకు పంపాలన్న ఉన్నత లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీ శింగనమల టికెట్ ఇచ్చారు. ఎవరి వృత్తి వారికి పవిత్రమైనది. డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను అందరూ గౌరవించాలి. చంద్రబాబుకు ఆ మనసే లేదు.

– జొన్నలగడ్డ చంద్ర, క్యాబ్ డ్రైవర్, తెనాలి

పేదల్ని గుర్తించిన నాయకుడు సీఎం జగన్




మాలాంటి పేదల్ని గుర్తించి, మాకు అన్ని విధాలుగా అండదండలు అందిస్తున్న నాయకుడు సీఎం జగన్. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారు. చట్ట సభల్లో కూడా డ్రైవర్లకు స్థానం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. డ్రైవర్ల ప్రతినిధిగా సీఎం జగన్ గుర్తించిన వ్యక్తి పట్ల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చాలా నీచమైనవి. చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతాం.

– ఉస్సేన్‌బాషా, ఆటో డ్రైవర్, పుట్టపర్తి

చట్ట సభలకు సామాన్యుడు పోటీ చేస్తుంటే అంత చులకనా

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఒంగోలు: చట్ట సభలకు సామాన్యుడు పోటీ చేస్తుంటే చంద్రబాబుకు ఎందుకంత చులకన అని సంతనూతలపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ టీజేఆర్ సుధాకర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్యుడ్ని సైతం చట్ట సభలకు పంపాలనే ఒక మంచి సంకల్పంతో సీఎం జగన్ శింగనమల స్థానానికి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు. దీనిని స్వాగతించాల్సింది పోయి, అవహేళన చేయడం చంద్రబాబు నీచత్వానికి నిదర్శనమని చెప్పారు. రాజకీయ సంస్కరణలు తేవాలని, సామాన్యులు సైతం చట్టసభల్లోకి ప్రవేశించాలని సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తుంటే చంద్రబాబుకు బాధగా ఉందన్నారు. గతంలో కూడా చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు, బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ఆదినారాయణరెడ్డి దళితులపట్ల అవమానకరంగా మాట్లాడారని, వారి వ్యాఖ్యలు నేటికీ ప్రతి ఒక్కరికీ ఆగ్రహాన్ని కలిగిస్తూనే ఉన్నాయని తెలిపారు. చెప్పులు కుట్టే అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడు అయ్యారని, దక్షిణాఫ్రికాలో అణచివేతకు గురైన నెల్సన్ మండేలా ఆ దేశాధ్యక్షుడు అయ్యారని చెప్పారు. మన రాష్ట్రంలోనూ చంద్రబాబు ప్రభుత్వంలో అనేక అవస్థలకు గురైన సామాన్య నాయకుడు నందిగం సురేష్‌ను సీఎం జగన్ ఏకంగా ఎంపీగా చేశారని అన్నారు. టిప్పర్ డ్రైవర్ పోటీలోకి దిగడాన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు సరైన గుణపాఠం చెప్పేందుకు డ్రైవర్లంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున ఒక్కరైనా సామాన్యుడు ఉన్నారా అని ప్రశ్నించారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లు, కార్పొరేట్ శక్తులు, బడా వ్యాపారులు తప్ప సామాన్యుడు ఎక్కడ ఉన్నారో చెప్పాలన్నారు. చంద్రబాబు పెత్తందారీ విధానానికి ఇదే నిదర్శనమని చెప్పారు. చంద్రబాబు ఈ ఎన్నికల్లో గెలిచి చట్టసభలోకి అడుగుపెడతారో లేదో తెలీదు కానీ, వీరాంజనేయులు మాత్రం గెలిచి అసెంబ్లీలో కూర్చుంటారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రజలకేమి చేసిందని ప్రశ్నించారు. ప్రపంచాన్ని తలదన్నే రాజధాని, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ ఏమయ్యాయన్నారు. వాటికి సమాధానం చెప్పాకే ఓట్లడగాలన్నారు. సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో వృద్ధి సాధించిందని, ఏ నియోజకవర్గంలోనైనా, ఏ గ్రామంలోనైనా వీటిపై పరిశీలనకు సిద్ధమని చంద్రబాబుకు సవాల్ విసిరారు.

బాబు తీరుపై నేతలు కుతకుత

- ఉమ్మడి అనంతలో ఒక్క సీటూ ముస్లింలకు ఇవ్వలేదని మైనార్టీల ఆగ్రహం
- తన టికెట్‌కు చంద్రబాబే అడ్డుపడ్డారన్న పరిపూర్ణానంద
- హిందూపురం పార్లమెంటు పరిధిలో అసెంబ్లీ అభ్యర్థులు మారే అవకాశం
- తమకే టికెట్ వస్తుందని పల్లె, గుండుమల ధీమా

సాక్షి ప్రతినిధి, అనంతపురం /సాక్షి, పుట్టపర్తి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క ముస్లిం మైనార్టీకి కూడా తెలుగుదేశం పార్టీ టికెట్ ఇవ్వకపోవడంపై మైనార్టీలు బాబుపై మండిపడుతున్నారు. ఈ నెల 28న చంద్రబాబు కదిరి పర్యటనలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రాష్ట్రం కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నా అనగానే..సభలోనే ఉన్న పలువురు మైనార్టీలు 'నీ స్వార్థం కోసం బీజేపీతో పొత్తుపెట్టుకున్నావ్' అంటూ ముఖం మీదే చెప్పేశారు. దీంతో చంద్రబాబు కంగుతిన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2014లో మైనార్టీకి టికెట్ ఇచ్చింది. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో కూడా కదిరిలో మైనార్టీకి ఇచ్చారు. కానీ టీడీపీ మాత్రం 14 నియోజకవర్గాలున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత నాలుగు ఎన్నికల్లో ఒక్క టికెట్ కూడా మైనార్టీలకు ఇవ్వలేదు.

ఇదిలాఉండగా, కొన్ని నెలలుగా హిందూపురం పార్లమెంటు స్థానానికి బీజేపీ తరఫున పోటీ చేయాలని పరిపూర్ణానంద స్వామి గట్టిగా ప్రయత్నించారు. చివరి వరకు తానే ఎంపీ అభ్యర్థినని చెప్పుకున్నారు. చివరి నిముషంలో ఆయనకు టికెట్ దక్కలేదు. దీంతో పరిపూర్ణానంద అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. తనకు టికెట్ రాకుండా బీజేపీ పెద్దల దగ్గర చంద్రబాబే ఇదంతా చేశారని బహిరంగంగా విమర్శించారు. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేసి తీరతానని స్పష్టం చేశారు.

తొలగని గందరగోళం

ఎన్నికలు సమీపిస్తున్నా టీడీపీలో అభ్యర్థుల మార్పులతో అయోమయం నెలకొంది. హిందూపురం పార్లమెంటు పరిధిలో ఇప్పటికే ఒక సీటు మారింది. మరో రెండు సీట్లు మారుతాయని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నారు. నకిలీ డీడీల కుంభకోణం కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేయడంతో కదిరి నుంచి కందికుంట వెంకట ప్రసాద్ పేరు ఫైనల్ చేశారు. తొలి జాబితాలో ఆయన సతీమణి యశోదాదేవి పేరు చేర్చిన సంగతి తెలిసిందే. త్వరలో మడకశిర, పుట్టపర్తిలో కూడా అభ్యర్థుల మార్పు ఉంటుందని చెబుతున్నారు. ఎస్సీ రిజర్వుడు స్థానమైన మడకశిరలో గుండుమల తిప్పేస్వామిదే పెత్తనం. అయితే ఆయన వ్యతిరేక వర్గానికి చెందిన డాక్టర్ సునిల్‌కుమార్‌కు టికెట్ ఇచ్చారు. దీంతో గుండుమల అలకబూనారు. త్వరలోనే మడకశిర టీడీపీ సీటు మార్పు ఉంటుందని, గుండుమలకే టికెట్ వస్తుందని ఆయన వర్గీయులు ప్రచారం చేస్తున్నారు.

మామకా.. కోడలికా..?

పుట్టపర్తి సీటును అనూహ్యంగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరారెడ్డికి కేటాయించారు. అయితే తొలి రోజు నుంచే ఆమె ప్రచారంలో విఫలమయ్యారు. నామినేషన్ల దాఖలు సమయానికి తానే రంగంలోకి దిగుతానని కార్యకర్తలతో పల్లె చెబుతున్నారు. మరోవైపు అభ్యర్థిని మారిస్తే టీడీపీలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న వడ్డెర్లకు టికెట్ ఇవ్వాలని ఆ వర్గం అధిష్టానం వద్ద పట్టుబడుతోంది.

కుల అహంకారి బాబుకు రాజకీయ సమాధి కడదాం

- దళితులను పదేపదే ఎగతాళి చేస్తున్న బాబుకు బుద్ధి చెబుతాం
- వేలిముద్రగాళ్లు, డ్రైవర్లంటూ దళితులను చులకన చేస్తారా?
- చంద్రబాబు రక్తంలోనే కులపిచ్చి ఉంది
- ఎంపీ నందిగం సురేష్ ధ్వజం



సాక్షి, అమరావతి: దళితులు వేలిముద్రగాళ్లని, డ్రైవర్లు అని ఎగతాళి చేస్తూ కుల అహంకారంతో విర్రవీగిపోతున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు రాజకీయంగా సమాధి కడదామని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ పిలుపునిచ్చారు. చంద్రబాబు రక్తంలోనే కుల పిచ్చి ఉందని, అందుకే దళితుల్ని పదే పదే అవమానిస్తున్నారని చెప్పారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని నాడు అవమానించారని, ఇప్పుడు సీఎం జగన్ ఎస్సీ వ్యక్తికి ఎమ్మెల్యే సీటిస్తే వేలిముద్రగాళ్లకూ సీట్లంటూ ఎగతాళి చేస్తున్నారని, ఎస్సీల పట్ల ఆయనకున్న భావాన్ని మరోసారి బయట పెట్టుకున్నారని చెప్పారు. ఎంపీ సురేష్ శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించారు. ఎడమ చేత్తో వేలి ముద్ర వేసే వాళ్లు టిప్పర్ డ్రైవర్లంటూ ఓ ఎస్సీ నాయకుడి గురించి ఎగతాళిగా మాట్లాడిన చంద్రబాబు నీచ సంస్కృతికి ఇంతకన్నా వేరే నిదర్శనం అవసరం లేదన్నారు. ఎస్సీలు రాజకీయ నాయకులుగా ఎదగకూడదన్నదే ఆయన భావన అని చెప్పారు. పేదోడి పట్ల ప్రేమ చూపించే సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు.

దళితులు, డ్రైవర్లంటే అంత చిన్నచూపా?

దళితులకు రాజకీయ పదవులొస్తే చంద్రబాబుకు ఎందుకంత కడుపు మంట అని సురేష్ ప్రశ్నించారు. 'టిప్పర్, ఆటో డ్రైవర్లు దేనికీ పనికిరారనట్టు బాబు మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో, టిప్పర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. బాబు, లోకేశ్, ఆయన కోడలి కార్లు నడుపుతున్నవారంతా డ్రైవర్లు కాదా? వాళ్లు లేకపోతే రాష్ట్రంలో అనేక వ్యవస్థలకు ఒక్క పూటా గడవదు. ఆర్టీసీ, రవాణా వ్యవస్థలైనా డ్రైవర్ల మీద ఆధారపడే నడుస్తున్నాయి. చంద్రబాబు వీరందరినీ అవమానించినట్టే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులకో, డ్రైవర్లకో చంద్రబాబులాగా మోసాలు చేయడం, వెన్నుపోటు పొడవడం తెలియదు. ఆయనకున్న నీచ సంస్కృతికి మేం ఆమడ దూరంలో ఉంటాం. నీకులాగా తిరుపతిలో జేబులు కొట్టి బతకడం మావల్ల కాలేదు. నమ్మినోడిని వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేజిక్కించుకుని సొంత తమ్ముడ్ని ఇంట్లో కట్టేసి చిత్రహింసలు పెట్టే కిరాతకులం కాదు' అంటూ ధ్వజమెత్తారు. 'ఓ ఎస్సీ, పేదవాడైన టిప్పర్ డ్రైవర్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటిస్తే చంద్రబాబుకు ఆ దళితుడి పట్ల అంత చిన్నచూపా? బాబుదృష్టిలో దళితులు ఎమ్మెల్యేలుగా పనికిరారా? ఎన్నిసార్లు దళితులను అవమానిస్తావు? నీ కులంలో పుట్టిన నీ తండ్రే గొప్పోడా? చంద్రబాబు తండ్రి చిన్న రైతుగా వ్యవసాయం చేసినోడే కదా! అమెరికాలో పెద్ద కార్పొరేట్ కంపెనీ వ్యవస్థ నడపలేదు కదా? ఆయన వేలిముద్రతో పుట్టలేదా? నీ కులంలో పుట్టినోడు గొప్పోడు ఎలా అయ్యాడు? మా ఎస్సీల్లో, ఎస్టీల్లో పుట్టిన వాడే వేలిముద్ర వేసే వ్యక్తిగా ఎలా తక్కువయ్యాడో చంద్రబాబు సమాధానం చెప్పాలి. రెండెకరాలతో రాజకీయంలోకి వచ్చినోడివి రూ.6 లక్షల కోట్లు ఎలా సంపాదించావు? నీ బతుకే 420 బతుకు అని గూగుల్‌లో కొట్టినా తెలుస్తుంది. నందమూరి కుటుంబాన్ని బొమ్మల్లా ఆడిస్తూ తెలుగుదేశం పార్టీని హస్తగతం చేసుకున్నావు. ఇన్నాళ్లూ దళిత, బీసీ, మైనార్టీల సొమ్ముతో బాగుపడ్డావు. ఇదే అమరావతి ప్రాంతంలో ఓ సామాన్య ఎస్సీ కార్యకర్తను నువ్వు కించపరిస్తే.. మా నాయకుడు సీఎం జగన్ అదే వ్యక్తిని ఎంపీని చేశారు. పేదోడి పట్ల సీఎం జగన్ ప్రేమ అది. దళితుల పట్ల చులకన భావంతో మాట్లాడే చంద్రబాబుకు మా చేతుల్లో రాజకీయ సమాధి ఖాయం' అని సురేష్ చెప్పారు.

క్లుప్తంగా...

వ్యాపారిపై టీడీపీ నేత దౌర్జన్యం



ఎగ్జిబిషన్ నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రాలను మీడియాకు చూపుతున్న కార్తీక్

నెహ్రూనగర్ : గుంటూరు నగరంలో ఆంధ్ర క్రైస్తవ కళాశాల(ఏసీ కాలేజీ) ఆధ్వర్యంలో నడుస్తున్న గుంట గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు అన్ని అనుమతులు తీసుకున్నప్పటికీ టీడీపీ నేత, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, అతని అనుచరులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారని కేఏస్ హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ ఫన్ ఫేర్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు జి.కార్తీక్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం గుంట గ్రౌండ్‌లో విలేకరులతో మాట్లాడారు. గుంటగ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహణకు ఏసీ కాలేజ్ కరస్పాండెంట్ పరదేశిబాబు, ప్రిన్సిపాల్ మోజెస్‌ల నుంచి అనుమతులు తీసుకున్నామని, కాలేజీ బ్యాంకు ఖాతాకు రూ 10.లక్షలు జమ చేసినట్టు తెలిపారు. మార్చి 15 నుంచి జూన్ 30 వరకు ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు అన్ని అనుమతులతో గ్రౌండ్ లోకి సామాన్లు తరలిస్తున్న సమయంలో నక్కా ఆనంద్‌బాబు అనుచరులు అడ్డుకుని గుంటగ్రౌండ్ తమ ఆధీనంలో ఉందంటూ వాగ్వాదానికి దిగుతున్నారని తెలిపారు. నాలుగు రోజుల కిందట గుంట గ్రౌండ్ ప్రధాన గేటును నక్కా ఆనంద్‌బాబు అనుచరులు ధ్వంసం చేశారంటూ ఫొటోలను మీడియాకు చూపారు. దీనిపై కొత్తపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసానికి నోటీసులు



తాడికొండ: టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు తాడికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) ఎం.గంగరాజు నోటీసులు జారీచేశారు. ఈ నెల 25న తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన టీడీపీ ప్రచార సభలో పెమ్మసాని మాట్లాడుతూ సద్దాం హుస్సేన్ బంకర్లో దాక్కొని ఉంటే తీసుకొచ్చి కుక్కను కొట్టినట్టు కొట్టి చంపారని చెప్పారు. దీనిపై ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా వేర్వేరుగా గుంటూరు జిల్లా ఎస్పీతోపాటు తాడికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. పెమ్మసాని చంద్రశేఖర్ ఓ వర్గం ఓట్లను చీల్చేందుకు ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వివరణ ఇవ్వాలంటూ పెమ్మసాని చంద్రశేఖర్‌కు గురువారం ఆర్వో నోటీసులు జారీచేశారు. కాగా, దీనిపై చంద్రశేఖర్ శుక్రవారం సాయంత్రం తన వివరణను ఆర్వోకు పంపినట్లు తెలిసింది.

సిగ్గు ఎగ్గూ అన్నీ ఒగ్గేసీ..

డ్వాక్రా సంఘాలు, రుణాలపై రామోజీ దిక్కుమాలిన రాతలు

ఫ్యాక్ట్ చెక్

హ.. హవ్వ! చదివిన వాళ్లు నవ్వుకుంటారే అని సిగ్గు ఎగ్గూ అన్నింటినీ 'ఈనాడు' వదిలేసింది. అధికారంలోకి వస్తే డ్వాక్రా (పొదుపు సంఘాల) రుణాలన్నీ (రూ.14,203.58 కోట్లు) భేషరత్తుగా మాఫీ చేస్తానని 2014 ఎన్నికల ముందు మాటిచ్చి ఆ తరువాత ఒక్క రూపాయీ మాఫీ చేయని చంద్రబాబు పాలనలో పొదుపు సంఘాల మహిళలందరూ ఓ వెలుగు వెలిగారట. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అప్పటికి (2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి) పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉన్న మొత్తం రూ.25,570.80 కోట్ల అప్పును వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలో అందజేస్తే.. పొదుపు సంఘాలను, మహిళలు నిలువునా మోసం చేయడమట. ఇలాంటి పచ్చి అబద్ధాలను రామోజీరావు తన 'ఈనాడు' పత్రికలో 'నాడు దర్జా- నేడు గజగజ, డ్వాక్రా సంఘాలకు తీరని ద్రోహం' అంటూ రోత రాతలు అచ్చేశారు. తమ ప్రభుత్వం డ్వాక్రా రుణ మాఫీ అమలు చేయని అంశాన్ని అప్పటి మంత్రి పరిటాల సునీత అసెంబ్లీలో లిఖిత పూర్వకంగా వెల్లడించినా.. ఆ అంశాన్ని రామోజీ తన రాతల్లో ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. - సాక్షి, అమరావతి

ఈనాడు అబద్ధం: 2014 -19 మధ్య టీడీపీ ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలకు ఉన్నతి పథకంలో రూ. 800 కోట్లు వడ్డీ లేకుండా రుణాలుగా ఇచ్చింది. అప్పును నెలవారీగా వాయిదాల్లో తిరిగి కట్టించుకునేది. మహిళా సాధికారితకు పెద్దపీట వేయడంలో తనను మించిన వారే లేరన్నట్టు గొప్పలు చెప్పుకునే జగన్.. ఈ ఐదేళ్లలో ఉన్నతికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

వాస్తవం: ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో 2.40 లక్షల మందికి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల మంది వడ్డీ లేని రుణాలను అందజేసింది. అదే చంద్రబాబు ప్రభుత్వంలో ఈ పథకం ద్వారా ఒక్కొక్కరి గరిష్టంగా కేవలం రూ. 30 వేల వరకు మాత్రమే రుణాలు ఇచ్చింది. గత తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్లు, అంతకు ముందు కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో నాలుగేళ్లు కలిపి మొత్తం తొమ్మిదేళ్లలో 1.67 లక్షల మందికి రూ. 800 కోట్లు ఈ పథకం ద్వారా రుణాలు ఇస్తే, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలోనే 2.40 లక్షల మందికి రూ. 900 **కోట్లకు** పైగా వడ్డీ లేని రుణాలు అందజేసింది. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరం (ఒక్క ఏడాది)లోనే దాదాపు రూ.200 కోట్లు ఇచ్చింది.

ఈనాడు అబద్ధం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సున్నా వడ్డీ రాయితీలోనూ కోత పెట్టింది.

వాస్తవం: బ్యాంకులో రుణం తీసుకొని సకాలంలో కిస్తీల వారీగా చెల్లించే పొదుపు సంఘాల మహిళలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల్లో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా వారి రుణాలపై వడ్డీ రూ.4969.05 కోట్లు చెల్లించింది. ఆర్థిక ఏడాది ముగిసిన వెంటనే ఠంచన్‌గా సున్నా వడ్డీ పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసింది. దీని ద్వారా ఏటా 1.05 కోట్ల మంది మహిళలు ప్రయోజనం పొందారు. ఇంకోవైపు.. చంద్రబాబు ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో చివరి మూడు సంవత్సరాలు 2016 ఆగస్టు తర్వాత కాలానికి సున్నా వడ్డీ పథకానికి నిధులే ఇవ్వలేదు. 'ఈనాడు' తన కథనంలోనే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం సున్నా వడ్డీ పథకానికి నిధులు ఇవ్వలేదని అంగీకరించింది కూడా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అమలులో ఉన్న ఈ పథకానికి నిధులే విడుదల చేయలేదు. అదే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సున్నా వడ్డీ పథకాన్ని తిరిగి అమలు చేస్తూనే.. నవరత్నాల కార్యక్రమాలు ద్వారా కూడా అదనపు లబ్ధి చేకూర్చింది.



ఈనాడు అబద్ధం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'మిత్ర'లకు తీరని ద్రోహం చేసింది.

వాస్తవం: రాష్ట్రంలో కోటి మందికి పైగా మహిళలు పొదుపు సంఘాలలో సభ్యులుగా ఉన్నారు. ఆ కోటి మందిలో ఓ రెండు మూడు వేల మందిని అప్పటి టీడీపీ ప్రభుత్వం బీమా మిత్రలుగా నియమించింది. ఆ నియామకాలు కూడా అప్పటి జన్మభూమి కమిటీ సభ్యుల తరహాలోనే జరిగాయి. తమ పరిధిలో దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే వారికి ప్రభుత్వం ఇచ్చే బీమా సొమ్ములో కనీసం పది శాతం లంచంగా తీసుకున్నారన్న ఆరోపణలూ ఉండేవి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన అనంతరం ఇప్పుడు ఈ కార్యక్రమాలను వారి ఆధ్వర్యంలో పారదర్శకంగా జరిపిస్తోంది. బీమా లబ్ధిదారుల నుంచి ఒక పైసా కూడా వసూలు చేయకుండా అందిస్తున్నారు. బీమా ప్రీమియాన్ని కూడా పూర్తిగా రద్దు చేసింది.

41ఏ నోటీసు ఇచ్చినా.. ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవచ్చు

అలాంటి పిటిషన్‌కు విచారణార్హత ఉంది • జస్టిస్ మల్లికార్జునరావు స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: ఏదైనా కేసులో విచారణ నిమిత్తం సీఆర్‌పీసీ సెక్షన్ 41 ఏ కింద నోటీసులు ఇచ్చినప్పటికీ, అరెస్ట్ గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ నిందితులు దాఖలు చేసే ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. 41ఏ నోటీసు ఇచ్చారు కాబట్టి, అరెస్ట్ ఆందోళనతో దాఖలు చేసే ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించకుండా న్యాయస్థానాలు తప్పించుకోజాలవని తేల్చి చెప్పింది. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, వైద్యురాలు డాక్టర్ నర్రెడ్డి సునీతలను దూషించిన కేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ భూషణ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అతనికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. నకిలీ ఐడీలను సృష్టించి వైఎస్ షర్మిల, సునీతలను దూషిస్తూ పోస్టులు పెట్టారంటూ రవీంద్రరెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖపట్నానికి చెందిన ఉదయ్ భూషణ్ అనే వ్యక్తిని ఈ కేసులో నిందితునిగా చేర్చారు. విచారణ నిమిత్తం హాజరు కావాలంటూ అతనికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇచ్చారు. దీంతో ఉదయ్ భూషణ్, పోలీసులు తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందువల్ల తనకు ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు విచారణ జరిపారు. ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) వ్యతిరేకించారు. 41ఏ కింద నోటీసు ఇచ్చామని తెలిపారు. అలాంటప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇలా దాఖలు చేసే పిటిషన్‌కు ఎంత మాత్రం విచారణార్హత లేదని తెలిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది ఉమేష్ వాదనలు వినిపిస్తూ, ఉదయ్ భూషణ్‌ను పోలీసులు పులివెందుల తీసుకెళ్లి వేధింపులకు గురి చేశారని తెలిపారు. ఫిర్యాదుదారు పోలీస్‌స్టేషన్‌లోనే పిటిషనర్‌ను బెదిరించారన్నారు. అరెస్ట్ గురించి ఆందోళన ఉన్నప్పుడు 41ఏ నోటీసు ఇచ్చినప్పటికీ, ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని రామప్ప కేసులో కర్ణాటక హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఆ తీర్పును పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, పిటిషనర్ ఉదయ్ భూషణ్‌కు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. 3 నెలల పాటు ప్రతి 15 రోజులకొకసారి కడప జిల్లా ఎస్పీ ముందు హాజరు కావాలని ఆదేశించారు.

టికెట్ల పేరుతో రూ.కోట్లు వసూలు

- భీమిలి, అనకాపల్లి టీడీపీ సీట్లు ఆశించిన ఇద్దరు నేతలు
- రూ. 30 కోట్లు ఇచ్చిన దిలీప్ చక్రవర్తి.. రూ.20 కోట్లు ఇచ్చిన బంగార్రాజు
- ఇద్దరికీ బాబు మొండిచేయి
- కూటమి కోటాలో సీఎం రమేష్... పట్టుబట్టి భీమిలి సాధించుకున్న గంటా
- లబోదిబోమంటున్న బాధిత నేతలు.. డిపాజిట్లను వెనక్కి ఇవ్వాలంటూ ఒత్తిడి



గంటా శ్రీనివాసరావు



సీఎం రమేష్



దిలీప్ చక్రవర్తి



బంగార్రాజు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీలో సీట్ల కేటాయింపు ముగియడంతో....టికెట్లు ఆశించి భారీగా డబ్బు మూటలను అప్పగించిన నేతలు ఇప్పుడు లబోదిబో మంటున్నారు. తమకు సీటు వస్తుందనుకుని భారీగా నగదు డిపాజిట్ చేశామని... ఇప్పుడు సీటు లేకపోవడంతో తమ పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. భీమిలి సీటును ఆశించి... ఫండ్ కింద బంగార్రాజు అనే వ్యక్తి రూ. 20 కోట్ల మేర నిధులిచ్చినట్టు తెలిసింది. గంటా శ్రీనివాసరావును చీపురుపల్లికి పంపుతున్నామని... భీమిలి సీటు నీదేనని టీడీపీ పెద్దలు నమ్మబలికినట్టు తెలిసింది. అయితే, చివరకు పట్టుబట్టి మరీ భీమిలి సీటును గంటా సాధించుకున్నారు. మరోవైపు అనకాపల్లి ఎంపీ టికెట్ రేసులో ఉన్న దిలీప్ చక్రవర్తి కూడా తనదే సీటు అనుకుంటూ భారీగా ఖర్చు చేశారు. టికెట్ కోసం రూ.30 కోట్ల మేర డిపాజిట్ కూడా చేసినట్టు ప్రచారం జరుగుతోంది. తీరా కూటమి కోటాలో బీజేపీ తరపున సీఎం రమేష్‌కు సీటు పోయింది. ఈ నేపథ్యంలో తాము ఇచ్చిన డబ్బుల సంగతేమిటంటూ టీడీపీ పెద్దలను నిలదీస్తున్నట్టు తెలుస్తోంది.

కూటమి సభ బంగార్రాజు పుణ్యమే!

వాస్తవానికి టీడీపీ, జనసేన పొత్తు తర్వాత మొదటి సభ రాజాపులోవలో జరిగింది. భీమిలి నియోజకవర్గాన్ని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో జరుగుతున్న సభ కావడంతో.. భీమిలి సీటు ఆశించిన బంగార్రాజుపైనే టీడీపీ నేత నారా లోకేశ్ మొత్తం భారం వేశారు. భీమిలి సీటు పక్కాగా నీదేనని.... గంటాకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని స్వయంగా లోకేశ్ కూడా చెప్పడంతో బంగార్రాజు రెట్టించిన ఉత్సాహంతో సభ కోసం ఖర్చు చేసినట్టు పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. మరోవైపు అనకాపల్లి ఎంపీ టికెట్ కోసం దిలీప్ చక్రవర్తి కూడా భారీగానే ఖర్చు చేసుకుంటూ వెళ్లారు. దీంతో పాటు రూ. 30 కోట్ల మేర డిపాజిట్ కూడా చేశారు. తీరా సీటు లేకపోవడంతో తన పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు.


ఐవీఆర్ఎస్ పేరుతో..

భీమిలి సీటు మీదేనంటూ మొదట్లో భారీగా ఖర్చు పెట్టించిన టీడీపీ పెద్దలు... తీరా సీట్ల కేటాయింపు వచ్చే సరికి సర్వేలో మొదటిస్థానంలో నిలవాలంటూ మొదట్లో మెలికలు పెట్టారు. ఇందుకోసం మీ పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా వీరి పేర్లతో కొద్దిరోజులు సర్వే పేరుతో నియోజకవర్గ ప్రజలకు ఫోన్లు వచ్చాయి. చివరకు సీట్ల కేటాయింపులో మొండిచేయి చూపారు. ఇదేమిటని ప్రశ్నిస్తుంటే.... సర్వేలో రాలేదని చెబుతున్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ, రాజ్యసభ వంటి పదవులు అప్పగిస్తామని ఆశలు చూపుతున్నారు. తమ మొత్తాన్ని తమకు తిరిగి ఇవ్వాలంటూ నాయకులు ఒత్తిడి తెస్తుండగా.... ఎన్నికల తర్వాత నగదు వ్యవహారాన్ని చూద్దామని దాటవేస్తున్నట్టు తెలిసింది.

టీడీపీ, జనసేనకు వరుస షాక్‌లు!


ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమిని వీడుతున్న ముఖ్య నేతలు

- తాడేపల్లిగూడెంలో మాజీ ఎమ్మెల్యే ఈలి నాని టీడీపీకి గుడ్‌బై
- ఆయన దారిలోనే నూజివీడు మాజీ ఎమ్మెల్యే రామకోటయ్య
- ఫ్యాన్ గూటికి చేరేందుకు క్యూ కడుతున్న ఆ నేతలు




సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ, జనసేనలకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆయా పార్టీల అధిష్టానం తీసుకుంటున్న నిర్ణయాలకు మనస్తాపం చెందిన నాయకులంతా వరుసగా గుడ్‌బై చెబుతున్నారు. ఆయా పార్టీల్లో ఎన్నాళ్లుగానో ఉంటూ కోట్లు ఖర్చుచేసి పార్టీ పటిష్టత కోసం పనిచేసినా టిక్కెట్ దక్కకపోవడం, అవమానాలకు గురికావడంతో కూటమిని వీడుతున్నారు. జనసేన, టీడీపీలో డబ్బులే ప్రామాణికంగా తీసుకుని టిక్కెట్లు కేటాయించడంపై వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెం టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకట మధుసూదనరావు(నాని)కు తెలుగుదేశం పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడం, పైగా ఆయన్ను అవమానించేలా వ్యవహరించడంతో ఆయన ఆ పార్టీని వీడారు. నియోజకవర్గంలో బలమైన నేతగా ఎదిగిన మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య టికెట్ విషయంలో తనకు అన్యాయం చేయడంతో ఆయన కూడా టీడీపీనుంచి బయటకు వచ్చారు. అవసరానికి తనను వాడుకుని కోట్లాదిరూపాయల ఆస్తులు పార్టీకోసం వెచ్చించిన తనకు చివరి నిమిషంలో ఎంపీ టికెట్ నిరాకరించడంతో ఎన్ఆర్ఐ గొరుముచ్చు గోపాల్ యాదవ్ టీడీపీని వీడారు. ఇక జనసేన పార్టీకోసం అహర్నిశలు కృషి చేసి... పార్టీ పురోభివృద్ధికి కృషి చేసినప్పటికీ తమను పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలు అవలంబిస్తుండటంతో చేగొండి సూర్యప్రకాశ్, నౌడు వెంకటరమణ ఆ పార్టీకి రాంరాం చెప్పారు. కాంగ్రెస్ విధానాలు నచ్చకపోవడంతో శెట్టి గురునాథం ఆ పార్టీని వీడారు. తాజాగా ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన జనసేన నేత పితాని బాలకృష్ణ కూడా శెట్టిబలిజలకు ప్రాధాన్యం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ ఆ పార్టీనుంచి బయటకు వచ్చారు. వారంతా వైఎస్సార్‌సీపీలో చేరేందుకు క్యూ కట్టారు. ప్రధానంగా తాడేపల్లిగూడెం, ఆచంట, ఉంగుటూరు, నూజివీడు, చింతలపూడి, పోలవరంలో ముఖ్య నేతలు ఇవే కారణాలతో నేరుగా పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఇక నియోజకవర్గ స్థాయిలో అయితే నిత్యం పెద్ద సంఖ్యలో వచ్చి చేరుతున్నారు. బీసీలకు పట్టం కట్టడం, గడచిన ఐదేళ్లలో సంక్షేమ పాలన ప్రతి గడపకు చేరడంతో పార్టీకి ఆకర్షితులై పెద్ద ఎత్తున వలసలు కొనసాగుతున్నాయి.

ఈలి నానితో మొదలై..



తాడేపల్లిగూడెం టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకట మధుసూదనరావు(నాని) ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నియోజకవర్గంలో ఈలి కుటుంబానికి మంచి పేరుంది. ఆయన తండ్రి ఈలి ఆంజనేయులు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఆయన భార్య వరలక్ష్మి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేశారు. ఆంజనేయులు ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. నాని 2009లో ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఒక పర్యాయం పనిచేశారు. రాజకీయంగా నియోజకవర్గంలో మంచి పేరుంది. 2019లో టీడీపీ టికెట్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. సుదీర్ఘ నేపథ్యం ఉన్నప్పటికీ పార్టీ అవమానకర రీతిలో వ్యవహరించడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి.



- నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య 2009లో ప్రజారాజ్యం పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గంలో బలమైన నేతగా గుర్తింపు ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఆ పార్టీ టికెట్ విషయంలో పరాభవం చెందడంతో వైఎస్సార్‌సీపీలో చేరారు.



- మాజీ ఎంపీ చేగొండి హరి రామజోగయ్య తనయుడు చేగొండి సూర్యప్రకాష్ జనసేన పార్టీలో ఆచంట ఇన్‌చార్జిగా పనిచేశారు. పార్టీలో ప్రాధాన్యం లేకపోవడం, ఇతర కారణాలతో జనసేనను వీడి ఫ్యాన్ గూటికి చేరారు.



- ఉంగుటూరులో జెడ్పీటీసీగా రాజకీయం ప్రస్థానం ప్రారంభించిన నౌడు వెంకటరమణ 2019లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తరువాత రాజకీయంగా అక్కడ ప్రాధాన్యమివ్వకపోవడంతో ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరారు.
- జంగారెడ్డిగూడెంలో బలమైన కాంగ్రెస్ నేతగా గుర్తింపు ఉన్న జెట్టి గురునాథం పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లో మంచి పట్టు సాధించారు.




ఆయన కూడా కాంగ్రెస్ విధానాలు నచ్చక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరారు.

టీడీపీలో అవమానాలు ఎదుర్కొన్న గోపాల్



టీడీపీ ఎంపీ టిక్కెట్ ఆశావహి, ఎన్ఆర్ఐ గొరుముచ్చు గోపాల్ యాదవ్‌కు టీడీపీలో అడుగడుగునా అవమానాలు ఎదురయ్యాయి. సింగపూర్‌లో వ్యాపారం చేసుకుంటున్న ఆయన్ను పిలిచి మరీ టిక్కెట్ నీదే, ఖర్చుకు వెనుకాడకుండా పనిచేయమని చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేశ్ చెప్పడంతో ఏడాది నుంచి ఏలూరు పార్లమెంట్ సీటు లక్ష్యంగా చేసుకుని విస్తృతంగా పనిచేశారు. యువగళం మొదలుకొని, చంద్రబాబు బహిరంగ సభల వరకు అనేక కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ఖర్చుచేశారు. చివరికి హ్యాండ్ ఇచ్చి యనమల అల్లుడు పుట్టా మహేష్ యాదవ్‌కు టిక్కెట్ ఇచ్చారు. మనస్తాపానికి గురైన గోపాల్ యాదవ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల వేళ కీలక నేతల రాకతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో కొత్త జోష్ నెలకొంది.

టికెట్లు అమ్ముకున్న పవన్: పితాని



సమావేశంలో జనసేనకు చేసిన రాజీనామా పత్రాన్ని చూపుతున్న బాలకృష్ణ

ముమ్మిడివరం: జనసేన పార్టీలో కష్టపడినవారికి కాకుండా ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్, పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్ కలసి టికెట్లు అమ్ముకున్నారని తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు ముమ్మిడివరం జనసేన పార్టీ కార్యాలయంలో సానబోయిన మల్లికార్జునరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకోసం కోట్లాదిరూపాయల ఆస్తిని అమ్ముకున్న తనకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కోసం పార్టీని ఏర్పాటు చేశానని చెప్పి, శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన ఏ ఒక్కరికీ టికెట్ ఇవ్వకపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని వాపోయారు. అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో శనివారం చేరనున్నట్టు ప్రకటించారు. కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషుల అభీష్టం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. నాదెండ్ల మనోహర్ వల్లే జనసేన పార్టీ సర్వనాశనం అయిందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశిస్తే ముమ్మిడివరంలో పొన్నాడ సతీష్‌కుమార్‌తో పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని పితాని తెలిపారు. జనసేన పార్టీ అభ్యర్థులను ఓడించడమే తన ధ్యేయమని చెప్పారు. కాకినాడ మాజీ మేయర్ సరోజ కూడా నాదెండ్ల తీరుపై మండిపడ్డారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

దెందులూరు/నరసాపురం రూరల్/భీమవరం/పామూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమక్షంలో శుక్రవారం టీడీపీ నేతలు దడిగే నాగేంద్ర, వాసే శ్రీను, బొచ్చా ప్రసాద్, బొచ్చా ప్రవీణ్, కాకర్ల ప్రవీణ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలంలోని వేములదీవి ఈస్ట్ గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు జెల్లా చందయ్య, బలగం ఈశ్వరరావు, వనమాడి కృష్ణంరాజు, మల్లాడి శ్రీను, బియ్యపుతిప్పకు చెందిన సంగాని త్రిమూర్తులు తదితరులు చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని బీజేపీకి చెందిన వార్డు మాజీ కౌన్సిలర్ బొడ్డు దానయ్యతోపాటు 29,35,38 వార్డులకు చెందిన జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు 150 మంది ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం బోడవాడ పంచాయతీ అక్కంపేటలో 52 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి.



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సోమవరప్పాడు టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు తదితరులు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్‌కు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న గ్రంధి శ్రీనివాస్



కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ కుటుంబాలు


గుంతకల్లులో బాబు చిత్రపటాన్ని చెప్పుతో కొడుతున్న జితేందర్‌గౌడ్ వర్గీయులు


చీపురుపల్లిలో భవిష్యత్ గ్యారంటీ కరపత్రాలను తగులబెడుతున్న దృశ్యం


రాజంపేటలో టీడీపీ కరపత్రాలను దగ్ధం చేస్తున్న టీడీపీ వర్గీయులు

పసుపు పార్టీ ఉక్కిరి బిక్కిరి

- టీడీపీ తుదిజాబితాపై కార్యకర్తల్లో ఆగ్రహ జ్వాలలు
- అనంతపురంలో పార్టీ కార్యాలయానికి నిప్పు
- గుంతకల్లు కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం
- చంద్రబాబు చిత్రపటాన్ని చెప్పులతో కొట్టిన కార్యకర్తలు
- గుమ్మనూరు జయరాం టికెట్‌పై చెలరేగిన నిరసనలు
- సత్యవేడులో ఆదిమూలం మాకొద్దంటూ ర్యాలీ
- చీపురుపల్లి టీడీపీలో 'కళ'కలం
- అనపర్తిపై ఫలించని 'దేశం' రాయబారం
- తంబళ్లపల్లెలో ఆవిర్భావ దినోత్సవానికి వర్గపోరు
- రాజంపేటలో ఎగిసిపడిన అసంతృప్తి జ్వాలలు
- బద్వేలు టీడీపీ అభ్యర్థికే బీజేపీ సీటంటూ ఆగ్రహం
- 'గంటా'కు రూ. కోట్లున్నాయని టికెట్ ఇచ్చారంటూ ధ్వజం

సాక్షి, నెట్‌వర్క్: విపక్ష కూటమిలో ఏర్పడిన టికెట్ల ముసలం చల్లారేలా కన్పించడం లేదు. టికెట్ల కేటాయింపులో న్యాయం జరగలేదని ఎక్కడికక్కడ తెలుగు తమ్ముళ్ల నిరసనలు, ర్యాలీలతో రోడ్డెక్కుతున్నారు.టీడీపీ ఆఖరి జాబితాపై పార్టీలో అసంతృప్తి వెల్లువెత్తింది. అభ్యర్థులను మార్చాలంటూ ఫ్లెక్సీలు చించుతూ కరపత్రాలు తగలబెట్టారు. నెల రోజుల క్రితం గుమ్మనూరు జయరాంను చంద్రబాబు, లోకేశ్ తిట్టని తిట్టు లేదు. ఇప్పుడు ఆయనకే అనంతపురం జిల్లా గుంతకల్లు అసెంబ్లీ టికెట్ ఇచ్చారు. అనంతపురం అర్బన్ స్థానంలో సీనియర్ నేత ప్రభాకర్ చౌదరిని కాదని దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు టికెట్ కేటాయించారు. ఈ నేపథ్యంలో గుంతకల్లు, అనంతపురం నియోజకవర్గాల్లో అసంతృప్తి జ్వాలలు రగులుకున్నాయి. జయరాంకు టికెట్ కేటాయించినట్లు ప్రకటించగానే జితేందర్‌గౌడ్ వర్గీయులు ఆగ్రహించి పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం చేశారు. చంద్రబాబు చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ జయరాంకు పార్టీ అమ్ముడుపోయిందంటూ నినాదాలు చేశారు. అనంతపురం అర్బన్‌లో తన పేరు లేకపోవడంతో ప్రభాకర్ చౌదరి తన అనుచరులతో స్థానిక రామ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్‌ను బయటపడేసి కార్యకర్తలతో నిప్పు పెట్టించారు. ఫర్నీచర్ మొత్తం మంటల్లో కాలిబూడిదైంది. పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను ఆర్పేశారు. ఫ్లెక్సీలు, ఫొటోలు, కరపత్రాలు మంటల్లో కాలిపోయాయి.

చంద్రబాబు ఫ్లెక్సీలు, కరపత్రాలకు నిప్పు

పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కిల్లు రమేష్‌నాయుడును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించడంతో తెలుగు తమ్ముళ్లు ఆందోళనకు దిగారు. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి టికెట్ రాకపోవడంతో ఆమె అనుచరులు శుక్రవారం రాత్రి చంద్రబాబు ఫొటోలతో ఉన్న టీడీపీ ఫ్లెక్సీలు, కరపత్రాలకు నిప్పంటించారు. రమేష్‌నాయుడుకు సహకరించేది లేదని అధిష్టానాన్ని హెచ్చరించారు. పాడేరు టికెట్ సీనియర్ నేత ఎంవీవీ ప్రసాద్‌కు కేటాయించకపోవడంపై శుక్రవారం కొయ్యూరులో టీడీపీ శ్రేణుల ఆందోళన చేపట్టారు. టీడీపీ ఫ్లెక్సీలను తగులబెట్టారు. సత్యవేడు నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం మాకొద్దంటూ అసమ్మతి నాయకులు శుక్రవారం ఎన్ఆర్ఐ రమేష్‌బాబు నేతృత్వంలో తిరుపతిలో సమావేశమయ్యారు. ఆదిమూలంకు సహకరించబోమని, ఇప్పటికైనా కొత్త అభ్యర్థిని ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. చీపురుపల్లి టికెట్‌ను కిమిడి కళా వెంకటరావుకు కేటాయించడంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తన పదవులకు రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. ఎంతో కష్టపడి పని చేసిన తనను కాదని వేరే ఎవరినో తెచ్చి పెట్టాల్సిన పనేముందని ప్రశ్నించారు. భవిష్యత్ కార్యాచరణ రెండు రోజుల్లో వెల్లడిస్తానన్నారు. నాగార్జున వెంటే మండల నాయకులు రాజీనామాల బాటలో నడిచారు. నాగార్జున నివాసం వద్ద చంద్రబాబు ఫొటోలతో ఉన్న కరపత్రాలను దహనం చేశారు. అనంతరం మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌కు చేరుకుని విజయనగరం–రాజాం ప్రధాన రహదారిపై చంద్రబాబు ఫొటోలతో ఉన్న కరపత్రాలను తగలబెట్టి వ్యతిరేక నినాదాలు చేశారు.


టీడీపీ కరపత్రాలను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నెల్లిమర్లలో గరంగరం

'టీడీపీలో సొమ్ము ఉన్నవాళ్లకే సీట్లు ఇస్తారా? ఇదెక్కడి న్యాయం? నాలుగేళ్లు ఇంట్లో కూర్చొన్న గంటా శ్రీనివాసరావుకు రూ. కోట్లు ఉన్నాయని భీమిలి టికెట్ ఇచ్చారు. ప్రతి రోజూ పార్టీ కోసం కష్టపడిన నాలాంటి వాళ్లను పక్కనబెట్టారు' అని విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆవేదన వ్యక్తం చేశారు. భోగాపురం మండలం పోలిపల్లిలో సాయంత్రం అత్యవసరంగా సమావేశమయ్యారు. నెల్లిమర్ల టికెట్ తనకేనని అరచేతిలో వైకుంఠం చూపించిన పార్టీ అధిష్టానానికి బుద్ధి చెప్పాలని, స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయాల్సిందేనని వారంతా బంగార్రాజుకు మద్దతు పలికారు. నెల్లిమర్ల టికెట్ జనసేనకు ఇచ్చేశారని, న్యాయం చేయాలని అడిగితే భీమిలి పంపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. తీరా ఇప్పుడు ఆ భీమిలి సీటు గంటా శ్రీనివాసరావుకు ఇచ్చేశారని, విజయనగరం లోక్‌సభ టికెట్ నాన్‌లోకల్ వ్యక్తి కలిశెట్టి అప్పలనాయుడికి కట్టబెట్టారని బాధపడ్డారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో మొదట నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరు ప్రకటించి తర్వాత టికెట్ బీజేపీకి కట్టబెట్టడంతో నాలుగు రోజులుగా తీవ్ర స్థాయిలో నిరసన తెలుపుతున్నారు. ఏకంగా ఆ పార్టీ జెండాలను, కరపత్రాలను తగులబెట్టి అధినేత తీరుపై ఆగ్రహావేశాలతో మండిపడ్డారు. అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమవుతున్న నల్లమిల్లిని బుజ్జగించేందుకు టీడీపీ అధిష్టానం రాయబారానికి దిగినా చర్చలు సఫలం కాలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని నల్లమిల్లి నిర్ణయించుకున్నట్లు సమాచారం.

మూడు పార్టీలు.. మూడు దారులు

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీలో అసంతృప్తులు, వర్గపోరు ముదిరింది. శుక్రవారం నియోజకవర్గంలో జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గంతోపాటు సీనియర్ నేతలు కన్నెత్తి చూడలేదు. మరోవైపు నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ జనసేన పొత్తు జాడ కనిపించడం లేదు. ప్రచార కరపత్రాలు, బ్యానర్లలో జనసేన నాయకులు పేర్లు, ఫోటోలు లేకపోవడంపై బి.కొత్తకోట మండలం గట్టులో జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు టీడీపీ నేతలను నిలదీశారు. కరపత్రాలను చింపేశారు. రాయచోటికి చెందిన మాజీ జెడ్పీటీసీ సుగవాసి బాలసుబ్రమణ్యంను రాజంపేట టీడీపీ అభ్యర్థిగా అధిష్టానం ఖరారు చేయడంతో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. సుగవాసి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ తమ్ముళ్లు ఆందోళనకు దిగారు. టీడీపీ కరపత్రాలను కాల్చివేశారు. క్లస్టర్ ఇన్‌చార్జితో సహా పదిమంది బూత్ కన్వీనర్లు పార్టీకి రాజీనామా చేశారు. బత్యాల చంగల్రాయుడును రాజంపేట టీడీపీ అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు కుట్రలో బీజేపీ పడిందని బీజేపీ నాయకులు పనతల సురేష్ ఆరోపించారు. టీడీపీ అభ్యర్థిగా ఉన్న రోశన్నకు బీజేపీ కండువాను కప్పి ఆయనకు సీటును కేటాయించడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. అసలు రోశన్నకు బీజేపీలో సభ్యత్వమే లేదన్నారు. ఏ అర్హతతో రోశన్నకు టికెట్ కేటాయించారని మండిపడ్డారు.

గంటాకు సహకరించబోం.. జనసేన నేతలు, వీరమహిళలు

'జనసేన ఆవిర్భావం నుంచి నిరంతరం కష్టపడ్డాం. డబ్బు వృథా చేసుకున్నాం. భీమిలి నియోజకవర్గంలో జనసేనపార్టీ బలోపేతానికి ఎంతగానో కష్టపడితే నేడు టీడీపీ అభ్యర్థికి టికెట్ ఇవ్వడం ఏంటని భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పంచకర్ల సందీప్‌ను జనసేన నాయకులు, వీరమహిళలు ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం ఎండాడ పార్టీ కార్యాలయంలో సందీప్ సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ కోసం తాను కష్టపడి ప్రభు త్వంపై ఎన్నో పోరాటాలు చేశానని అయితే పార్టీ ఆదేశానుసారం ఉమ్మడి అభ్యర్థిగా గంటాను ప్రకటించారని సందీప్ చెప్పగా ఒక్కసారిగా జనసేన నాయకులు ఆందోళనకు దిగారు. భీమిలి టికెట్ జనసేనకేనని ఎదురుచూశామని, టీడీపీకి ఎలా కేటాయిస్తారని, పార్టీ కోసం ఇన్నాళ్లు కష్టపడిన మా భవిష్యత్తు ఏంటని నిలదీశారు. టీడీపీ అభ్యర్థి గంటాకు తాము మద్దతు ఇవ్వబోమ ని స్పష్టం చేశారు. గంటా ఎక్కడి వాడు. ఎప్పుడు ఏ నియోజకవర్గంలో ఉంటాడో తెలియదు. ఎక్కడ నుంచి పోటీ చేస్తాడో తెలీ దు. ఏ పార్టీ నుంచి పోటీ చేస్తాడో కూడా తెలియదు. అలాంటి వ్యక్తికి తాము ఎలా మద్దతు ప్రకటించాలని ప్రశ్నించారు. గంటాకు మద్దతు ప్రకటించలేమని వారు తేల్చి చెప్పేశారు. మూడు రోజులు సమయం ఇస్తున్నామని, అభ్యర్థిని మార్చకుంటే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు.

జగన్.. సంఘసంస్కర్త: ఎంపీ ఆర్.కృష్ణయ్య



తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకుడు కాదని.. అధికారం చేపట్టిన ఐదేళ్లలో సంక్షేమ పథకాలతో ప్రజా సంక్షేమానికి బాటలు వేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న ఒక సంఘ సంస్కర్త అని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా తిరుపతికి విచ్చేసిన ఆయన శుక్రవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు వాస్తవంగా నేటి ప్రభుత్వంలో జరుగుతున్న మేలును గురించి తెలియజేసేందుకు చేపట్టిన రాష్ట్ర పర్యటనలో భాగంగా తిరుపతి వచ్చినట్లు చెప్పారు. రాష్ట్రాన్ని 14 ఏళ్లపాటు పరిపాలించిన చంద్రబాబు ప్రజలకు చేసిన మేలు శూన్యమని, చెప్పింది చేయని బాబును నమ్మితే మరోసారి దగా తప్పదని కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడపడంతోపాటు రాష్ట్ర ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ సంక్షేమ పాలన సాగించారన్నారు. భవిష్యత్తులో శాశ్వత అభివృద్ధికి ముందుచూపుతో బాటలు వేసి ప్రజా సంక్షేమ సారథిగా నిలిచిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. రుణమాఫీ, విద్యా కానుక, ఆసరా, వృద్ధులకు రూ.3 వేలు పెన్షన్, చేయూత వంటి సంక్షేమ పథకాలతో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి బాటలు వేస్తున్న చరిత్ర సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డి గెలుపుతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జగన్ గెలిస్తే ప్రజలు బాగుపడతారని ఆయన చెప్పారు.

పోలీసుల కన్నా హంతకులే నయం

- ప్రజాగళం సభలో చంద్రబాబు అనుచిత వాఖ్యలు
- జైల్లో టార్చర్ పెట్టి చంపడానికి ప్రయత్నిస్తారు
- టీడీపీ అధినేత వ్యాఖ్యలపై మండిపడుతున్న పోలీసులు
- చంద్రబాబు 'ప్రజాగళం' అట్టర్ ఫ్లాప్
- సభకు జనాలు రాకపోవడంతో బస్సులోనే గంటకుపైగా వేచిచూసిన బాబు


చంద్రబాబు రోడ్‌షోకు కరువైన జనం

కావలి/కోవెలకుంట్ల: పోలీసుల కన్నా హంతకులే నయమని చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి, నంద్యాల జిల్లా బనగానపల్లెల్లో శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం సభలో ప్రసంగించారు. రాష్ట్ర పోలీసుశాఖపై విమర్శలతో విరుచుకుపడ్డారు. 'ప్రభుత్వానికి ఎదురు తిరిగితే పోలీసులు వస్తారు. కేసు పెడతారు. తర్వాత సీబీసీఐడీ వారు వస్తారు. వాళ్లు అరెస్ట్ చేస్తారు. జైల్లో పెడతారు. జైల్లో కొడతారు. టార్చర్ చేస్తారు. కొంతమంది పోలీసులు చంపేయడానికి కూడా ప్రయత్నం చేస్తారు' అంటూ పోలీసుల ఆత్మగౌరవాన్ని, నిబద్ధతను కించపరిచేలా మాట్లాడారు. అధికారంలోకి వస్తే 'వర్క్ ఫ్రం హోం' తీసుకొస్తానని చంద్రబాబు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో అందరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జత చేసి లాభాల బాట పట్టిస్తానన్నారు. ఎన్టీఆర్ మూడు డీఎస్సీలు ప్రకటిస్తే, తాను 9 డీఎస్సీలు ప్రకటించానని తెలిపారు. 1997లో తన కృషి వల్లే ఎస్సీ వర్గీకరణ జరిగిందని, ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణకు ఎన్డీఏతో మాట్లాడి మాదిగలకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. వలంటీర్లను తొలగించబోమన్నారు. హైదరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసింది తానేనన్నారు. హైటెక్ సిటీ, ఔటర్‌రింగ్‌రోడ్, విమానాశ్రయం అంటే తన పేరే గుర్తుచేసుకుంటారని చెప్పారు. టెక్నాలజీ, సెల్‌ఫోన్లు, పవర్ సెక్టార్ తన చలువేనన్నారు.

బస్సులోనే పడిగాపులు: సభకు జనాలు రాకపోవడంతో చంద్రబాబు గంటకుపైగా బస్సులోనే పడిగాపులు పడాల్సి వచ్చింది. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజాగళం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఒక్కొక్కరికి రూ. 500 వంతున ఇచ్చి తీసుకువచ్చిన జనాలు కూడా చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వెనుదిరిగారు. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిపై అసంతృప్తితోనే పార్టీ నేతలు, కార్యకర్తలు సభకు ముఖం చాటేశారని చెబుతున్నారు. ఆటోల్లో తీసుకువచ్చిన జనాలకు 'రాజరాజేశ్వరి బస్' కంపెనీ పేరుతో ఉన్న స్లిప్పులను సభాస్థలి వద్దే పంపిణీ చేశారు. వెళ్లేటప్పుడు స్లిప్ ఇచ్చి రూ.500 తీసుకోవాలని సూచించారు. పోలీసులు, ఎన్నికల నిఘా సిబ్బంది ముందే స్లిప్పులు పంపిణీ చేస్తున్నా ఎవరూ అడ్డుకోకపోవడం గమనార్హం.

సాక్షి స్పోర్ట్స్



అమెరికా జట్టులో కోరీ అండర్సన్

న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ కోరీ అండర్సన్ ఇకపై అంతర్జాతీయ క్రికెట్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్‌ఏ) జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. కివీస్ తరఫున 13 టెస్టులు, 49 వన్డేలు, 31 టి20లు ఆడిన అండర్సన్ ఆఖరిసారిగా 2018లో తన దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 2014లో వన్డేల్లో ఫాస్టెస్ట్ సెంచరీ (36 బంతుల్లో)తో వెలుగులోకి వచ్చిన అతను ఆ తర్వాత 2015లో వరల్డ్ కప్ ఫైనల్ చేరిన కివీస్ జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. కెనడాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం ప్రకటించిన అమెరికా టీమ్‌లో అండర్సన్‌కు చోటు దక్కింది. అయితే ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లి అక్కడి మైనర్ లీగ్‌లో భారీగా పరుగులు సాధించినా...భారత అండర్–19 విజేత జట్టు కెప్టెన్ ఉన్ముక్త్ చంద్‌కు మాత్రం జట్టులో స్థానం లభించలేదు. మరో వైపు భారత దేశవాళీ క్రికెట్‌లో రాణించిన హర్మీత్ సింగ్, మిలింద్ కుమార్, సౌరభ్ నేత్రావల్కర్‌లు కూడా టీమ్‌లో అవకాశం దక్కించుకున్నారు.

కోల్‌కతా లెక్క మార్చేసింది

- సొంతగడ్డపై బెంగళూరుకు చెక్
- 7 వికెట్లతో నైట్‌రైడర్స్ విజయం
- చెలరేగిన నరైన్, సాల్ట్, వెంకటేశ్
- కోహ్లి వీరోచిత ప్రదర్శన వృథా



బెంగళూరు: కోల్‌కతా ఓపెనర్లు నరైన్ (22 బంతుల్లో 47; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), సాల్ట్ (20 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్ ముందు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి (59 బంతుల్లో 83; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) క్లాసిక్ ఇన్నింగ్స్ చిన్నదిగా మారిపోయింది. దీంతో ఈ సీజన్‌లో తొలి సారి సొంతగడ్డపై ఆతిథ్య జట్టుకు చుక్కెదురైంది. కోల్‌కతా గత తొమ్మిది మ్యాచ్‌ల సంప్రదాయాన్ని ఈ మ్యాచ్‌తో మార్చేసింది. చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ 7 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఆరంభం నుంచి కోహ్లి, ఆఖర్లో దినేశ్ కార్తీక్ (8 బంతుల్లో 20; 3 సిక్స్‌లు) మెరిపించారు. అనంతరం కోల్‌కతా 16.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (30 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు.

కోహ్లి ఒక్కడే...

తొలి బంతికే బౌండరీతో కోహ్లి బెంగళూరు ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టాడు. సహచరులంతా తక్కువ స్కోరుకే అవుటవుతున్నా... తన వీరోచిత ప్రదర్శనతో పరుగుల్ని వేగంగా పేర్చిన కోహ్లి పెద్ద భాగస్వామ్యాలతో ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. కెప్టెన్ డుప్లెసిస్ (8) రెండో ఓవర్లోనే అవుట్ కాగా, గ్రీన్ (21 బంతుల్లో 33; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మ్యాక్స్‌వెల్ (19 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) ఎంతోసేపు నిలువలేదు. కోహ్లి ఒక్కడే నిలిచి ఇన్నింగ్స్‌ను ఆఖరి దాకా నడిపించాడు. తన మార్కు క్లాసిక్ షాట్లతో, తనకు మాత్రమే సాధ్యమైన ఆటతీరుతో బెంగళూరు ప్రేక్షకుల్ని ఆద్యంతం కేరింతల్లో ముంచేశాడు. 36 బంతుల్లో విరాట్ అర్ధ సెంచరీ పూర్తయ్యింది. గత మ్యాచ్‌లో పేలవ బౌలింగ్‌లో ఒక్క వికెట్ తీయకుండా 53 పరుగులిచ్చిన మిచెల్ స్టార్క్ ఈ సారి కూడా వికెట్ తీయకుండా 47 పరుగులు సమర్పించుకున్నాడు.



'పవర్ ప్లే'లో 85/0

కోల్‌కతా ముందున్న లక్ష్యం కష్టమైంది. కానీ సులువుగా ఛేదించింది. ఓపెనర్లు సాల్ట్, నరైన్‌ల బ్యాటింగ్ సునామీ 'పవర్ ప్లే'లోనే మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తెచ్చుకుంది. ఓపెనర్లు ఇద్దరూ దంచేసే పనిలో పడటంతో సిక్స్‌లైతే మంచినీళ్ల ప్రాయంలా వచ్చేశాయి. సిరాజ్ తొలి ఓవర్‌లో సాల్ట్ రెండు సిక్స్‌లు, ఒక బౌండరీలతో ఉతికేశాడు. సునీల్ నరైన్... తానేం తక్కువ కాదని జోసెఫ్ మూడో ఓవర్లో 2 భారీ సిక్సర్లతో చాటుకున్నాడు. ఈ మెరుపుల మేనియాలో నైట్‌రైడర్స్ జట్టు కేవలం 3.3 ఓవర్లలోనే 50 పరుగుల మార్క్‌ను దాటేసింది. 6 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 85 పరుగులు చేసింది. అంతలోనే చేయాల్సిన పరుగులు వందలోపే దిగొచ్చింది. ఏడో ఓవర్లో నరైన్‌ను డాగర్, ఎనిమిదో ఓవర్లో సాల్ట్‌ను వైశాక్ అవుట్ చేశారు. కానీ అప్పటికే స్కోరు 92/2. లక్ష్యంలో సగం పనైపోయింది. మిగతా సగాన్ని వెంకటేశ్ అయ్యర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (24 బంతుల్లో 39 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పూర్తి చేశారు. దీంతో 19 బంతులు మిగిలుండగానే నైట్ రైడర్స్ లక్ష్యాన్ని చేరుకుంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి నాటౌట్ 83; డుప్లెసిస్ (సి) స్టార్క్ (బి) హర్షిత్ 8; గ్రీన్ (బి) రసెల్ 33; మ్యాక్స్‌వెల్ (సి) రింకూసింగ్ (బి) నరైన్ 28; పటిదార్ (సి) రింకూసింగ్ (బి) రసెల్ 3; రావత్ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 3; దినేశ్ కార్తీక్ రనౌట్ 20; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182. **వికెట్ల పతనం:** 1-17, 2-82, 3-124, 4-144, 5-151, 6-182. **బౌలింగ్:** స్టార్క్ 4-0-47-0, హర్షిత్ 4-0-39-2, అనుకూల్ 2-0-6-0, నరైన్ 4-0-40-1, రసెల్ 4-0-29-2, వరుణ్ 2-0-20-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) గ్రీన్ (బి) వైశాక్ 30; నరైన్ (బి) డాగర్ 47; వెంకటేశ్ (సి) కోహ్లి (బి) యశ్ దయాళ్ 50; శ్రేయస్ నాటౌట్ 39; రింకూ సింగ్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (16.5 ఓవర్లలో 3 వికెట్లకు) 186. **వికెట్ల పతనం:** 1-86, 2-92, 3-167. **బౌలింగ్:** సిరాజ్ 3-0-46-0, యశ్ దయాళ్ 4-0-46-1, జోసెఫ్ 2-0-34-0, మయాంక్ డాగర్ 2.5-0-23-1, వైశాక్ 4-0-23-1, వైశాక్ 1-0-7-0.

నరైన్ @ 500

వెస్టిండీస్ ఆఫ్‌స్పిన్నర్ సునీల్ నరైన్ టి20 క్రికెట్‌లో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. ఆర్‌సీబీతో మ్యాచ్‌తో అతను ఈ ఫార్మాట్‌లో అతను 500 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన 4వ ఆటగాడిగా అతను నిలిచాడు. నరైన్‌కు ముందు పొలార్డ్ (660), డ్వేన్ బ్రేవో (573), షోయబ్ మలిక్ (542) అతనికంటే ముందు 500 మ్యాచ్‌లు ఆడారు. 35 ఏళ్ల నరైన్ ఈ సుదీర్ఘ కెరీర్‌లో ఏకంగా 17 టి20 జట్లకు ప్రాతినిధ్యం వహించి 537 వికెట్లు పడగొట్టాడు. వరల్డ్ కప్ సహా మొత్తం 10 టైటిల్స్ విజయాల్లో అతను భాగంగా ఉన్నాడు. ఐపీఎల్‌లో 2012నుంచి వరుసగా 13 సీజన్లుగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున 164 మ్యాచ్‌లు ఆడాడు. బ్యాటింగ్‌లో కూడా ఓపెనర్‌గా, పించ్ హిట్టర్‌గా బరిలోకి దిగి కేకేఆర్ పలు విజయాల్లో అతను కీలక పాత్ర పోషించాడు.

ఐపీఎల్‌లో నేడు

లక్నో X పంజాబ్
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
చెన్నై	2	2	0	4	1.979
కోల్‌కతా	2	2	0	4	1.047
రాజస్తాన్	2	2	0	4	0.800
హైదరాబాద్	2	1	1	2	0.675
పంజాబ్	2	1	1	2	0.025
బెంగళూరు	3	1	2	2	-0.711
గుజరాత్	2	1	1	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	-0.528
ముంబై	2	0	2	0	-0.925
లక్నో	1	0	1	0	-1.000

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సెమీస్‌లో సిక్కి-సుమీత్ జోడి

- క్వార్టర్స్‌లో ఓడిన సింధు
- స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్



మాడ్రిడ్: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ (సూపర్ 300) టోర్నీ స్పెయిన్ మాస్టర్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో స్టార్ ప్లేయర్ పీవీ సింధు ఓడగా...మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి - సుమీత్ రెడ్డి జోడి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లో, పురుషుల డబుల్స్‌లో కూడా భారత జోడీలు క్వార్టర్స్‌లో వెనుదిరిగాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో సింధు పోరాడి ఓడింది. ఈ మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన ఆరో సీడ్ సుపనిద కేట్‌టాంగ్ 24-26, 21-17, 22-20తో రెండో సీడ్ సింధును ఓడించింది. 77 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో ఇద్దరు షట్లర్లూ ఒక్కో పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. తొలి గేమ్‌లో 4-8తో వెనుకబడిన తర్వాత వరుస 7 పాయింట్లతో సింధు 11-8కి వెళ్లింది. అయితే ఆ తర్వాత సుపనిద కోలుకుంది. దాంతో స్కోరు 17-17, 20-20, 24-24 వరకు సమంగా సాగగా, చివరకు గేమ్ సింధు గెలుచుకుంది. రెండో గేమ్‌లో 8-11తో వెనుకబడి కూడా సుపనిద పోరాడి గేమ్‌ను సొంతం చేసుకోగలిగింది. చివరి గేమ్‌లో 8-4తో సింధు ముందంజ వేసింది. అయితే భారత షట్లర్ వరుస తప్పిదాలతో ప్రత్యర్థికి అవకాశం కల్పించింది. ఒక దశలో వరుస 10 పాయింట్లలో 9 సుపనిద ఖాతాలోకే చేరాయి. 15-20తో ఓటమి దాదాపు ఖాయమైన దశలో సింధు వరుసగా 5 మ్యాచ్ పాయింట్లు సాధించి 20-20 వరకు తీసుకొచ్చింది. అయితే వరుస రెండు పాయింట్లతో సుపనిద ఆట ముగించడంతో రాకెట్ విసిరేసి సింధు కోర్టులోనే కుప్పకూలిపోయింది.

డబుల్స్ జోడీల పరాజయం...

41 నిమిషాల పాటు సాగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సుమీత్ - సిక్కి జోడి 14-21, 21-11, 21-17 స్కోరుతో ఇండోనేసియాకు చెందిన రేహన్ నౌఫల్ - లిసా అయు ద్వయంపై విజయం సాధించింది. తొలి గేమ్‌ను కోల్పోయినా...పట్టుదలగా ఆడిన భారత జంట తర్వాతి రెండు గేమ్‌లలో సత్తా చాటి సెమీస్‌లోకి అడుగు పెట్టింది. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత్‌కు చెందిన మూడో సీడ్ అశ్విని పొన్నప్ప - తనీషా క్రాస్టోకు ఓటమి ఎదురైంది. ఆరో సీడ్ లీ చియా సిన్ - టింగ్ చున్ సున్ (చైనీస్ తైపీ) వరుస గేమ్‌లలో 21-12, 21-10తో అశ్విని - తనీషాలను చిత్తు చేశారు. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో భారత్‌కు చెందిన ఎనిమిదో సీడ్ ధ్రువ్ కపిల - ఎంఆర్ అర్జున్ 19-21, 23-21, 17-21 తేడాతో మలేసియాకు చెందిన జునేదీ ఆరిఫ్ - రాయ్ కింగ్ చేతిలో పరాజయంపాలయ్యారు.

కోచ్‌గా స్టిమాక్ కొనసాగింపు!



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు మైదానంలో నిరాశాజనక ఫలితాలు సాధిస్తున్నప్పటికీ... కోచ్‌గా ఇగర్ స్టిమాక్ కొనసాగనున్నారు. 2026 ఫిఫా ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో అఫ్గానిస్తాన్ లాంటి చిన్న జట్టుతో ఓటమి పాలవడం ఆయన కోచ్ పదవికి ఎసరు తెచ్చింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) సాంకేతిక కమిటీ కూడా హెడ్ కోచ్‌ను తప్పించాలనే సిఫార్సు చేసింది. అయితే ఒప్పంద నిబంధనలు ఆయన్ని ఉన్న పళంగా తప్పిస్తే భారీ మూల్యం చెల్లించేలా ఉన్నాయి. దీంతో వేటు కంటే కొనసాగించడమే మేలని ఏఐఎఫ్‌ఎఫ్ భావిస్తోంది. 'ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టిమాక్ ఇన్‌చార్జ్‌గా జూన్ వరకు జట్టుతో కలిసి పనిచేస్తారు' అని ఏఐఎఫ్‌ఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. జూన్‌లో ఆసియా క్వాలిఫయర్స్‌కు సంబంధించిన రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. గ్రూప్ 'ఎ'లో భారత్... కువైట్, ఖతర్‌లతో తలపడాల్సివుంటుంది. ఈ ఫలితాలను బట్టే తదుపరి మూడో రౌండ్‌కు అర్హత సాధించేది లేనిది తేలుతుంది. అఫ్గానిస్తాన్‌తో ఇంటా బయటా జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ నిరాశపరిచింది. అఫ్గాన్‌కు సంబంధించిన హోమ్ మ్యాచ్ సౌదీలో జరగ్గా భారత్ డ్రా చేసుకుంది.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం ׀ 30 ׀ మార్చి ׀ 2024



ఆలయానికి 'పసుపు కుంకుమ'
శ్రీతిరుపతమ్మ చిన్నతిరునాళ్ల మహోత్సవంలో అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి గురువారం అర్ధరాత్రి తర్వాత పసుపు కుంకుమ బండ్లు ఆలయానికి చేరుకున్నాయి. -IIలో▸



'ఇక్ష్వాకుల' శిల ప్రతిష్ఠ
ఇక్ష్వాకుల కాలం నాటి ప్రాచీన బౌద్ధ శిలా శాసనం చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామంలో పునర్నిర్మించిన పోతురాజు స్వామి దేవాలయంలో శనివారం ప్రతిష్ఠ కానుంది. -IIలో▸



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 513.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో వాసుదేవానంద్ సరస్వతీజీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉత్తరాఖండ్‌లోని శ్రీమత్ జ్యోతిష్ పీఠాధిపతి స్వామి వాసుదేవానంద్ సరస్వతీజీ మహారాజ్ శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో కేఎస్ రామరావు సాదరంగా స్వాగతం పలకగా, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఆలయ అర్చకులు వేదస్వస్తి పలికారు. అనంతరం ఈవో రామరావు అమ్మవారి ప్రసాదాలను అందజేయగా, స్వామీజీ ఆలయ అధికారులు, సిబ్బందికి అనుగ్రహ భాషణం చేశారు.

నరసింహుడికి ప్రత్యేక పూజలు

మంగళగిరి: నగరంలో వేంచేసి వున్న లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వటపత్రశాయి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన మేళ్లచెరువు సీతామహాలక్ష్మి వ్యవహరించారు.

పక్షుల పరిరక్షణ అందరి బాధ్యత



కృష్ణలంక(విజయవాడతూర్పు): పక్షులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆదివారం జరిగే సేవ్ స్పారో ఆర్ట్ కాంటెస్ట్ ఎగ్జిబిషన్ అండ్ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ఫంక్షన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పక్షుల పట్ల మానవులు సహృదయంతో స్పందించి కాపాడుకోవాల్సి బాధ్యత ఉందన్నారు. పిచ్చుకను కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రోత్సహించి సమాచారాన్ని ప్రజలకు చేరేలా చూసి పిచ్చుకల మనుగడకు బంగారు బాటలు వేయాలని కోరారు. స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ మాట్లాడుతూ స్కూల్ ఆధ్వర్యంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన సేవ్ స్పారో ఆర్ట్ కాంటెస్ట్ ఎగ్జిబిషన్ అండ్ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ఫంక్షన్‌ను బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం జరుగుతుందని తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్‌ను బలితీసుకున్న కంటైనర్ లారీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారిపై కొలనుకొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందాడు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం కృష్ణాజిల్లా, తిరువూరు మండలం, కొమ్మిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మారిపోగు మోహనరావు (34) ఎ.ఆర్.కానిస్టేబుల్‌గా డీజీపీ కార్యాలయంలో సీఐడీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2018లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన మోహనరావు విధుల నిమిత్తం డీజీపీ కార్యాలయం నుంచి ద్విచక్ర వాహనంపై తన స్నేహితుడు కుంటిపల్లి రాజాతో కలసి వెళుతుండగా కొలనుకొండ రైల్వే బ్రిడ్జి వద్ద వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ మోహనరావు కుడివైపు పడిపోగా లారీ టైర్లు శరీరంపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడైన రాజా ఎడమ వైపునకు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సహకారానికి ఊతం

- కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార సొసైటీల సేవలు
- ఐదేళ్లలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో రూ.8,134కోట్ల రుణాలు
- రూ.11,279 కోట్ల టర్నోవర్‌తో కేడీసీసీబీ ఇతర బ్యాంకులతో పోటీ

జి.కొండూరు: సహకార సొసైటీలకు ప్రభుత్వం ఊతం ఇవ్వడంతో అవి దూసుకెళ్తున్నాయి. గతంలో సహకార సొసైటీలంటే అప్పులిచ్చే బ్యాంకులుగా, స్కాములకు అడ్డాలుగా, రాజకీయాలకు కేంద్ర బిందువులుగా ఉండే పరిస్థితి నుంచి నేడు కార్పొరేట్ బ్యాంకులకు సవాల్ విసిరే స్థాయికి చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో సహకార వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవడంతో విజయవంతంగా నడుస్తున్నాయి. నమ్మకమైన సేవలు అందిస్తుండటంతో సొసైటీలపై ప్రజలకు ఆసక్తి పెరిగింది.

బలోపేతానికి చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కన బెట్టి అనుభవజ్ఞులైన వ్యక్తులను సొసైటీల చైర్మన్లుగా నియమించి సహకార వ్యవస్థ బలోపేతానికి మొదటి అడుగేసింది. శిథిలావస్థకు చేరుకున్న సొసైటీల భవనాల స్థానంలో నూతన భవనాలను పెద్ద ఎత్తున నిర్మించారు. రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్లు నిర్మించారు. పెట్రోల్ బంకుల నిర్మాణం, జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుతో అదనపు ఆదాయం దిశగా అడుగులు వేశారు. సొసైటీల్లో అత్యాధునిక వసతులు కల్పించారు. 67 శాతం ఉద్యోగాలను మహిళలకే కేటాయించారు. గతం కంటే 70 శాతానికి పైగా అదనపు సేవలను అందిస్తున్నారు. ఏటీఎంలు, మొబైల్ ఏటీఎంలను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా తక్కువ వడ్డీకే పెద్ద ఎత్తున అన్ని రకాల రుణాలను ఇవ్వడం, డిపాజిట్లు చేయించడం వంటి సమగ్రమైన చర్యలతో సహకార సొసైటీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది.

రూ.వేల కోట్ల టర్నోవర్

గత ప్రభుత్వం హయాంలో సహకార సొసైటీలపై ప్రజలకు అపనమ్మకం ఉండటంతో టర్నోవర్ అంతంతమాత్రంగా ఉండేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార వ్యవస్థ బలోపేతానికి తీసుకున్న నిర్ణయాలతో టర్నోవర్ రూ.వేల కోట్లకు చేరుకుంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 57 కేడీసీసీ బ్రాంచ్‌లు, రెండు ప్రధాన కార్యాలయాలు, 6 జిల్లా కో ఆపరేటివ్ ప్రాసెసింగ్ సెంటర్లు, 425 సొసైటీలు ఉన్నాయి. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో 2019లో మొత్తం రుణాలు రూ.3,201.21 కోట్లు ఉండగా.. టర్నోవర్ రూ.5,138.46కోట్లు ఉంది. షేర్ క్యాపిటల్ రూ.170.12 కోట్లు, రిజర్వ్ ఫండ్స్ రూ.148.33 కోట్లు, డిపాజిట్లు రూ.1,937.25 కోట్లుగా ఉంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 సంవత్సరానికి మొత్తం రుణాలు రూ.8,134.51 కోట్లు ఉండగా మొత్తం టర్నోవర్ 11,279.48 కోట్లకు చేరింది. షేర్ క్యాపిటల్ రూ.390.75 కోట్లు, రిజర్వ్ ఫండ్స్ రూ.308.54 కోట్లు, డిపాజిట్లు రూ.3,144.97 కోట్లుగా ఉన్నాయి.



మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయం

కేడీసీసీబీ పరిధిలో 2019 వరకు ఇచ్చిన రుణాలు, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024వరకు ఇచ్చిన రుణాల టర్నోవర్ వివరాలు(రూ.కోట్లల్లో)

రుణం పేరు	2019 వరకు రుణాలు	2024వరకు రుణాలు	ఈ ఐదేళ్లలో గ్రోత్ శాతం
వ్యవసాయ రుణాలు	1054.07	1334.52	26.61
ఫిష్ ఫీడ్ రుణాలు	160.11	277.30	73.19
లాంగ్ టర్మ్ రుణాలు	890.90	1968.27	120.93
బంగారంపై రుణాలు	211.41	451.70	113.66
డ్వాక్రా రుణాలు	196.88	639.76	224.95
చేనేత రుణాలు	15.86	19.39	22.26
కర్షకమిత్ర రుణాలు	253.38	819.70	223.51
రైతునేస్తం రుణాలు	లేదు	1912.65	–
విద్యా రుణాలు	లేదు	29.61	–
గృహ రుణాలు	86.51	86.98	0.54
ఇతర రుణాలు	332.10	594.62	79.05



కేడీసీసీబీ ఆధ్వర్యంలో మొబైల్ ఏటీఎం

మార్పులతో సహకారం



దివాళా స్థాయికి దిగజారిన సహకార వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి ఈ ప్రభుత్వం బలోపేతం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో ఈ ఏడాదికి కేడీసీసీబీ పరిధిలో 11,279.48 కోట్ల టర్నోవర్ చేయగలిగాం. ఈ సొసైటీల ద్వారా జగనన్న కాలనీల్లో 70శాతం ఇళ్ల నిర్మాణానికి స్వయం సహాయక సంఘాల మహిళలు 324మందికి రూ.6.48కోట్లు రుణాలు ఇచ్చాం. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 11సొసైటీల్లో పెట్రోల్ బంకులు, 12సొసైటీల్లో జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేశాం. సొసైటీల్లో సభ్యుడిగా ఉండి రుణం పొందిన రైతు మరణిస్తే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందిస్తున్నాం. జగనన్న పాలవెల్లువ కింద సంఘాలుగా ఏర్పడిన మహిళలు 2,130మందికి వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.6.97కోట్లు, 551మంది మహిళా పాడి రైతులకు పశువుల కొనుగోలు నిమిత్తం 5.02కోట్ల రుణాలను అందించాం.

–తాతినేని పద్మావతి, కేడీసీసీబీ చైర్‌పర్సన్

నిష్పక్షపాతంగా ఎన్నికల కోడ్ అమలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) నిష్పక్షపాతంగా, సమర్థంగా అమలవుతోందని, కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎంసీసీ, ఎన్నికల వ్యయం, ఎంసీఎంసీ తదితర విభాగాల నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలవుతున్న తీరు, ఫిర్యాదుల పరిష్కారం, రిపోర్టింగ్ మేనేజ్‌మెంట్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) తదితరాల్లో ప్రగతిని విశ్లేషించడంతో పాటు ఇకపై కోడ్ పటిష్ట అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా ఎంసీసీ బృందాలు మరింత క్రియాశీలంగా పనిచేసేలా చూడాలని.. క్షేత్రస్థాయి బృందాలతో పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఐటీ, ఫారెస్ట్, బ్యాంకింగ్ తదితర ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు సూచించారు. జిల్లాలో శుక్రవారం సాయంత్రం వరకు రూ. 1.53 కోట్ల నగదుతో పాటు మొత్తం రూ. 4.83 కోట్ల విలువైన సీజర్లు జరిగినట్లు వివరించారు. నిఘాను కేవలం చెక్‌పోస్టులకే పరిమితం చేయకుండా ఇతర, కొత్త మార్గాలకూ విస్తరించాలని సూచించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూం, వాట్సాప్ నంబర్, ఓటర్ హెల్ప్‌లైన్ (1950), సీ విజిల్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ), మీడియా మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీఓలు బీహెచ్ భవానీ శంకర్, కె.మాధవి, ఎ.రవీంద్రరావు పాల్గొన్నారు.

మూల్యాంకనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ఏప్రిల్ 1నుంచి 8వ తేదీ వరకు 'పది' మూల్యాంకనం
- మచిలీపట్నంలోని రెండు హైస్కూల్స్‌లో వసతుల కల్పన
- వెయ్యి మంది సిబ్బంది నియామకం

సాక్షి, మచిలీపట్నం: పదో తరగతి పరీక్షల ఫలితాల విడుదలకు ప్రభుత్వ పకడ్బందీ చర్యలు తీసుకుంది. విద్యార్థుల సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభించనుంది. దీనికి సంబంధించిన మూల్యాంకన కార్యక్రమాన్ని మచిలీపట్నంలోని రెండు హైస్కూల్స్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జరగనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు సుమారు 2 లక్షల పేపర్లు మూల్యాంకనానికి రానున్నాయి. దీని కోసం జిల్లా వ్యాప్తంగా వెయ్యి మంది సిబ్బందిని నియమించారు. వీరిలో మూల్యాంకనం నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జామినర్లతో పాటు వాటిని పరిశీలించడానికి చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారి తహెరా సుల్తానా క్యాంపు ఆఫీసర్‌గా, సీనియర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. మరో వంద మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా ఉంటారు.

ముగ్గురు ఏఈలకు ఒక సీఈ, స్పెషల్ అసిస్టెంట్

విద్యార్థుల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయడానికి ముగ్గురు చొప్పున అసిస్టెంట్ ఎగ్జామినర్లను (ఏఈ) ఒక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్(సీఈ)తో పాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కొక్క ఏఈ రోజుకు 40 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఏఈలు మూల్యాంకనం చేసి పత్రాలను సీఈలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విద్యార్థులు రాసిన సమాధానాలను పరిశీలించి వేసిన మార్కులను నిశిత పరిశీలన చేస్తారు. అదే విధంగా జవాబు పత్రాల్లో ఏఈలు వేసిన మార్కులను కూడి టోటల్ మార్కులను వేసే విధులను స్పెషల్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు. ఈ విధంగా ఒక బృందం రోజుకు 120 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులు వేయడంతో పాటు వేసిన మార్కులు సరిగా ఉన్నవి, లేనివి క్షుణ్ణం తనిఖీ చేస్తారు. క్యాంపు అధికారికి సహాయకులుగా సహాయ క్యాంపు అధికారులను నియమించారు. సీనియర్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు మూల్యాంకన విధుల్లో సీఈ, ఏఈ, స్పెషల్ అసిసెంట్లుగా ఉంటారు.

వెయ్యి మంది టీచర్ల నియామకం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన రెండు లక్షల పేపర్లలో స్థానిక లేడీయాంప్తిల్ గర్ల్స్ హైస్కూల్‌లో లాంగ్వేజ్ పేపర్లు, నిర్మల హైస్కూల్‌లో ఇతర సబ్జెక్టుల పేపర్లు మూల్యాంకనం చేయనున్నారు. దీని కోసం వెయ్యి మంది సిబ్బందిని నియమించారు. వీరిలో చీఫ్ ఎగ్జామినర్లుగా వంద మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 600 మంది, స్పెషల్ అసిస్టెంట్లుగా 200 మంది, క్యాంప్ స్టాఫ్‌గా వంద మంది ఇలా మొత్తం వెయ్యి మంది విధులు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం చేయనున్నారు. విధులకు హాజరయ్యే సిబ్బందికి ఇప్పటికు బార్ కోడ్, ఇతర వాటిపై శిక్షణ ఇచ్చారు. వారికి కావాల్సిన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వ పరీక్షల విభాగం కల్పించనుంది.



పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

పటిష్ట ఏర్పాట్లు



పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి నిర్వహించనున్నాం. దీనికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. మూల్యాంకన విధులకు హాజరయ్యే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. తాగునీరు, గదుల్లో లైటింగ్, ఫ్యాన్లు, టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కనుక సిబ్బంది మార్కులు వేసే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

– తహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణా జిల్లా

పక్కాగా నిబంధనల అమలు

10వ తరగతి మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకు అటు వైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వెంట తీసుకెళ్లరాదనే నిబంధన పెట్టనున్నారు. టీచర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు మూల్యాంకన కేంద్రంలో ఉండాల్సి ఉంది. వారికి అవసరమైన వసతులు కల్పించారు.

ఇటు పెత్తందారీ.. అటు సిలువధారి



క్రైస్తవులు పవిత్రంగా భావించే సిలువను ఓ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బూట్లు విడవకుండానే భుజానికెత్తుకొని విమర్శల పాలయ్యాడు. పెనమలూరు నియోజకవర్గంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం 'సిలువ మార్గం' నిర్వహించారు. దీనిలో టీడీపీ పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్ విశ్వాసులు నిర్వహించిన సిలువ మార్గంలో కాలికి బూట్లు ధరించే సిలువ మోసిన ఫొటోలు వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇష్టదైవాన్ని ఆరాధిస్తున్న సందర్భంలో వారి చెంతకు వెళ్లి మనోభావాలను దెబ్బతీస్తే పూర్తిగా అహంకారమవుతుందని విశ్వాసులు అంటున్నారు. ఇదే సిలువ యాత్రకు పెనమలూరు కేంద్రంగా జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ హాజరయ్యారు. క్రీస్తును మదిలో ఆరాధిస్తూ కాళ్లకు ఉన్న చెప్పులను విడిచి సిలువను మోశారు. ఏసును స్తుతించారు.

– పెనమలూరు



లోకరక్షకుడు ఏసు

సర్వమానవుల పాప పరిహారార్థం సిలువనెక్కిన ఏసుక్రీస్తు త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ విజయవాడ నగరంలోని పలు చర్చిల్లో గుడ్‌ఫ్రైడ్ ప్రార్థనలు జరిగాయి. ఆయా చర్చిల ప్రాంగణాల్లో సిలువ ఘట్టాలను వివరించే చిత్రాలను ప్రదర్శించారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. నగరంలో పలుప్రాంతాల్లో సిలువ మార్గం నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

పసుపు కుంకుమ బండ్లకు ఘనస్వాగతం



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్ల మహోత్సవంలో భాగంగా అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి గురువారం అర్ధరాత్రి తర్వాత పసుపు కుంకుమ బండ్లు ఆలయానికి చేరుకున్నాయి. నాలుగు కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా వేల సంఖ్యలో భక్తులు బండ్ల కోసం వేచి ఉన్నారు. పసుపు–కుంకుమల బండ్లు గ్రామంలోకి ప్రవేశించగానే భక్తులు జయజయ ధ్వానాలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ బండ్లు ఒక ప్రదక్షిణం చేశాయి. ఆలయం వద్ద ఈవో కె.రమేష్‌నాయుడు అమ్మవారి వంశీకులు తెచ్చిన పసుపుకుంకుమలు తీసుకుని వారిని ఘనంగా సత్కరించారు. అమ్మవారి తోటికోడలు చంద్రమ్మ అమ్మ వారి వంశీకులు కన్నేటి వెంకటరమణ, పోలీసు అధికారులను ఆలయ అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో డీసీపీ కె.శ్రీనివాసరావు, నందిగామ ఏసీపీ రవికిరణ్, సర్పంచి వేల్పుల పద్మకుమారి, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, ఏఈవో తిరుమలేశ్వరరావు, కాకాని పద్మ పాల్గొన్నారు.

డీమ్డ్ టు బి యూనివర్సిటీగా వీఆర్ సిద్ధార్థ

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల డీమ్డ్ టు బి యూనివర్సిటీగా మారిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ తమ కాలేజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీగా మారటంతో వీఆర్ సిద్ధార్థ ఇక మీదట సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(సాహె)గా మారిందన్నారు. 2024–2025 వ విద్యా సంవత్సరానికి అడ్మిషన్‌లు ప్రారంభించామని, హెల్ప్ డెస్కు 81216 38666, 81216 39666 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

రంగస్థల నటుడు, రచయిత వేగిరెడ్డి మృతి



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ కు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, సినీ రచయిత వేగిరెడ్డి వెంకటరమణారావు(62) మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తన నివాసంలో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పలు సాంఘిక నాటకాల్లో నటించిన వేగిరెడ్డి సినీ పరిశ్రమలో రచయితగా, పలు సినిమాల్లో సహాయ నటుడిగా పనిచేశారు. తొలినాళ్లలో ఆయన ఏలూరురోడ్డులో కలర్ సోడాల బండి నడుపుతూ నాటకాల ప్రదర్శన చేసేవారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన బిగ్‌బాస్, రిక్షావోడు చిత్రాల్లో సహాయ నటుడిగా వేగిరెడ్డి వెంకటరమణారావు మంచి గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు సంతాపం ప్రకటించారు.



ఉయ్యూరు : కాటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇళ్ల ముంగిట వడియాలు పెడుతున్న మహిళలతో ముచ్చటిస్తున్న మంత్రి జోగి రమేష్



ప్రచారపర్వం

విజయవాడఈస్ట్: 16వ డివిజన్ భూపేష్ గుప్తా నగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్



నందిగామ : పట్టణంలోని నాలుగవ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళలకు కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పది పరీక్షల సిబ్బందికి వేతనం పెంపు

- పరీక్షల నిర్వహణతో పాటు స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న వారికి వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ

కంకిపాడు: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములు, అనంతరం నిర్వహించనున్న స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొనే సిబ్బందికి రెమ్యూనరేషన్‌ను పెంచుతూ పాఠశాల విద్య (పరీక్షలు) శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ క్షేత్రస్థాయి నివేదికను ఇటీవల సంబంధిత శాఖకు నివేదించటంతో రెమ్యూనరేషన్ పెంపు ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రధానంగా అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు పేపరుకు గతంలో రూ.6.60 ఇచ్చేవారు. దానిని రూ.10కి పెంపుదల చేయటం గమనార్హం.

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యాశాఖ నిర్వహిస్తోంది. ఈనెల 30వ తేదీతో పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే కృష్ణాజిల్లాలో 151 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 21,458 మంది, ప్రైవేటు విద్యార్థులు 5,049 మంది రాస్తున్నారు. పరీక్షలు నిర్వహిస్తున్న 151 పరీక్ష కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను చీఫ్ సూపరింటెండెంట్‌లుగా నియమించారు. వీరితో రూట్ ఆఫీసర్లు 10 మంది, సహాయ రూట్ ఆఫీసర్లు 10 మంది, 34 మంది కస్టోడియన్స్, 19 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, ముగ్గురు సభ్యులతో కూడిన ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. వీరందరికీ రెమ్యూనరేషన్ పెరగనుంది.



గత ఏడాది పది పరీక్షల మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులు

పరీక్షల నిర్వహణలో పాల్గొన్న సిబ్బందికి వర్తింపు

పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన సిబ్బందికి రెమ్యూనరేషన్‌ను విద్యాశాఖ భారీగా పెంచింది. పేపర్‌సెట్టర్‌కి గతంలో రోజుకు రూ.880 కాగా, ప్రస్తుతం దానిని రూ.1320కి పెంచింది. ట్రాన్స్‌లేటర్‌కు రూ.770 నుంచి రూ.1155, మోడరేటర్‌కు రూ.770 నుంచి రూ.1155, చీఫ్ సూపరింటెండెంట్‌కు రూ.44 నుంచి రూ 66, డిపార్ట్‌మెంట్ అధికారులు/అదనపు అధికారులకు రూ.44 నుంచి రూ.66 చెల్లించనున్నారు. ఇన్విజిలేటర్లకు ప్రతి 20 మంది విద్యార్థులకు గానూ రూ.22 నుంచి రూ.33, క్లర్క్‌కి రూ.22 నుంచి రూ.33, అటెండర్లకు ప్రతి 100 మంది విద్యార్థులకు రూ.13.20 నుంచి రూ.20, వాటర్‌మెన్‌కు ప్రతి 50 మందికి రూ.11 నుంచి రూ.17, సిట్టింగ్ స్క్వాడ్/ఫ్లయింగ్ స్క్వాడ్‌కు రూ.44 నుంచి రూ.66, కంటింజెంట్ పనులకు రూ.8 నుంచి రూ.10, మెడికల్ స్టాఫ్‌కి రూ.22 నుంచి రూ.33, జిల్లా స్థాయి పరిశీలకులకు రూ.200 నుంచి రూ.300 పెంచారు.

స్పాట్‌కు సైతం పెంపు

ఏప్రిల్ మొదటి వారం నుంచి పదో తరగతి జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ జరగనుంది. స్పాట్ వాల్యుయేషన్‌కు జిల్లాలో చీఫ్ ఎగ్జామినర్స్ 98 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్‌లు 584 మంది, స్పెషల్ అసిస్టెంట్‌లు 196 మందిని నియమించారు. వీరితో పాటుగా స్పాట్ వాల్యుయేషన్‌ను పర్యవేక్షించేందుకు వివిధ స్థాయి అధికారులకు బాధ్యతలను అప్పగించారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి వారి కేటగిరీ ఆధారంగా రెమ్యూనరేషన్‌ను పెంచారు. క్యాంప్ ఆఫీసర్‌కు రోజు కు రూ.385 నుంచి రూ.578కి పెంచారు. డెప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌లు (స్ట్రాంగ్ రూమ్/ అడ్మినిస్ట్రేషన్) కు రూ.330 నుంచి రూ.495, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.286 నుంచి రూ.429, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.264 నుంచి రూ.396, అసిస్టెంట్ ఎగ్జామినర్ (స్క్రిప్ట్ వాల్యుయేషన్) రూ.6.60 నుంచి రూ.10కి పెంచారు. స్పెషల్ అసిస్టెంట్‌లకు రూ.137 నుంచి రూ.300, క్లరికల్ అసిస్టెంట్‌కు రూ.88 నుంచి రూ.132, ఆఫీస్ సబార్డినేట్స్, కంటింజెంట్ ఉద్యోగులకు రూ.55 నుంచి రూ.83, చీఫ్ కోడింగ్ అధికారులకు రూ.220 నుంచి రూ.330, సహాయ కోడింగ్ అధికారులకు రూ.198 నుంచి రూ.297, మూల్యాంకన నిబంధనలను రూపొందించే ఎగ్జామినర్స్‌కి రూ.250 నుంచి రూ.375 రెమ్యూనరేషన్ అందనుంది.

ఉత్తర్వులు అందాయి

పదో తరగతి పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. అన్ని శాఖల సంయుక్త భాగస్వామ్యంతో విజయవంతంగా పరీక్షలు నిర్వహించాం. పరీక్షల నిర్వహణ, స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ వారి కేటగిరీకి అనుగుణంగా రెమ్యూనరేషన్‌ను పెంపుదల చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేస్తాం.

–తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణాజిల్లా

నేడు ఇక్ష్వాకుల కాలం నాటి శిల ప్రతిష్ట

- పురిటిగడ్డలో 3వ శతాబ్దం నాటి శాసన సహిత శిల
- 19వ శతాబ్దంలో పోతురాజు రూపం చెక్కించి ప్రతిష్ట
- పునర్నిర్మించిన ఆలయంలో ప్రతిష్ట కానున్న చారిత్రక సంపద

పురిటిగడ్డ(చల్లపల్లి): మూడవ శతాబ్దంలో నాగార్జున కొండ కేంద్రంగా విజయపురి రాజధానిగా కృష్ణానదీ తీరాన్ని పరిపాలించిన ఇక్ష్వాకుల కాలం నాటి ప్రాచీన బౌద్ధ శిలా శాసనం చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామంలో పునర్నిర్మించిన పోతురాజు స్వామి దేవాలయంలో ప్రతిష్ట కానుంది. పురిటిగడ్డ గ్రామంలోని ప్రాచీన శ్రీ గంగానమ్మ పోతురాజు స్వామి వార్ల దేవాలయ పునర్నిర్మాణ క్రమంలో ఆలయంలోని పోతురాజు శిలను శుభ్రం చేయటంతో పోతురాజు శిల ప్రాచీన వైభవం వెలుగు చూసింది. ఈనెల 30న నూతన ఆలయంలో పోతురాజు, గంగానమ్మల విగ్రహాల పునః ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది.



ప్రాచీన శిల ప్రాశస్త్యం వివరిస్తున్న నాదెళ్ల శివరామకృష్ణ

చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం

పురిటిగడ్డలో పోతురాజు రూపంలో ఉన్న మూడవ శతాబ్దం నాటి ఇక్ష్వాకుల నాటి బౌద్ధ శిలా శాసనం ఈ ప్రాంత ప్రాచీన చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ పోతురాజు శిలకు ఒక వైపు మూడవ శతాబ్దం నాటి బ్రాహ్మీ లిపిలో, ప్రాకృత భాషలో ఆనంద అనే బౌద్ధ గురువు శ్లాబు వేసేందుకు విరాళం ఇచ్చి నట్లు చెక్కి ఉన్న ట్లు బెంగళూరు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాసన విభాగం డైరెక్టర్ మునిరత్నం నాయుడు ప్రకటించారు. విగ్రహానికి మరోవైపు తల్లి, చేతిలో ఒక బిడ్డ, చంకలో ఒక బిడ్డతో కనిపిస్తుంది. గంగానమ్మ ముందు పోతురాజు వీరంగమాడుతున్నట్లు ఈ విగ్రహం చెక్కారు. పోతురాజు పైన ఉన్న సూర్య, చంద్రులు, కోడిపుంజు బొమ్మలు మాత్రం 3వ శతాబ్దం నాటి రూపాలని గుర్తించారు. ఈ శిలపై 19వ శతాబ్దంలో పోతురాజు శిల చెక్కినట్లు గుర్తించారు.



ప్రాచీన శిలపై బ్రాహ్మీ లిపిలో ప్రాకృత భాషలో ఉన్న శాసనం

దాతల సహకారంతో నిర్మాణం

జీర్ణావస్థకు చేరిన పోతురాజు, గంగానమ్మల ఆలయం పునర్నిర్మాణం దాతల సహకారంతో పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ పెద్దలు నాదెళ్ల శివరామకృష్ణ తెలిపారు. ఆలయంలోని పాలరాతి పోతురాజు శిల ప్రాచీనత గుర్తించి పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్ ప్లస్ అధ్యాపకురాలు ఓలేటి ఉమా సరస్వతి చొరవతో పురావస్తు శాఖ స్థపతి ఈమని శివనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సహకారంతో పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం నాయుడు ఈ శిలాశాసనం ప్రాచీన వైభవాన్ని వెలుగులోకి తెచ్చారని తెలిపారు. ఇంత గొప్ప ప్రాచీన శిలా శాసన సహిత పోతురాజు శిల తమ గ్రామంలో ఉండటం గర్వకారణం అన్నారు. శనివారం జరిగే ఆలయ ప్రతిష్టా మహోత్సవాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

8న బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం

పెదకాకాని: బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవ వేడుకలు ఏప్రిల్ 8, 9తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా చెప్పారు. పెదకాకాని బాజీబాబా దర్గాలో 536వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈఓ మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వారి ఆదేశాల మేరకు నిర్వహించే బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవ వేడుకల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇప్పటికే బాజీ బాబా దర్గా చుట్టూ రూ.1.97 కోట్లతో ప్రహరీ, దర్గా నుండి ప్రధాన రోడ్డు వరకూ సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. భక్తుల సహకారంతో దర్గా ప్రాంగణంలో నిద్రలు చేసే వారి కోసం ప్రత్యేకంగా షెడ్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 8వ తేదీ సాయంత్రం 5 గంటలకు చాందిని అలంకరణ, రాత్రి 10 గంటలకు బాబావాకి గంధం గుర్రంపై ఊరేగింపు బయలు దేరుతుందన్నారు. దర్గా వద్ద 8 గంటలకు అన్నదానం జరుగుతుందన్నారు. 9వ తేదీ సాంయత్రం 3 గంటలకు భక్తులకు గంధం పంచుట, సలామి ప్రార్థన జరుగుతుందన్నారు. అనంతరం దర్గా ఉరుసు మహోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ వక్ఫ్‌బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదంషఫీ, షేక్ సత్తార్, షేక్ రఫీ పాల్గొన్నారు.

బాపట్ల పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థిగా జగన్మోహనరావు



చీరాల రూరల్: బహుజన్ సమాజ్‌పార్టీ(బీఎస్పీ) బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా చీరాల పట్టణం విఠల్‌నగర్‌కు చెందిన డాక్టర్ డొక్కా జగన్మోహనరావు నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి తన పేరును ప్రకటించారని జగన్మోహనరావు తెలిపారు. మచిలీపట్నంలో అధ్యాపకుడిగా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్‌గా పని చేశానన్నారు.

గుండ్లకమ్మ–దర్శి రైల్వే లైన్‌కు పచ్చజెండా

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుండ్లకమ్మ–దర్శి మధ్య 27 కిలోమీటర్ల మేర కొత్త రైలు మార్గాన్ని పూర్తిచేసి రైళ్ల రాకపోకలను ప్రారంభించడం జరిగిందని గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కొత్త రైల్వే లైన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నడికుడి– శ్రీకాళహస్తి మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్‌లో భాగమన్నారు. విద్యుద్దీకరించని రైలు విభాగంలోని రైళ్ల గరిష్టంగా 75 కి.మీ. వేగంతో నడపడానికి అనుమతి లభించిందని తెలిపారు.నడికుడి– శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్ దక్షిణ మధ్య రైల్వే ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపట్టిన ముఖ్యమైన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటి అని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ట్రక్కు ఆటో దగ్ధం



దగ్ధమవుతున్న ట్రక్కు ఆటో

గన్నవరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ట్రక్కు ఆటో దగ్ధమైన సంఘటన స్థానిక విమానాశ్రయం వద్ద చెన్నై–కొల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాలిలా వున్నాయి. విజయవాడ నుంచి గన్నవరం వైపుగా వెళ్తున్న ట్రక్కు ఆటో విమానాశ్రయం వద్దకు రాగానే ఇంజన్ భాగంలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ ఆటోను జాతీయ రహదారి పక్కన నిలిపి స్థానికుల సాయంతో అతికష్టం మీద మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఆటో సగ భాగం దగ్ధమైంది. విద్యుత్ సరఫరా వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్టు గుర్తించారు.

కాంట్రాక్టర్ మృతిపై పచ్చ మీడియా పిచ్చి రాతలు

- ప్రమాద వశాత్తూ మరణిస్తే వైఎస్సార్‌సీపీపై అభాండాలా?
- రైల్వే పోలీసుల విచారణలో ప్రమాదవశాత్తు మరణించారన్న సమాచారం

జగ్గయ్యపేట: కాంట్రాక్టర్ మృతిపై పచ్చ పత్రిక రాతలను నియోజకవర్గ ప్రజలు తప్పు పడుతున్నారు. ఘటనకు వేధింపులే కారణమంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు ఆపాదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ సంభంగి శ్రీనివాసరావు(వాసు) తూర్పు గోదావరి జిల్లా నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్–గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్య గురువారం మధ్యాహ్నం అనుమానాస్పదంగా మృతి చెంది ఉండటాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. తుని రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తన విచారణలో వాసు తన తల్లితో విజయనగరం మూడు రోజుల క్రితం వెళ్లాడు. అనంతరం తను ఒక్కడే బుధవారం రాత్రి విజయవాడ వచ్చేందుకు ఏపీ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. అర్ధరాత్రి సమయంలో నిద్రమత్తులో రైలు డోర్ వద్ద నిలబడి ప్రమాదవశాత్తూ కిందపడి మరణించి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు తెలియజేయగా, వారు కూడా మరణంపై ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదన్నారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మృతుడు సంభంగి శ్రీనివాసరావు(ఫైల్)

కేసు నమోదు కాకముందే అందుబాటులో లేని కాంట్రాక్టర్

జగ్గయ్యపేట పట్టణంలో కాంట్రాక్టర్ వాసు, 12 వ వార్డు కౌన్సిలర్ తన్నీరు నాగమణి భర్త నాగేంద్రకు కాంట్రాక్ట్ పనుల్లో విభేదాలు ఉన్నాయి. ఈ విషయంపై ఈనెల 23న ఇరువురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీనిపై జగ్గయ్యపేట పట్టణ ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ వివరణ ఇస్తూ కేసు నమోదు చేశామని అయితే దీనికి సంబంధించి వాసు కుటుంబసభ్యులను ఎటువంటి ఒత్తిడి చేయలేదన్నారు. కానీ కొన్ని పత్రికల్లో పోలీసుల వేధింపులు అంటూ కథనాలు రాయటం బాధాకరమన్నారు. కేసు నమోదు కాకముందే వాసు ఈ ప్రాంతంలో అందుబాటులో లేరని చెప్పారు.

నగలు చేసిస్తానని నమ్మించి బంగారంతో పరార్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆభరణాలు తయారు చేసి ఇస్తానని నమ్మించి బంగారంతో పరారైన ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని బాప్టిస్టనగర్, పూర్ణానందంపేటలో నివాసం ఉంటున్న మర్రివాడ రాజశేఖర్ మంగళగిరిలో బంగారు ఆభరణాల దుకాణం నడుపుకొంటున్నాడు. ఈ క్రమంలో గత ఏడాది నుంచి అతనికి పరిచయం ఉన్న నగరానికి చెందిన బొమ్మ రాముకి బంగారం ఇచ్చి నల్లపూసల గొలుసులు చేయించుకునేవాడు. ఈ నెల 13న 50 గ్రాముల బంగారం ఇచ్చి రెండు నల్లపూసల గొలుసులు చేయమని చెప్పాడు. మరుసటి రోజు నుంచి రాము ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని కనిపించకుండా పోయాడు. బాధితుడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి దుర్మరణం

రామవరప్పాడు(గన్నవరం): విజయవాడ రూరల్ మండలం నిడమానూరు నారాయణ కళాశాల సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద పనులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడికి కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం.. మైలవరం నియోజకవర్గం జి కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన యర్రగుంట చిన గురవయ్య నిడమానూరులో ఓ బిల్డింగ్ వద్ద రాడ్ బెండింగ్ పనులు చేసేందుకు వచ్చాడు. ఈనెల 28 అర్ధరాత్రి తర్వాత విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు కరెంట్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం



లబ్బీపేట(విజయవాడతూర్పు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తూర్పులో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి క్రాంతి, ఆయన సతీమణి దేవినేని సుధీర విస్తృతంగా పర్యటిస్తున్నారు. గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 4వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో దేవినేని సుధీర, 10వ డివిజన్ ఫన్‌టైమ్స్ రోడ్డు, టీచర్స్ కాలనీలో దేవినేని క్రాంతిలు పర్యటించారు. వారి వెంట ఆయా డివిజన్‌ల ఇన్‌చార్జిలు గల్లా రవి, కరుటూరి హరీష్ పాల్గొన్నారు.

సమైక్యతకు నిలయంగా ఇఫ్తార్ విందు



లబ్బీపేట(విజయవాడతూర్పు):రంజాన్ మాసంలో సమైక్యతకు నిలయంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తుంటారని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫీఖ్ అన్నారు. ఆ సంస్థ తూర్పుశాఖ ఆధ్వర్యంలో లబ్బీపేటలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎండీ రఫీఖ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలోనే విశ్వమానవాళికి మార్గదర్శకత్వం కోసం దివ్య ఖురాన్ అవతరంచినట్లు తెలిపారు. ఈ భౌతిక జీవితంలో ఆరాధనలు, ఆధ్యాత్మికత ద్వారా మాత్రమే శాంతి సుఖాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కరీముద్దీన్, ఇస్మాయిల్ ఉమ్రీ, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలి



విజయవాడ కల్చరల్: గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు అన్నారు. స్వరార్చన ఆర్కెస్ట్రా తన 10 వార్షికోత్సవం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించింది. డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకులు అనుకరణ కన్నా సొంతబాణీ కలిగి ఉండాలన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. స్వరార్చన వ్యవస్థాపకుడు డీజే రాము సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన డి.వీరభద్రరావు, శ్యాంప్రసాద్, ప్రసూనా రామన్, కేవీబీ మూర్తి పాల్గొన్నారు. చంద్రశేఖర్, మల్లాది స్వాతి, జ్ఞాన కిషోర్, ఆదిరాల జయప్రభు, కంచి మల్లీశ్వరి పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.

దుర్గమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఈవో రామారావు ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం ఎదుట దేవస్థాన ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం భక్తులకు మజ్జిగ పంపిణీ జరుగుతుంది. తొలి రోజైన శుక్రవారం ఆలయ ఈవో రామరావు కుటుంబం పేరిట 5 క్యాన్‌ల మజ్జిగను భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఈవో రామరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉగాది పర్వదినం నుంచి ఆలయ ప్రాంగణంలో మజ్జిగ వితరణ చేస్తామని, అయితే ఈ ఏడాది ముందుగానే ఎండల తీవ్రత అధికం కావడంతో మజ్జిగ పంపిణీ ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రమాదేవి, ఏఈ కుటుంబరావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పార్కింగ్ కోసం స్థలాల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి విచ్చేసే భక్తుల వాహనాలను నిలుపుకునేందుకు సరైన స్థలం కోసం పరిశీలన చేస్తున్నారు. దుర్గగుడి ఈవో కెఎస్.రామరావు శుక్రవారం దుర్గాఘాట్, హెడ్ వాటర్ వర్క్స్ మధ్య ఉన్న స్థలంతో పాటు కుమ్మరిపాలెం సెంటర్‌లోని తిరుమల తిరుపతికి చెందిన స్థలాన్ని పరిశీలించారు. దుర్గాఘాట్ సమీపంలో ఉన్న స్థలాన్ని ఇప్పటికే దేవస్థానం వినియోగిస్తున్నందున అక్కడ నిల్వ చేసిన గ్రావెల్‌ను తరలించి వాహనాలను నిలిపేందుకు అనువుగా తీర్చిదిద్దే ఆలోచన చేస్తున్నారు. కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో పాటు దుర్గాఘాట్‌లో అధిక సంఖ్యలో వాహనాలు నిలుపుకునే అవకాశం లేక పోవడంతో స్థలాలను పరిశీలించారు.

కార్పొరేట్ కంటే మిన్నగా మనబడి

సీఎం జగనన్న హయాంలో రూపురేఖలు మారిన స్కూళ్లు

- స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు
- అదనపు తరగతి గదుల నిర్మాణం
- గోరుముద్దతో పోషకాహారం
- ఇంగ్లీషు మీడియంలో బోధన
- తూర్పులో రూ.20 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



పటమటలోని బాలుర జెడ్పీ హైస్కూల్ భవనం ఆధునికీకరించిన దృశ్యం



తరగతి గదిలో విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు ఎన్నో ఫలితాలు ఇస్తున్నాయి. ప్రభుత్వ విద్యా రంగంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. వేలాది కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చారు. అన్ని పాఠశాలలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా సర్కారీ పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ఆధునిక స్మార్ట్ క్లాస్ రూమ్స్, రంగు రంగుల బెంచీలు, ఇంగ్లీషు మీడియం బోధన, చేతిలో ట్యాబ్‌లు ఇలా కార్పొరేట్‌కు మించిన సౌకర్యాలు ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు గోరుముద్ద కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తున్నారు. మూడు జతల యూనిఫాంతో పాటు, షూస్, బ్యాగులు కూడా ప్రభుత్వం ఇవ్వడంతో బడుల్లో అడ్మిషన్లకు డిమాండ్ ఏర్పడింది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దాదాపు రూ.20 కోట్లు వెచ్చించి మన బడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు.

గతాన్ని తలచుకుంటేనే...

గత ప్రభుత్వాలు కార్పొరేట్ పాఠశాలలకు వంత పాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారు. దీంతో పెచ్చులూడే శ్లాబులు, కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడలు దర్శనం ఇచ్చాయి. టాయిలెట్స్ కూడా సరిగా ఉండేవి కాదు. పేదరికంతో ప్రైవేటు స్కూళ్లకు వెళ్లలేని వారు మాత్రమే అక్కడకు వెళ్లేవారు. వర్షం వస్తే శ్లాబు నుంచి నీళ్లు కారేవి. కూర్చునేందుకు సరిగా బల్లలు కూడా ఉండేవి కాదు. దీంతో పాఠశాలకు సెలవు ఇవ్వాల్సి వచ్చేది. పుస్తకాలు కూడా సకాలంలో అందేవి కాదు.

పేదల తలరాత మార్చాలనే ఆశయంతో..

పేద విద్యార్థుల తలరాతలు మార్చాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అంతేకాదు నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులను ఆధునీకరించారు. ప్రభుత్వ స్కూల్స్ రూపురేఖలు మార్చేశారు. కూర్చునేందుకు అధునాతన బెంచీలు, స్మార్ట్ బ్లాక్ బోర్డులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టారు. దీంతో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొన్ని పాఠశాలల్లో నో వేకెన్సీ బోర్డులు సైతం వెలిశాయంటే ఎంత డిమాండ్ ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు.

పోషకాహారం అందిస్తూ...

పిల్లలు బాగా చదవాలంటే పోషక విలువలు కలిగిన ఆహారం తినడం ఎంతో ముఖ్యమని భావించి గోరు ముద్దను ప్రవేశ పెట్టారు. అందులో ప్రత్యేక మెనూను అమలు చేస్తూ కోడిగుడ్డు, వేరుశనగ చిక్కీ, పప్పు వంటివి పిల్లలు ఇష్టంగా తినే వంటకాలను అందిస్తున్నారు. అంతేకాదు చేతులు కడుక్కునేందుకు ఆధునిక సింకులు ఏర్పాటు చేశారు. టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. వంట చేసేందుకు షెడ్లు వేశారు. కార్పొరేట్ విద్యార్థుల్లా ఉండేలా యూనిఫాం. షూస్, బెల్టు, టై, బ్యాగులను అందించారు.

ఆధునికీకరించిన పాఠశాలలివే....

- మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు చాలడం లేదు. దీంతో అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టారు.
- పటమటలోని బాలుర జిల్లా పరిషత్ స్కూలును అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఇక్కడ తరగతి గదులు మరమ్మత్తులు, పిల్లలకు బెంచీలు ఇతర సౌకర్యాలు కల్పించారు.
- పటమటలంకలోని కొమ్మారెడ్డి సీతారామయ్య బాలికల జిల్లా పరిషత్ స్కూల్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దారు.
- రాణీగారితోట సిమెంట్ గోడౌన్ ప్రాంగణంలోని స్కూల్‌లో రూ. 90 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మానం చేశారు.
- కృష్ణలంకలోని వీఎం రంగా స్కూల్, అమరజీవి పొట్టి శ్రీరాములు హైస్కూల్స్‌ను ఆధునీకరించడంతో పాటు, ఆదనపు తరగతి గదులు నిర్మించారు.
- ఇంకా నియోజకవర్గంలోని 20కి పైగా ఎలిమెంటరీ స్కూల్స్‌ను ఆధునీకరణ పనులు చేపట్టారు.

విద్యారంగానికి పెద్దపీట



రాష్ట్రంలో ఐదేళ్లలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్కూల్స్‌ను దీటుగా తీర్చిదిద్దారు. పేదలకు సైతం ఇంగ్లీషు మీడియం చదువులను అందుబాటులోకి తెచ్చారు. చదువు ద్వారాలే ఉన్నతంగా ఎదుగుతారనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పోషక విలువలు కలిగిన ఆహారం అందించడమే కాకుండా, యూనిఫాం కూడా అందించారు.

–చందా కిరణ్‌తేజ, మాచవరం

ఊహించని అభివృద్ధి



ప్రభుత్వ పాఠశాలలు ఇంతగా అభివృద్ధి చెందుతాయని ఎన్నడూ ఊహించలేదు. ఇప్పుడు పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, తరగతి గదులు చూస్తుంటే కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు సైతం ఇంగ్లీషు మీడియంలో మాట్లాడుతున్నారు. ఇంతకంటే ఏమి అభివృద్ధి కావాలి. పేద పిల్లలను సైతం ఉన్నత వర్గాల వారితో పోటీ పడి చదివేలా పాఠశాలలను తీర్చిదిద్దారు.

–సయ్యద్ అలీం, లబ్బీపేట



పటమటలంకలోని జెడ్పీ బాలిక హైస్కూల్



అదనపు తరగతి గదులు

ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.4.56 లక్షలు స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు):కనకదుర్గ వారధి చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం నిర్వహించిన సోదాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.4లక్షల 56వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంక పోలీసుల కథనం మేరకు... గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన పి.శివశంకర్ విజయవాడ నగరంలోని ఒక థియేటర్ వద్ద వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఒక కారులో గుంటూరు వైపు నుంచి వారధి మీదుగా నగరానికి బయలుదేరాడు. వారధి చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ఆ కారును తనిఖీ చేసి అతని వద్ద రూ.3 లక్షల 56 వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. అలాగే గుంటూరులోని బృందావన్ గార్డెన్‌కు చెందిన రియాల్టర్ కర్నాటి నాగేశ్వరరావు తన కారులో శుక్రవారం సాయంత్రం గుంటూరు నుంచి వారధి మీదుగా నగరానికి బయలుదేరాడు. వారధి చెక్ వద్దకు రాగానే పోలీసులు కారును తనిఖీ చేసి రూ.లక్ష ఉన్నట్లు గుర్తించారు. వారిద్దరూ ఆ నగదుకు ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయలు అవ్వడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంకిపాడు మండలం పునాదిపాడుకు చెందిన ఎస్.వీరవెంకటశ్రీనివాసరావు తన బైక్‌పై విజయవాడకు వెళ్లాడు. విజయవాడలో పని ముగించుకుని తిరిగి బైక్‌పై వస్తూ కానూరు పంటకాలువ రోడ్డు జంక్షన్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన లారీ అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలుకు తీవ్ర గాయమవ్వడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాస నగర్ కాలువ కట్టకు చెందిన సింహాద్రి వెంకటేశ్వరరావు కానూరు వసంతనగర్ వంతెన వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

టీడీపీ కనుమరుగవడం ఖాయం

వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



స్థానికులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఎన్నికల అనంతరం టీడీపీ కనుమరుగవడం ఖాయమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తెలిపారు. 16వ డివిజన్ భూపేష్‌గుప్తానగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని ఒంటరిగా ఎదుర్కోలేక జనసేన, బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకుందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధి పాలనతో జనం ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రజలంతా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారని తెలిపారు. ఎన్నికల అనంతరం టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం తప్పదన్నారు. గత రెండు రోజుల నుంచి జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో అంతులేని ఆత్మీయత, అభిమానం ప్రజలు చూపిస్తున్నారని పేర్కొన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. కాల్‌మనీ, సెక్స్‌రాకెట్‌లకు ఆద్యుడు గద్దె రామ్మోహన్ అని ధ్వజమెత్తారు. దళిత కార్పొరేటర్ అంబేద్కర్ పై దాడిచేయించింది గద్దె కాదా అని ప్రశ్నించారు. దళితుల దాడులపై టీడీపీ ఎమ్మెల్యే స్పందించాలన్నారు. టీడీపీ నేతలు చేసే అబద్ధ, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా ఉంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తూర్పులో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ డివిజన్ ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ కార్పొరేటర్ బహుదూర్, బి.శేషు, శ్రీను, ఉమా, ఎండి బాబు, వి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో ముస్లింలకు సముచిత స్థానం

దేవినేని అవినాష్



దేవినేని అవినాష్‌కు ఇఫ్తార్ విందు ఇస్తున్న ముస్లిం పెద్దలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీలోనే ముస్లింలకు సముచిత స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి నిత్యం కృషి చేస్తున్నారని చెప్పారు. 15వ డివిజన్ మసీద్–ఎ–ఖుబా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లింలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు ఎన్నో కీలక పదవులు ముస్లింలకు కేటాయించారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో మైనారిటీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ముస్లింలు సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను కోరుకుంటున్నానని చెప్పారు. నిరతంరం ముస్లింల అభ్యున్నతికి పనిచేస్తున్న సీఎం జగన్‌కు అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించారు. అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీర్ హుస్సేన్, మసీదు కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

జీసస్ త్యాగానికి గుర్తు గుడ్‌ఫ్రైడే



గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న లైఫ్ ఛేంజింగ్ రివైవల్ సెంటర్ విశ్వాసులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మానవాళి కోసం జీసస్ చేసిన త్యాగానికి గుర్తు గుడ్‌ఫ్రైడే అని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఇతరులపై ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, సహనం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా ఆయన మానవాళికి ఇచ్చిన సందేశాలని పేర్కొన్నారు. లబ్బీపేట క్యాథలిక్ సెంటర్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా కస్తూరిభాయిపేటలోని చర్చి నుంచి ఎంజీ రోడ్డులోని చర్చి వరకూ సిలువ మార్గం నిర్వహించారు. ఈ మార్గంలో పాల్గొన్న దేవినేని అవినాష్ సిలువను మోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు శాంతి శ్రేయసు కోసం ముల్ల కిరీటం ధరించి సిలువ మోశారన్నారు. ఎదుటివారి సంతోషం కోసం, వారి జీవితాలు బాగుండాలన్న ప్రభువైన యేసు క్రీస్తు వలె మనం కూడా అన్ని విషయాల్లో శాంతి, సహనం కలిగి సాటి వారిని ప్రేమిద్దాం అన్నారు. ఎలాంటి విభేదాలు లేకుండా మనం అందరం కలిసి ఉండేలా ఆ ప్రభువు యేసుని కోరుకుందాం అని అవినాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెరకనపల్లి మాధురి, కలపాల అంబేద్కర్, బుర్రి జగ్జీవన్‌రావు, కుటుంబరావు, రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని లైఫ్ ఛేంజింగ్ రివైవల్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని ఎం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ఆరాధనలో ఆ సెంటర్ ఫౌండర్ దైవజనులు డాక్టర్ పీజే స్టీఫెన్‌పాల్ , సిస్టర్ షైలా పాల్‌లు వర్చువల్‌లో యేసుక్రీస్తు సిలువ రక్తం గూర్చి, ప్రభువు సిలువలో పలికి ఏడు మాటలు గురించి వివరించారు. సర్వమానవాళి విమోచన కోసం శిలువలో యేసు ప్రభువు చేసి ప్రాణత్యాగం వివరిస్తూ వాక్య సందేశం ఇచ్చారు.



లబ్బీపేట సిలువ మార్గంలో పాల్గొన్న దేవినేని అవినాష్

ప్రేమ, క్షమాగుణాన్ని అలవరచుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పొరుగు వారిని ప్రేమించడం, క్షమించే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని యావే ప్రేయర్ హౌస్ చర్చి పాస్టర్ యేసు భక్తు చెప్పారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని యావే ప్రేయర్ హౌస్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మావవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం ప్రభువైన యేసుక్రీస్తు తన ప్రాణాలను సంతోషంగా అర్పించిన రోజు గుడ్ ఫ్రైడే అని అన్నారు. తనకు సిలువ వేసిన వారిని కూడా క్షమించాలని యేసు క్రీస్తు చెప్పారన్నారు. మొగల్రాజపురంలోని ఆర్‌సీఎం చర్చి, సీఎస్‌ఐ, ఆగాపే, ఏజీఎం చర్చి, క్రీస్తు సైన్యం మొదలైన చర్చిల్లో సైతం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



యావే ప్రేయర్ హౌస్‌లో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



గుడ్‌ఫ్రైడే సందేశం ఇస్తున్న పీజె స్టీఫెన్‌పాల్

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ):వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అయాన్ ఐ హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తెలిపారు. కేదారేశ్వరపేటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. వాసవి క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఫ్యూచర్‌పాత్ స్కూల్ అవరణలో ఈ ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిబిరంలో అయాన్ ఐ హాస్పటల్ నేత్ర వైద్యులు, సిబ్బంది పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్‌లను అందిస్తారన్నారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పండ్ల మార్కెట్ వ్యాపారులు, స్థానికులు సద్వినియోగం చేసుకొవాలి కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో పెరిగిన రద్దీ

భక్తులతో కిటకిటలాడిన క్యూలైన్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణంతో పాటు హోమాల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టికెట్ ఉన్న వారికి మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించారు. సిఫార్సులు, వీఐపీల పేరిట వచ్చే వారికి సైతం రూ. 500 టికెటు ఉంటేనే క్యూలైన్‌లోకి అనుమతించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం 2–30 గంటల వరకు కొనసాగింది. అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో రద్దీ మరింత పెరిగింది. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనం త్వరత్వరగా అయ్యేలా ఆలయ అధికారులు, సిబ్బంది రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు, దర్బార్ సేవలను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు దేవినేని ట్రస్టు సహకారం

ఆటోనగర్(విజయవాడతూర్పు):రామలింగేశ్వరనగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ ముబీనా ఉన్నత చదువులకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ భరసా ఇచ్చారు. ముబీనా 10 వతరగతి, ఇంటర్‌లో మంచి ర్యాంకుతో ప్రతిభ కనపరిచింది. సిద్ధార్థ మహిళా కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతుంది. శుక్రవారం రామలింగేశ్వరనగర్ గాంధీనగర్ కాలనీలో దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావులు విద్యార్థి ముబీనాను శాలువతో సన్మానించారు. ఈ విద్యార్థి చదువుకునేందుకు గాను దేవినేని చారిటబుల్ ట్రస్ట్ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు.

సాక్షి బిజినెస్
శనివారం
30-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
655	203
73,651	22,327

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,379	▽ 20
డోజోన్స్	39,807	▲ 47
ఎఫ్‌టీఎస్ఈ 100	7,953	▲ 21
డాక్స్	18,492	▲ 15
షాంఘై	3,041	▲ 30
నికాయ్	40,369	▲ 201

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	93.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.23	106.78
€	యూరో	ఎస్‌బీఐ	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.64	55.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.64	64.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49



దేశంలో ఆధ్యాత్మిక టూరిజం జోష్

రిటైల్ బ్రాండ్స్ ప్రత్యేక దృష్టి ● లిస్టులో తిరుపతి, అయోధ్య, వారణాసి

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక పర్యాటకంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో బడా రిటైల్ బ్రాండ్లు ఆధ్యాత్మిక కేంద్రాలపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను అందించే దిశగా తిరుపతి, అయోధ్య, వారణాసి, అమృత్‌సర్, పూరి, అజ్మీర్ వంటి నగరాల్లో గణనీయంగా విస్తరిస్తున్నాయి. 14 కీలక నగరాల్లో పెరుగుతున్న ఆధ్యాత్మిక టూరిజంతో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రిటైల్ చెయిన్స్ అనుసరిస్తున్న వ్యూహాలపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మదురై, గురువాయూర్, ద్వారకా, మథురా తదితర నగరాల్లో కూడా రిటైల్ బూమ్ కనిపిస్తున్నట్లు రిపోర్టు పేర్కొంది. పేరొందిన మాల్స్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా టూరిస్టులను ఆకర్షించేలా తమ బ్రాండ్లను ప్రదర్శించడంపై రిటైల్ సంస్థలు దృష్టి పెడుతున్నాయి. అయోధ్యలో మాన్యవర్, రిలయన్స్ ట్రెండ్స్, రేమండ్స్, మార్కెట్99, ప్యాంటలూన్స్, డామినోస్, పిజ్జా హట్, రిలయన్స్ స్మార్ట్ మొదలైనవి తమ రిటైల్ స్టోర్స్ ప్రారంభించినట్లు నివేదిక వివరించింది. వారణాసిలో జుడియో, షాపర్స్ స్టాప్, బర్గర్ కింగ్ తదితర సంస్థలు కూడా కార్యకలాపాలు విస్తరించినట్లు పేర్కొంది. టూరిజంను ప్రోత్సహించేందుకు, కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం లభిస్తున్నట్లు సీబీఆర్ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. ఫ్యాషన్, ఫుడ్ అండ్ బెవరేజెస్, హైపర్‌మార్కెట్లు మొదలైన సంస్థలన్నీ కూడా భక్తుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను అందిస్తూ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు వివరించారు. ఆధ్యాత్మిక టూరిజం ట్రెండ్‌తో ఆయా ప్రాంతాల్లో ఆతిథ్య, రిటైల్ రంగాలకు కలిసి వస్తోందని సీబీఆర్ఈ ఇండియా ఎండీ రామ్ చంద్నానీ తెలిపారు.

ఎఫ్‌పీఐల భారీ పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్‌మెంట్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్న నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ ఇటువైపు చూస్తున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో ఏకంగా రూ. 2 లక్షల కోట్ల పైగా ఇన్వెస్ట్ చేశారు. డెట్ మార్కెట్లో రూ. 1.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టారు. మొత్తం మీద భారత క్యాపిటల్ మార్కెట్లో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. 2020–21లో ఏకంగా రూ. 2.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు ఆ మరుసటి సంవత్సరం రూ. 1.4 లక్షల కోట్లు, ఆ తర్వాత 2022–23లో రూ. 37,632 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2023–24లో భారీగా ఇన్వెస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సానుకూలంగా కొత్త ఏడాది..

కొత్త ఆర్థిక సంవత్సరంపై కూడా అంచనాలు కాస్త సానుకూలంగానే ఉన్నాయని భారత్‌లో మజార్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ తెలిపారు. పురోగామి పాలసీ సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయమైన పెట్టుబడి మార్గాల కారణంగా దేశంలోని ఎఫ్‌పీఐల ప్రవాహం స్థిరంగా కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అంశాల కారణంగా మధ్యమధ్యలో ఒడిదుడుకులు ఉండవచ్చన్నారు.

చిన్న షేర్ల పెద్ద ర్యాలీ

60 శాతానికి మించి రాబడులు ● 2023–24లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా

న్యూఢిల్లీ: దలాల్ స్ట్రీట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023 –24)లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా కొనసాగింది. దేశంలో దృఢమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య స్థాయి షేర్లను కొనేందుకు అధిక ఆసక్తి చూపారు. 2023–24లో బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 62%, స్మాల్ క్యాప్ సూచీ 60% రాణించాయి. ఇదే కాలంలో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 25% పెరిగింది.

''ఆదాయాలు గణనీయంగా పెరగడం, అధిక వృద్ధి అవకాశాలతో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య తరహా షేర్లను కొనుగోలుకు ఆసక్తి చూపారు. లార్జ్ క్యాప్ షేర్ల పట్ల విముఖత చూపారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నికర పెట్టుబడులు పెరగడం ఇందుకు నిదర్శనం. ఆర్థిక విస్తరణ సమయంలో చిన్న, మధ్య తరహా షేర్ల వృద్ధి వేగంగా ఉంటుందనే సంప్రదాయ సూత్రాన్ని వారు విశ్వసించారు. అంతేకాకుండా స్మాల్, మిడ్ సైజ్ కంపెనీల అద్భుతమైన త్రైమాసిక ఫలితాలు వారిని కొనుగోళ్ల వైపు ఆకర్షితం చేశాయి'' అని హెడ్జ్ ఫండ్ హెడోనోవా సీఐఓ సుమన్ బెనర్జీ తెలిపారు.

● 2023-24లో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫిబ్రవరి 8న 40,282 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. గతేడాది మార్చి 31న 23,881 వద్ద ఏడాది కనిష్టానికి తాకింది.

● ఇదే కాలంలో బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ ఫిబ్రవరి 7న 46,821 వద్ద ఆల్‌టైం హైని నమోదు చేయగా, గతేడాది మార్చి 31న 26,692 వద్ద 52 వారాల కనిష్టాన్ని తాకింది.



● వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ చిన్న, మధ్య తరహా షేర్ల ర్యాలీ కొనసాగుతుందని న్యాతీ అభిప్రాయపడ్డారు. "సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వమే తిరిగి అధికారాన్ని దక్కించుకోవచ్చనే అంచనాలతో వ్యాపార అనుకూల వాతావరణం పెంపొంది స్థిరమైన వృద్ధి కొనసాగొచ్చు. దీనికి తోడు భారత వృద్ధి బలమైన అవుట్‌లుక్ అంచనాలు ఈ రంగాల షేర్లకు డిమాండ్‌ను పెంచుతాయి" న్యాతీ తెలిపారు. అయితే కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు, అంతర్జాతీయ అనిశ్చితులు, లాభాల స్వీకరణ వంటి అంశాలు స్వల్పకాలిక ఒడిదుడుకులకు దారితీయొచ్చన్నారు.

● సెన్సెక్స్‌తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య స్థాయి షేర్ల అత్యుత్తమ ప్రదర్శన భారత ఈక్విటీ మార్కెట్ క్రియాశీలక స్వభావాన్ని, ఇన్వెస్టర్ల అపార వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తుందని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతీ తెలిపారు.

ఐపీవో బాటలో ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రా

ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఈ షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ ఐపీవోతో రూ. 7,000 కోట్లు సమకూర్చుకోనుంది.

రూ. వెయ్యి కోట్లకు జిరోధా ఫండ్ విలువ

జిరోధా, స్మాల్‌కేస్ జేవీ జిరోధా ఫండ్ హౌస్ నిర్వహణలోని ఆస్తుల విలువ కేవలం 40 రోజుల్లో రూ. 500 కోట్ల మేర ఎగిసింది. దీంతో సంస్థ ఏయూఎం రూ. 1,000 కోట్ల మార్కును దాటింది.

300 నగరాల్లో కియా కేంద్రాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కియా ఇండియా విక్రయ, సర్వీస్ కేంద్రాలను విస్తరిస్తోంది. కియా 2.0 వ్యూహంలో భాగంగా డిసెంబర్‌కల్లా 300 నగరాలు, పట్టణాల్లో అడుగు పెట్టడం ద్వారా టచ్ పాయింట్స్ సంఖ్యను 700లకు చేరుస్తామని ప్రకటించింది. ప్రస్తుతం 236 నగరాలు, పట్టణాల్లో కంపెనీకి 522 సేల్స్, సర్వీస్ సెంటర్స్ ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-3-2024 ఫామ్ ధర...

విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో వాటా విక్రయం

బ్యాంక్ నుంచి వార్‌బర్గ్ పింకస్ ఔట్

న్యూఢిల్లీ: పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నుంచి పూర్తిగా వైదొలగింది. తాజాగా బ్యాంకులోగల మొత్తం 2.25 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 75.24 సగటు ధరలో 15.88 కోట్ల బ్యాంకు షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 1,195 కోట్లుకాగా.. క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా 2023 డిసెంబర్‌కల్లా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 2.25 శాతం వాటాను కలిగి ఉంది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. గతేడాది సెప్టెంబర్‌లోనూ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 4.2% వాటాను వార్‌బర్గ్ పింకస్ రూ. 2,480 కోట్లకు విక్రయించిన విషయం విదితమే. కాగా.. గురువారం బీఎస్ఈలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు 3.1% క్షీణించి రూ. 75.4 వద్ద ముగిసింది.

హైరింగ్ ప్రణాళికల్లో స్టోరబుల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెల్ఫ్–స్టోరేజ్ టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే అమెరికన్ సంస్థ స్టోరబుల్ భారత్‌లో తమ కార్యకలాపాలు విస్తరిస్తోంది. హైదరాబాద్‌లో 15వేల చ.అ. విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. గతేడాదే హైదరాబాద్‌లో తమ ఏషియా జీసీసీని స్టోరబుల్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇక్కడ 60 మంది ఉద్యోగులు ఉండగా, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 120కి పెంచుకోనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ చార్లీ మారియట్ తెలిపారు. ఇంజనీరింగ్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు.

సినిమా

డిసెంబరులో ఆరంభం



● ప్రభాస్

ఈ ఏడాది డిసెంబరులో పోలీసాఫీసర్‌గా ప్రభాస్ చార్జ్ తీసుకోనున్నారని తెలిసింది. హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో 'స్పిరిట్' అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో సిన్సియర్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ ఏడాది డిసెంబరులో ఆరంభించేలా ప్లాన్ రెడీ చేస్తున్నారట సందీప్ రెడ్డి వంగా. ఇక ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం రష్మికా మందన్నా, కీర్తీ సురేష్, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించనున్నారు. భూషణ్ కుమార్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

టీజర్ రెడీ



● అల్లు అర్జున్

'పుష్ప : ది రూల్' సినిమా టీజర్‌కు రంగం సిద్ధమౌతున్నట్లుగా తెలుస్తోంది. హీరో అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న 'పుష్ప: ది రూల్' సినిమా టీజర్‌ను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా తెలిసింది. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, అనసూయ, సునీల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త. 'పుష్ప: ది రూల్' సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఇక 'పుష్ప' సినిమా ఫ్రాంచైజీలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సినిమా సక్సెస్ కావడంతో మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దర్శకుడు త్రివిక్రమ్, మరో దర్శకుడు సందీప్ రెడ్డి వంగాలతో అల్లు అర్జున్ సినిమాలు కమిటైన సంగతి తెలిసిందే. ఈ చిత్రాల అప్‌డేట్స్ కూడా అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న వచ్చే అవకాశం ఉంది. ఇంకా అల్లు అర్జున్–దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లోని కొత్త సినిమా ప్రకటన కూడా రావొచ్చనే ప్రచారం జరుగుతోంది.

ఆలియాకు విలన్‌గా...?



● బాబీ డియోల్

ఆలియా భట్, షార్వరి లీడ్ రోల్స్‌లో ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమా తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాలో బాబీ డియోల్ విలన్‌గా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందట. శివ్ రావైల్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించనున్నారు. గతంలో 'రాజీ' సినిమాలో స్పై పాత్రలో నటించిన ఆలియా భట్ మళ్లీ ఈ సినిమాలో ఆ తరహా పాత్రను ఓకే చేయడం విశేషం. ఇక 'యానిమల్'లో విలన్ రోల్‌లో బాబీ డియోల్ విజృంభించిన విషయం తెలిసిందే. మరి.. యశ్ రాజ్ ఫిలింస్ తాజా చిత్రంలో విలన్‌గా సై అంటే... మరోసారి బాబీ నెగటివ్ పెర్ఫార్మెన్స్‌ని చూసే వీలు దక్కుతుంది.

ఇటు మెకానిక్ రాకీ.. అటు లైలా!



● మెకానిక్ రాకీలో విశ్వక్ సేన్

బర్త్ డే (మార్చి 29) రోజున హీరో విశ్వక్ సేన్ డబుల్ ధమాకా అందుకున్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న రెండు కొత్త సినిమాల వివరాలను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. విశ్వక్ టైటిల్ రోల్‌లో నటించనున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో నరేశ్, 'వైవా' హర్ష, హర్షవర్ధన్ కీలక పాత్రల్లో నటిస్తారు. రవితేజ ముళ్లపూడిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ లుక్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ స్వరకర్త. అలాగే విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న మరో సినిమా 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించనున్నారు. ఈ సినిమాలో సెకండాఫ్‌లో లైలా అనే అమ్మాయిగా విశ్వక్ కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమాకు తనిష్క్ బాగ్చి మ్యూజిక్ డైరెక్టర్. ఈ సినిమాలే కాకుండా విశ్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అనే సినిమా చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 17న విడుదల కానుంది.

స్పైతో బనితా ఎంట్రీ



● బనితా సంధు

'అక్టోబర్, సర్దార్ ఉదమ్' వంటి హిందీ చిత్రాలతో, తమిళ చిత్రం 'ఆదిత్య వర్మ'తో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు బనితా సంధు. ఈ బ్యూటీ 'జీ 2' (గూఢచారి 2) చిత్రంతో పాన్ ఇండియా ప్రేక్షకులకు పరిచయం కానున్నారు. అడివి శేష్ హీరోగా రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ (2018) 'గూఢచారి'కి సీక్వెల్‌గా పాన్ ఇండియా స్థాయిలో 'జీ 2' తెరకెక్కుతోంది. గూఢచారిగా హీరో అడివి శేష్ నటిస్తున్నారు. ఈ స్పై సరసన బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ గుజరాత్‌లోని భుజ్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బనితా జాయిన్ అయిన విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ''శేష్, బనితాలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. తెరపై ఇద్దరి కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంది. హై ఆక్టేన్ యాక్షన్ మూవీగా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ''ఈ చిత్రంలో నటించడం క్రియేటివ్‌గా నాకు చాలా హ్యాపీగా ఉంది. ఇప్పటివరకూ చేయని పాత్రను ఈ చిత్రంలో చేస్తున్నాను'' అని బనితా సంధు అన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర చేస్తున్నారు.

అందరూ కనెక్ట్ అవుతారు



● రుహానీ శర్మ

సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'శ్రీరంగనీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారని శుక్రవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ పేర్కొంది.

వేసవిలో వస్తున్నా డియర్



● జీవీ ప్రకాశ్, ఐశ్వర్య

ఒక కుటుంబంలో ఓ సమస్య వస్తుంది? ఆ సమస్యను ఆ కుటుంబం ఎలా పరిష్కరించింది? వివాహ బంధం సుదీర్ఘంగా సాగడానికి ఏం అవసరం? వంటి అంశాలతో రూపొందిన చిత్రం 'డియర్'. జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా ఒక్క రోజు గ్యాప్‌లో విడుదల కానుంది. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానున్నాయి. తెలుగు వెర్షన్ ఆంధ్ర హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణ రైట్స్ ఏషియన్ సినిమాస్ దక్కించుకున్నాయి. ''చక్కని కామెడీ ఫ్యామిలీ డ్రామాగా 'డియర్'ని వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. తమిళంలో పాటలు పాపులర్ అయ్యాయి. త్వరలోనే తెలుగు పాటలను విడుదల చేయనున్నాం'' అని తెలుగు హక్కులు సొంతం చేసుకున్న సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.


కథ రెడీ అవుతోంది!



టామ్‌క్రూజ్

హాలీవుడ్ ఫిల్మ్ 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం 'టాప్‌గన్ 3' సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి రెండు భాగాలు 'టాప్‌గన్', 'టాప్‌గన్: మావెరిక్' లో హీరోగా నటించిన టామ్ క్రూజ్‌యే 'టాప్ గన్ 3'లోనూ హీరోగా నటించనున్నారని తెలుస్తోంది. ''టాప్‌గన్ 3' బేసిక్ కథ సిద్ధంగా ఉంది. టామ్ క్రూజ్‌కు స్టోరీలైన్ చెప్పాం. ఆయన నచ్చిందని చెప్పారు. కథకు మెరుగులు దిద్దే పనిలో ఉన్నాం'' అని 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నిర్మాతల్లో ఒకరైన జెర్రీ బ్రూమ్ హైమర్ పేర్కొన్నారు.

ఆస్కార్ విజేత లూయిస్ గోసెట్ కన్నుమూత



హాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. అమెరికన్ ప్రముఖ నటుడు, ఆస్కార్ అవార్డు విజేత లూయిస్ గోసెట్ జూనియర్ (87) కాలిఫోర్నియాలో కన్నుమూశారు. లూయిస్ మరణాన్ని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించినట్లుగా హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. ఇక 1936లో లూయిస్ గోసెట్ సీనియర్, హెలెన్ రెబక్కా దంపతులకు మే 27న న్యూయార్క్‌లో జన్మించారు లూయిస్ గోసెట్ జూనియర్. చిన్నతనంలోనే లూయిస్‌కు నటన పట్ల ఆసక్తి ఉండేది. అలా 17ఏళ్ల వయసులోనే రంగస్థల నటుడిగా మారాడు లూయిస్. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చారు. 'ఎ రైసిన్ ఇన్ ది సన్, ది బ్లాక్స్, ది పనిషర్, స్కిన్‌గేమ్' వంటి సినిమాల్లో నటించారు. 'ది బుక్ ఆఫ్ నీగ్రోస్' వంటి టెలివిజన్ సిరీస్‌లలో కూడా నటించారు లూయిస్. ఇక 1982లో వచ్చిన 'యాన్ ఆఫీసర్ అండ్ ఏ జెంటిల్‌మేన్' సినిమాలోని నటనకుగాను 55వ ఆస్కార్ అవార్డ్స్‌లో లూయిస్ ఉత్తమ సహాయ నటుడు విభాగంలో అవార్డు అందుకున్నారు. కాగా ఈ విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న తొలి నల్లజాతి నటుడు లూయిస్‌నే అని హాలీవుడ్ సమాచారం. అలాగే ఇదే సినిమాకు ఉత్తమ సహాయ నటుడు విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా దక్కించుకున్నారు. 1977లో వచ్చిన మినీ సిరీస్ 'రూట్స్'లోని నటన లూయిస్‌కి మంచి పేరు తెచ్చిపెట్టడంతో పాటు ఎమ్మీ అవార్డు కూడా అందుకునేలా చేసింది.